veluturu telugu daily

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ శుక్రవారం 23.10.2026

సంపుటి : 9 సంచిక : 130

www. veluturu.com

## ప్రేమానురాగాలను పంచే వేదిక 'అలయ్ బలయ్'

- అన్ని పార్టీల నాయకులను ఒకే వేదికపైకి తీసుకురావడం దత్తాత్రేయకే సాధ్యం

2



# ముదిరాజులకు బీసీ-ఏపై మంత్రివర్గంలో చర్చిస్తాం

### పండుగ సాయన్న జయంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటనలు

- ముదిరాజుల వర్గీకరణపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తాం
- జనాభా లెక్కల్లో తేడాలుంటే ఆధారాలతో సవరిస్తాం
- ప్రభుత్వంలో ముదిరాజులకు సముచిత భాగస్వామ్యం కల్పిస్తాం
- ట్యాంక్‌బండ్‌పై పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలు
- బహుజనుల అభ్యున్నతికి రాహుల్ ప్రధాని కావాలి : సీఎం రేవంత్

ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే అంశంపై వచ్చే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇందుకోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో అధ్యయనం చేయిస్తామని వెల్లడించారు. ఈ అంశంలో ఇతర కులాలకు ఉన్న అపోహలు, అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వంలో ముదిరాజులకు సముచిత భాగస్వామ్యం కల్పించే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. పండుగ సాయన్న జయంతి సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ ముదిరాజుల అభ్యున్నతి, కులగణన, సామాజిక న్యాయం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

- హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 22



### కులగణనతోనే సామాజిక న్యాయం

బ్రిటిష్ పాలనలో చేపట్టిన కులగణన తర్వాత వందేళ్ల కు తమ ప్రభుత్వం తిరిగి కులగణన చేపట్టిందని ముఖ్య మంత్రి తెలిపారు. కులగణన కారణంగానే నేడు ప్రతి కులం తమ జనాభా, హక్కులు, వాటా గురించి బలంగా గళం వినిపించగలుగుతోందన్నారు. తమ జనాభా తక్కువగా నమోదైందని ఎవరైనా భావిస్తే పూర్తి ఆధారాలు సమర్పించాలని, వాటిని పరిశీలించి లెక్కలు సవరిస్తామని హామీ ఇచ్చారు. గతంలో సరైన జనాభా లెక్కలు లేకపోవడం వల్లే ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చలేకపోయారని - మిగతా 2 లో..



'బ్రహ్మోస్'కు ప్రపంచవ్యాప్తంగా

## భారీ డిమాండ్

### 2027-28 నాటికి 'నెక్స్ట్ జనరేషన్' సిద్ధం

- 'ఆపరేషన్ సిందూర్' సమయంలో యుద్ధరంగంలో తిరుగులేని సత్తా
- బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ, సీఈఓ డాక్టర్ జైతీర్థ్ జోషి

న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 22 :

భారత్ సైనిక ఎగుమతుల్లో 'బ్రహ్మోస్' సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి అగ్రభాగాన నిలుస్తోందని బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఎండీ, సీఈఓ డాక్టర్ జైతీర్థ్ జోషి వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో యుద్ధరంగంలో తిరుగులేని సత్తా చాటిన తర్వాత ప్రపంచ దేశాల నుంచి బ్రహ్మోస్‌కు భారీ డిమాండ్ ఏర్పడిందని ఆయన తెలిపారు. భవిష్యత్తులో 1,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించేలా బ్రహ్మోస్ పరిధిని విస్తరిస్తున్నట్లు ప్రకటించారు. 2022లో ఫిలిప్పీన్స్‌తో కుదిరిన తొలి చారిత్రక ఒప్పందంతో మొదలైన ప్రస్థానం ఆపరేషన్ సిందూర్ తర్వాత మరింత వేగం పుంజుకుందని బ్రహ్మోస్ సీఈఓ డాక్టర్ జైతీర్థ్ జోషి తెలిపారు. ఈ ఏడాది ఆగ్నేయాసియాలోని మరో రెండు దేశాలు ఇండోనేషియా, వియత్నాంలతోనూ ఒప్పందాలు కుదిరాయని, వీటితో బ్రహ్మోస్ ఎగుమతులు 600 మిలియన్ డాలర్లు దాటనున్నాయని వెల్లడించారు.

**2027-28 నాటికి 'బ్రహ్మోస్ నెక్స్ట్ జనరేషన్' తొలి నమూనా సిద్ధం**

భవిష్యత్ ప్రాజెక్టుల్లో భాగంగా భారత్‌కు చెందిన DRDO, రష్యా సంస్థ సంయుక్తంగా 'బ్రహ్మోస్-నెక్స్ట్ జనరేషన్ క్షిపణిని అభివృద్ధి చేస్తున్నాయి. పరిమాణంలో చిన్నదిగా, తక్కువ బరువుతో, శత్రు రాడార్లకు చిక్కకుండా ఉండే ఈ అధునాతన క్షిపణి తొలి నమూనా 2027-28 నాటికి సిద్ధమవుతుందని జోషి వెల్లడించారు. ఇది భారత వైమానిక దళ స్ట్రైక్ సామర్థ్యాన్ని మరింత పెంచనుంది. దీంతోపాటు - మిగతా 2 లో..



తెలంగాణలో ప్రధాని

## మోదీ పర్యటన

- వరంగల్ కేంద్రంగా అభివృద్ధి పనులు
- రైల్వే మ్యాన్ ఫ్యాక్టరింగ్ సెంటర్‌ను జాతికి అంకితం
- డిసెంబర్‌లో తెలంగాణకు రానున్న ప్రధాని మోదీ

2

## మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేయండి

- ప్రధాని మోదీకి నెతన్యాహు ఆహ్వానం
- ప్రధాని మోదీతో ఫోన్లో ఇజ్రాయెల్ ప్రధాని



## కరువు ప్రకృతిది కాదు.. కాంగ్రెస్ పాపమే!



- 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండుతున్నా సీఎం మొద్దునిద్ర
- వైఫల్యం పాలకులది.. బలిపశువులు అధికారులా?
- రేవంత్‌ది ముందుచూపు లేని పాలన
- కేసీఆర్‌కు పేరొస్తుందనే కక్షతో సాగునీటికి అడ్డుకట్ట
- మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజం

- వివరాలు 2 లో..

## డిండికి నీటి తరలింపు ఆపండి

హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 22 :

డిండి ప్రాజెక్టుకు పాలమూరు ప్రాంతం నుంచి నీటిని తరలించే ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో సమావేశమై వారు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ బృందంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ - మిగతా 2 లో..

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి పాలమూరు నేతల విజ్ఞప్తి
- మంత్రితో సమావేశమైన మహబూబ్‌నగర్ నేతలు
- ప్రస్తుత విధానంతో పాలమూరు ఆయకట్టుకు నష్టం తప్పదని ఆందోళన
- ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ





ఎల్‌నినో ప్రభావం ఉన్నా

## విద్యుత్ కొరత రాకుండా పటిష్ట చర్యలు

### రోజువారీ థర్మల్ విద్యుత్ ఉత్పత్తి 140 మిలియన్ యూనిట్లకు పెంచాలి

### యాదాద్రి ప్లాంట్‌కు కోల్ ఇండియా నుంచి ప్రత్యామ్నాయ బొగ్గు సరఫరా

### మూతపడిన పరిశ్రమల విద్యుత్ బకాయిలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశం

హైదరాబాద్, అక్టోబర్ 22 (వెలుతురు):

ఎల్‌నినో ప్రభావంతో జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం, రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ పెరిగే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో విద్యుత్ కొరత తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రానున్న రబీ, వేసవి సీజన్లలో వ్యవసాయ, గృహ విద్యుత్ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని రోజుకు 140 మిలియన్ యూనిట్లకు పెంచాలని స్పష్టం చేశారు.

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, బకాయిల వసూళ్లపై విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం టీజీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి రోజుకు సగటున 90.97 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోందని అధికారులు వివరించారు. అక్టోబర్ 16న ఒక్కరోజులో 118 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి నమోదైనట్లు - మిగతా 11 లో..



12

## ఓరుగల్లుపై అభివృద్ధి జల్లు

- వరంగల్ కోట అభివృద్ధికి ప్రభుత్వ పరిపాలన అనుమతులు
- మొత్తం రూ. 382 కోట్ల విలువైన పనులకు గ్రీన్ సిగ్నల్
- వేయి స్తంభాల గుడి, బస్ టెర్మినల్ వంటి పనులకు ఆమోదం
- ప్రపంచ బ్యాంకు నిధులతో 'కుడా' ఆధ్వర్యంలో పనుల నిర్వహణ

## తెలంగాణలో మద్యం సునామీ..

### మూడు రోజుల్లో రూ.653 కోట్ల విక్రయాలు!



### అక్టోబర్ 19 నాటికి రూ.2,054 కోట్లకు చేరిన మద్యం విక్రయాలు

### గతేడాదితో పోలిస్తే రూ.555 కోట్లు అధికం

హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 22:

తెలంగాణలో దసరా పండుగ వేళ మద్యం విక్రయాలు భారీగా పెరిగాయి. పండుగ సందడి నేపథ్యంలో మద్యం దుకాణాలకు డిమాండ్ పెరగడంతో కేవలం మూడు రోజుల్లోనే రూ.652.92 కోట్ల విలువైన మద్యం డిపోల నుంచి వైన్ షాపులకు తరలింది. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీబీసీఎల్) గణాంకాల ప్రకారం మద్యం స్టాక్ లిఫ్టింగ్‌లో గణనీయమైన పెరుగుదల నమోదైంది.

ఈ ఏడాది అక్టోబర్ 19 నాటికి వైన్ షాపుల యజమానులు డిపోల నుంచి మొత్తం రూ.2,054.51 కోట్ల విలువైన మద్యం స్టాక్‌ను తీసుకున్నారు. గతేడాది ఇదే సమయానికి ఈ మొత్తం రూ.1,499.46 కోట్లుగా ఉంది. దీంతో గతేడాదితో పోలిస్తే ఈసారి రూ.555.05 కోట్ల మేర అధికంగా మద్యం స్టాక్ లిఫ్టింగ్ జరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

దసరా పండుగ సందర్భంగా మద్యం విక్రయాలు పెరుగుతాయన్న అంచనాతో వైన్ షాపుల యజమానులు ముందుగానే భారీగా స్టాక్‌ను సమకూర్చుకున్నారు. పండుగ అవసరాలకు అనుగుణంగా డిపోల నుంచి పెద్ద మొత్తంలో మద్యం తరలించడంతో ఈ స్థాయిలో పెరుగుదల నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

పండుగ సీజన్‌లో మద్యం సరఫరా, డిమాండ్ పెరుగుదల నేపథ్యంలో ఈ గణాంకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే డిపోల నుంచి వైన్ షాపులకు తరలించిన మద్యం విలువను, వినియోగదారులకు జరిగిన తుది రిటైల్ అమ్మకాల విలువను వేర్వేరుగా పరిగణించాల్సి ఉంటుంది.

## చేతకాకపోతే కాంట్రాక్ట్ మాకివ్వండి!

- మంత్రి జూపల్లి సవాల్‌ను స్వీకరించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి
- తుండు కట్ట తొలగిస్తే మూడు రిజర్వాయర్లకు నీళ్లు
- కేసీఆర్‌కు పేరొస్తుందనే పాలమూరు ప్రాజెక్టు నిర్లక్ష్యం
- రైతులకు నీళ్లివ్వకుండా మూడేళ్లుగా కుంటిసాకులు చెబుతున్నారని మండిపాటు

12



### పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

## విజయం కోసం సమష్టిగా కృషి చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- నవంబర్ 6 లోపు అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలి

12



# మచ్చర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేయండి

- ప్రధాని మోదీకి నెతన్యాహు ఆహ్వానం
- ప్రధాని మోదీతో ఫోన్లో ఇజ్రాయెల్ ప్రధాని





**జెరూసలెం(ఇజ్రాయెల్), వెలుతురు అక్టోబర్ 22 :**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీతో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఫోన్‌లో సంభాషించారు. భారత్తో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సంబంధాలకు మరింత ప్రాధాన్యత ఇస్తూ, ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని ప్రధాని మోదీని ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆహ్వానించారు. భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి వేడుకల్లో జ్యోతి వెలిగించాలని కోరినట్లు వెల్లడించారు. ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం నెతన్యాహు గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన, చిరకాల సంబంధాలను మోదీ ప్రశంసించినట్లు తెలిపారు.

భారత ప్రధాని మోదీతో మాట్లాడటం సంతోషంగా ఉందని నెతన్యాహు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో భారత పైలట్ స్మిత్ మచ్చర్‌తో కలిసి జ్యోతి వెలిగించాలని మోదీని ఆహ్వానించినట్లు వివరించారు. ఈ ఆహ్వానానికి మోదీ కృతజ్ఞతలు తెలిపారని నెతన్యాహు వెల్లడించారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్, ఇజ్రాయెల్ కలిసి పనిచేస్తున్నాయని మోదీ పేర్కొన్నట్లు తెలిపారు. భూమిపై మాత్రమే కాకుండా గగనతలంలోనూ ఇరు దేశాలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని మోదీ అభిప్రాయపడినట్లు నెతన్యాహు తన పోస్టులో వివరించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు ప్రధాని మోదీ తెలిపారు. ఈ మేరకు ఎక్స్లో పోస్ట్ చేశారు. భారత్, ఇజ్రాయెల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో సాధించిన వృద్ధిని ఇరు దేశాధినేతలు సమీక్షించినట్లు వెల్లడించారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా తమ నిబద్ధతను ఇరువురు నేతలు పునరుద్ఘాటించారని తెలిపారు. అలాగే పశ్చిమాసియా పరిణిమాలపై కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించాల్సిన అత్యవసర అవసరాన్ని నొక్కి చెప్పినట్లు పేర్కన్నారు.

# రాజకీయాలకు అతీతంగా

# ప్రేమానురాగాలను పంచే వేదిక 'అలయ్ బలయ్'

- అన్ని పార్టీల నాయకులను ఒకే వేదికపైకి తీసుకురావడం దత్తాత్రేయకే సాధ్యం



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 22:**

రాజకీయాలకు అతీతంగా ప్రేమానురాగాలు, ఆత్మీయతను పంచుతూ, అన్ని పార్టీల నాయకులను ఒకే వేదికపైకి తీసుకొచ్చే అద్భుతమైన సంప్రదాయం 'అలయ్ బలయ్' అని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. రాజకీయాల్లో శత్రుత్వానికి తావులేకుండా స్నేహభావం, పరస్పర గౌరవం ఉండాలనే గొప్ప సందేశాన్ని ఈ కార్యక్రమం అందిస్తోందని పేర్కొన్నారు. బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దసరా పండుగ సమాజానికి చాటిచెప్పే ఐక్యత, స్నేహం, సోదరభావం వంటి విలువలను అలయ్ బలయ్ కార్యక్రమం ఆచరణలో చూపిస్తోందన్నారు. రాజకీయ పార్టీల మధ్య విభేదాలు, సిద్ధాంతపరమైన భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, అందరూ కలిసి ఆత్మీయంగా మెలగడానికి ఈ వేదిక చక్కని అవకాశాన్ని కల్పిస్తోందని తెలిపారు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ అలయ్ బలయ్ కార్యక్రమానికి తప్పకుండా సమయం కేటాయిస్తానని మంత్రి స్పష్టం చేశారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు, స్నేహితులు, బంధువులు ఒకే వేదికపై కలుసుకుని ఆత్మీయంగా మాట్లాడుకోవడం ఈ కార్యక్రమం ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఇలాంటి సంప్రదాయాలు సమాజంలో సుహృద్భావ వాతావరణాన్ని పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. రాజకీయ నాయకుల మధ్య ఉండాల్సింది శత్రుభావం కాదని, ప్రజా సంక్షేమం కోసం తమ తమ బాధ్యతలను నిర్వర్తిస్తూనే పరస్పర గౌరవం, స్నేహభావంతో ముందుకు సాగాలని వివేక్ వెంకటస్వామి సూచించారు. రాజకీయాల్లోనూ 'దోస్తానా' సంస్కృతి కొనసాగాల్సిన అవసరం ఉందని, అలయ్ బలయ్ వంటి కార్యక్రమాలు ఆ విలువలను భావితరాలకు అందిస్తాయని పేర్కొన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న అలయ్ బలయ్ కార్యక్రమం ప్రతి ఏడాది మరింత వైభవంగా, ఉత్సాహంగా కొనసాగాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ అద్భుతమైన సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న బండారు దత్తాత్రేయకు, కార్యక్రమ నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన

- వరంగల్ కేంద్రంగా అభివృద్ధి పనులు
- రైల్వే మ్యాన్ ఫ్యాక్చరింగ్ సెంటర్‌ను జాతికి అంకితం
- డిసెంబర్‌లో తెలంగాణకు రానున్న ప్రధాని మోదీ



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 22 :**

తెలంగాణలో ప్రధాని మోదీ పర్యటన డిసెంబర్ నెలలో ఉంటుందని రాష్ట్ర బీజేపీ స్ప ష్టం చేసింది. వరంగల్లో రైల్వే మ్యాన్ ఫ్యాక్చరింగ్ సెంటర్, కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌ను జాతికి అంకితం చేయనున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో నవంబర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటిస్తారని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలుస్తోంది. మొత్తానికి పశ్చిమ బెంగాల్ తర్వాత బీజేపీ తెలంగాణపై ఫోకస్ చేసినట్లుగా కనిపిస్తోంది.

హైదరాబాద్లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో రామచందర్‌రావు అధ్యక్షతన ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్ రావులు పాల్గొన్నారు. బీజేపీ ముఖ్యనేతలు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ఇతర నేతలు కూడా ఉన్నారు. ముఖ్యనేతల సమావేశంలో బీజేపీ కీలక నిర్ణయాలు తీసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ తెలంగాణ బీజేపీ నవంబర్ 1న హైదరాబాద్‌లో భారీ ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టనుంది. సర్‌పై కాంగ్రెస్, కాక్రోచ్ జనతా పార్టీలు చేస్తున్న రాద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీ వివిధ కార్యక్రమాలు నిర్వహించనుంది. ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ పాదయాత్ర చేయనున్నట్లు వెల్లడించింది. "ప్రజాస్వామ్యాన్ని రక్షించండి, గుంపు సామ్యాన్ని ఓడించండి" అంటూ తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్‌రావు పిలుపునిచ్చారు. దేశాన్ని బీజేపీ మాత్రమే రక్షిస్తుందనే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

# కరువు ప్రకృతిది కాదు.. కాంగ్రెస్ పాపమే!

- 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండుతున్నా సీఎం మొద్దునిద్ర
- వైఫల్యం పాలకులది.. బలిపశువులు అధికారులా?
- కేసీఆర్‌కు పేరొస్తుందనే కక్షతో సాగునీటికి అడ్డుకట్ట
- మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజం



**గజ్వేల్, వెలుతురు అక్టోబర్ 22 :**

రాష్ట్రంలో నెలకొన్నది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం సృష్టించిన కరువని మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. పది నెలల ముందే ఎల్‌నినో హెచ్చరికలు వచ్చినా ముందస్తు చర్యలు చేపట్టకుండా 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు. రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్లు.. రైతులు కన్నీరు పెడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొద్దునిద్ర పోతున్నారని ధ్వజమెత్తారు. విద్యుత్ కొనుగోళ్లు చేయకుండా, బొగ్గు నిల్వలు సమకూర్చకుండా ఇప్పుడు అధికారులను సస్పెండ్ చేస్తామనడం సిగ్గుచేటన్నారు. సస్పెండ్ చేయాల్సింది అధికారులను కాదని, అసమర్థ ముఖ్యమంత్రిని, విద్యుత్ శాఖ మంత్రిని అని వ్యాఖ్యానించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బూరుగుపల్లిలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించిన అనంతరం బాధిత రైతులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

### ముందుచూపు లేని పాలన.. ఎండుతున్న పంటలు

కరువు ముప్పును ముందుగానే గుర్తించి ఇతర రాష్ట్రాలు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకుంటే తెలంగాణ ప్రభుత్వం తొమ్మిది నెలలపాటు నిద్రపోయిందని హరీశ్‌రావు ఆరోపించారు. యాదాద్రి ఐదో యూనిట్‌ను సకాలంలో అందుబాటులోకి తేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఆదిలాబాద్, నల్లగొండ, మెదక్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఎకరాకు పది క్వింటాళ్లు రావాల్సిన దిగుబడి రెండు, మూడు క్వింటాళ్లకు పడిపోయే పరిస్థితి ఉందన్నారు. మహారాష్ట్ర రైతులకు ఎకరాకు రూ.5 వేల సాయం అందిస్తుంటే తెలంగాణలో కరువు మండలాలను ప్రకటించే దిక్కులేదని విమర్శించారు.

బూరుగుపల్లిలో రైతు అరవింద్‌రెడ్డి పంటను కాపాడుకునేందుకు జనరేటర్, డీజిల్ కోసం మూడు రోజుల్లో రూ.21 వేలు ఖర్చు చేసినా రెండున్నర ఎకరాలు ఎండిపోయాయని తెలిపారు. రైతులు అప్పులు చేసి సాగుచేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. కరోనా విపత్తులోనూ కేసీఆర్ నిరంతర విద్యుత్, సాగునీరు అందించి కోటి టన్నుల పంట పండిస్తే.. రేవంత్‌రెడ్డి ఎల్‌నినో సాకుతో రైతులను శిక్షిస్తున్నారని ఎద్దేవా చేశారు.

కన్నెపల్లి మోటార్లు ఆన్ చేసి మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ నింపితే కేసీఆర్‌కు పేరు వస్తుందనే రాజకీయ అక్కసుతోనే ప్రభుత్వం సాగునీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. దేవాదుల వద్ద గోదావరి జలాలు అందుబాటులో ఉన్నా మోటార్లను పూర్తిస్థాయిలో నడపడం లేదన్నారు. కల్వకుర్తి కింద 35 టీఎంసీల నీటిని ఎత్తిపోయాల్సిన చోట కేవలం 13 టీఎంసీలకే పరిమితం చేశారని విమర్శించారు. ప్రాజెక్టుల్లో నీళున్నా పొలాలకు అందించలేని అసమర్థ పాలన వల్లే కృత్రిమ కరువు ఏర్పడిందని, కేసీఆర్‌పై రాజకీయ కక్ష తీర్చుకునేందుకు రైతుల పంటలను బలిపెడుతున్నారని మండిపడ్డారు.

### ప్రజలపై భారాలు.. రైతులకు పరిహారం ఏది?

కరువుతో రైతులు అల్లాడుతుంటే ప్రజలపై రూ.5,420 కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపడం దుర్మార్గమని హరీశ్‌రావు విమర్శించారు. ఆర్టీసీ చార్జీల పెంపుతోపాటు నిత్యావసరాల ధరలు సామాన్యుల నడ్డి విరుస్తున్నాయన్నారు. వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రూ.12 వేలు ఇస్తామని బడ్జెట్‌లో ప్రకటించి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ కక్షలు వీడి కన్నెపల్లి, దేవాదుల, కల్వకుర్తి మోటార్లను 24 గంటలూ నడిపించాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ నుంచి నీటిని విడుదల చేసి నాణ్యమైన విద్యుత్ అందిస్తే మిగిలిన పంటలనైనా కాపాడుకోవచ్చన్నారు.

తక్షణమే కరువు మండలాలను ప్రకటించి ఎండిపోయిన 12 లక్షల ఎకరాల పంటలకు నష్టపరిహారం అందించాలని, వ్యవసాయ కూలీలకు రూ.12 వేల సాయం విడుదల చేయాలని కోరారు. పెంచిన విద్యుత్, ఆర్టీసీ చార్జీలను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# 'బ్రహ్మోస్'కు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్

(మొదటిపేజీ తరువాయి)

తొలుత 290 కిలోమీటర్లుగా ఉన్న బ్రహ్మోస్ పరిధిని భవిష్యత్తులో 1,500 కిలోమీటర్లకు పెంచే బృహత్తర ప్రాజెక్టు కూడా ప్రణాళికా దశలో ఉందని తెలిపారు.

"ప్రపంచం ఎల్లప్పుడూ బ్రహ్మోస్‌ను ఆశ్చర్యంతో, అద్భుతంతో చూస్తూ వచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత బ్రహ్మోస్ క్షిపణి నేటి సంక్లిష్టమైన, అధిక తీవ్రత గల యుద్ధానికి ఒక అత్యంత అభివృద్ధి చెందిన, శక్తివంతమైన వ్యవస్థ అని నిరూపించుకుంది. భారతదేశపు సాటిలేని 'ఫస్ట్ స్ట్రైక్' ఆయుధంగా, బ్రహ్మోస్ తన సామర్థ్యంలో అత్యంత ప్రాణాంతకమైన ఆయుధంగా తన శక్తిని, ఆధిపత్యాన్ని చూపించింది. మేము 2027 లేదా 2028 నాటికి బ్రహ్మోస్-నెక్ట్స్ జనరేషన్ క్షిపణి మొదటి నమూనాను అభివృద్ధి చేయాలని ఆశిస్తున్నాం. ఈ కొత్త వ్యవస్థలో స్వదేశీ పరిజ్ఞానం అధికంగా ఉండటంతో పాటు అనేక కొత్త సాంకేతికతలు ఉంటాయి. కాబట్టి, మేము విస్తృతమైన పరిశోధన, అభివృద్ధి (R&D) పనులను చేపట్టాల్సి ఉంది. మేము మా ప్రణాళికలను రూపొందించుకుని ఆ దిశగా స్థిరంగా ముందుకు సాగుతున్నాం. ప్రస్తుతానికి ఇది అభివృద్ధి దశలో ఉంది.

మేము దశలవారీగా దీని సామర్థ్య విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టాం. భూమి, సముద్రం, గాలి నుంచి నిర్వహించిన పరీక్షల్లో ఈ క్షిపణి తన ప్రారంభ 290 కిలోమీ టర్ల స్ట్రైక్ పరిధిని అధిగమించి, తన సుదూర సామర్థ్యాలను మెరుగుపరుచుకుంది. 1,500 కిలోమీటర్ల రేంజ్ అనేది మా భవిష్యత్ రోడ్‌మ్యా ప్‌లో ఒక భాగం. క్షిపణి వ్యవస్థలో మరింత ఆధునీకరణ కోసం మా జాయింట్ వెంచర్ భాగస్వామితో చర్చలు జరుపుతున్నాం" అని డాక్టర్ జోషి అన్నారు.

### హైదరాబాద్, నాగ్‌పూర్, పిలానీ, లక్నో యూనిట్లలో పూర్తిస్థాయి ఉత్పత్తి

మరోవైపు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు జైతీర్థ్ జోషి చెప్పారు. భారత సాయుధ బలగాల ఆర్డర్లను పూర్తి చేసేందుకు హైదరాబాద్, నాగ్‌పూర్, పిలానీతో పాటు కొత్తగా ఏర్పాటు చేసిన లఖ్‌నవూలో ఉత్పత్తి కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని తెలిపారు. నాణ్యత, ధరల్లో పోటీతత్వం పెంచేందుకు ప్రతి విభాగంలోనూ పారిశ్రామిక భాగస్వాముల సంఖ్యను 1-2 నుంచి 45కు పెంచుతున్నట్లు వివరించారు.

# దక్షిణాది రాష్ట్రాల పోలీసు సమన్వయ కమిటీ భేటీ

- ఐసీసీసీలో డిజిపిలు, ఐజిల సమావేశం- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఉగ్రవాదం, మాదకద్రవ్యాలు, సైబర్ నేరాల కట్టడిపై చర్చ
- అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణ, ఉమ్మడి సహకారం, కార్యాచరణపై సమీక్ష



**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 22:**

దక్షిణాది రాష్ట్రాల మధ్య పోలీసు సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు ఉమ్మడి కార్యాచరణ రూపొందించడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ పోలీసు సమన్వయ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) నిర్వహిస్తున్నట్లు డిజిపి సి.వి.ఆనంద్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతాలైన అండమాన్ నికోబార్ దీవులు, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లకు చెందిన డిజిపిలు, ఐజీలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటెలిజెన్స్ బ్యూరో, సిబిఐ, డిపార్ట్మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్, ఎన్‌ఐఏ, సిఐఎస్ఎఫ్, బిఎస్ఎఫ్, సిఆర్పిఎఫ్ సంస్థల అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పోలీసు శాఖలు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలు, పరస్పర సహకారం, సమన్వయంతో నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు.

### ప్రధాన అంశాలపై చర్చ

ఉగ్రవాదం, మావోయిస్టు కార్యకలాపాల అనంతర పరిస్థితులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అంతర్రాష్ట్ర సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, ఆర్థిక నేరాలు, యువత నిరసనలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలు సమావేశం ఎజెండాలో ఉన్నాయి. అంతర్రాష్ట్ర నేరగాళ్ల ముఠాల కదలికలు, నేరగాళ్ల సమాచార మార్పిడి, నేరాల దర్యాప్తులో ఎదురవుతున్న సమస్యలు, ఆయా రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరిచే మార్గాలపై సమీక్షించనున్నారు.

దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న నూతన క్రిమినల్ చట్టాల అమలు తీరు, సముద్ర తీర ప్రాంతాల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ, పోలీసింగ్‌లో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం వంటి అంశాలపైనా విస్తృతంగా చర్చించనున్నారు. దక్షిణాది రాష్ట్రాలు పరస్పర సహకారంతో పనిచేస్తే సరిహద్దులు దాటి విస్తరిస్తున్న నేరాలను సమర్థంగా అరికట్టవచ్చన్న లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహిస్తున్నారు.

# ముదిరాజులకు బీసీ-ఏపై మంత్రివర్గంలో చర్చిస్తాం





(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నారు. జఠిలమైన ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తమ ప్రభుత్వం బీసీ కులగణనను కూడా చేపట్టి సామాజిక న్యాయం దిశగా ముందడుగు వేసిందన్నారు.

### ముదిరాజులకు రాజకీయ ప్రాధాన్యం

కొడంగల్ నియోజకవర్గంలో అత్యధిక జనాభా ముదిరాజులదేనని, వారు ఎంతో విశ్వసనీయమైన వారని రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టగానే శ్రీహరి ముదిరాజ్‌ను డీసీసీ అధ్యక్షుడిగా నియమించానని గుర్తుచేశారు. అనంతరం ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి, మంత్రివర్గంలోనూ అవకాశం కల్పించామన్నారు. నీలం మధుకు ఎంపీ టికెట్ ఇచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. ముదిరాజులకు ఎమ్మెల్సీ టికెట్ కేటాయించే అంశాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు. ముదిరాజులను ప్రభుత్వంలో భాగస్వాములను చేసేందుకు తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు.

### దొరల గుండెల్లో దడ పుట్టించిన ప్రజావీరుడు

నిజాం పాలనలో దొరలు, భూస్వాముల దౌర్జన్యాలను ఎదిరించి పేదల పక్షాన నిలిచిన మహనీయుడు పండుగ సాయన్న అని సీఎం కొనియాడారు. భూస్వాములు తన భూమిని ఆక్రమించుకున్నప్పుడు తిరగబడిన సాయన్న, ఆ తర్వాత పేదల భూములను కబ్జా చేస్తున్న దొరలకు వ్యతిరేకంగా దళాన్ని ఏర్పాటు చేశారని వివరించారు. ప్రజలకు ధాన్యం పంచడంతోపాటు పేదింటి ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సాయం చేశారని గుర్తుచేశారు. నిజాం పోలీసులు సాయన్న ను అరెస్టు చేసినప్పుడు నాటి వనపర్తి మహారాణి పెద్ద మొత్తంలో నిధులు చెల్లించి విడిపించారని తెలిపారు. చివరకు సాయన్నను అన్యాయంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణించి వందేళ్లు దాటినా నేటికీ నాట్లు, కోతల సమయంలో పల్లెల్లో సాయన్న పాటలు వినిపిస్తున్నాయంటే ప్రజల గుండెల్లో ఆయనకు ఉన్న స్థానం ఏమిటో అర్థమవుతుందన్నారు.

### ట్యాంక్‌బండ్‌పై ప్రజావీరుల విగ్రహాలు

చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న వంటి బహుజన పోరాటయోధుల చరిత్రను కనుమరుగు చేశారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వారి త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇందులో భాగంగా ట్యాంక్‌బండ్ పరిసరాల్లో పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. పండుగ సాయన్న, గద్దర్, అందెశ్రీ వంటి మహనీయులు తమ జీవితాలను సమాజం కోసమే అంకితం చేశారని కొనియాడారు. కాగా, పండుగ సాయన్న 174వ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి వేడుకలు నిర్వహించగా, జిల్లాల్లోనూ అధికారిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. బీసీ సంక్షేమశాఖను ఈవేడుకలకు నోడల్ శాఖగా నియమించారు.

### గత పాలన కంటే రెట్టింపు సంక్షేమం

ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గతంలో ఎన్టీఆర్ కిలో రెండు రూపాయలకే బియ్యం అందిస్తే, తమ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తోందన్నారు. రాష్ట్రంలో 3.48 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతులకు ఆర్థిక సాయం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, కేసీఆర్ హయాంలో అమలైన మంచి పథకాలను కొనసాగిస్తూనే అంతకంటే మెరుగైన సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారిక రాష్ట్ర గీతాన్ని ప్రకటించుకున్న ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు.

### రాహుల్ ప్రధాని కావాలి

దేశంలో బహుజనుల జీవితాలు బాగుపడాలంటే రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రాబోయే ఎన్నికలు ఎంతో కీలకమైనవని, ఆ ఎన్నికల్లో రాహుల్‌గాంధీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. బలహీనవర్గాలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా సముచిత అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# డిండికి నీటి తరలింపు ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

మల్లు రవి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, సీనియర్ నేత జానా రెడ్డితో పాటు పలువురు స్థానిక ఎమ్మెల్యేలు ఉన్నారు.

సుమారు గంటన్నర పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో, డిండి ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలను నేతలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాము డిండి ప్రాజెక్టుకు నీటి సరఫరా చేయడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే ప్రస్తుతం అందుబాటులో ఉన్న వనరుల నుంచి నీటిని మళ్లిస్తే పాలమూరు ఆయకట్టుకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వారు వివరించారు. కావున, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డిండి ప్రాజెక్టుకు నీటిని తరలించే అంశాన్ని పరిశీలించాలని వారు ప్రభుత్వానికి సూచించారు.

పాలమూరు నేతలు వ్యక్తం చేసిన అభ్యంతరాలను, అభిప్రాయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సావధానంగా ఆలకించారు. ఈ విషయంపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించి, అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

తమ ప్రాంత ప్రయోజనాలను కాపాడాలన్న విజ్ఞప్తిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఈ సందర్భంగా నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదును ప్రతిష్ఠాత్మకంగా తీసుకోండి

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే అత్యధిక మెజార్టీ రావాలి
- ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 22 :** 'హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్‌నగర్' గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని కాంగ్రెస్ శ్రేణులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచే అత్యధిక మెజార్టీ రావాలని, ఆ దిశగా బూత్ స్థాయి నుంచే పక్కా ప్రణాళిక రూపొందించుకుని, పాత-కొత్త నేతలంతా సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. శంషాబాద్ మల్లికా గార్డెన్స్ లో గురువారం నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేడర్ కు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయమన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రభుత్వోద్యోగాల భర్తీ, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్, బీజేపీ కుట్రలను బలంగా ఎదుర్కొంటూనే... వారి వైఫల్యాలను పట్టభద్రుల ముందు ఎండగట్టాలన్నారు. ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా గట్టిగా తిప్పికొట్టాలన్నారు. గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా ప్రత్యేక ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలని శ్రేణులకు సూచించారు. బూత్ స్థాయి నుంచి ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు. దరఖాస్తుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పక్కాగా పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు, ప్రచారంలో అత్యుత్తమంగా పనిచేసే కార్యకర్తలకు, నేతలకు పార్టీలో తగిన ప్రాధాన్యత ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ డా.మల్లు రవి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, మనోహర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఏఐసీసీ ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఛైర్మన్ మధు యాష్కీ, ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ డీసీసీ అధ్యక్షులు పారిజాత నర్సింహారెడ్డి, వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గడ్డం పెంచితే కేటీఆర్
# సీఎం అయిపోతాడా?

- ధర్మపురి అర్వింద్ వ్యంగ్యాస్త్రాలు
- 2028లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమన్న ఎంపీ అర్వింద్



**నిజామాబాద్, వెలుతురు అక్టోబర్ 22:** నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడ్డం పెంచుకుంటే ముఖ్యమంత్రి అవుతారని ఎవరో చెప్పడం వల్లే కేటీఆర్ ఆ పని చేస్తున్నారని, అయితే ఆయన గడ్డం పెరుగుతుందే తప్ప సీఎం మాత్రం కాలేరని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ సునామీ ఖాయమని, బీజేపీ ఒంటరిగానే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని, ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కోసం తెరవెనుక చర్చలు జరుగుతున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఈ పొత్తుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక్కరే అడ్డంకిగా ఉన్నారని, ఆయనపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తితో ఉందని అన్నారు. బీఆర్ఎస్‌తో కుమ్మక్కై రేవంత్‌ను సీఎం పదవి నుంచి తొలగించేందుకు అధిష్ఠానం ప్రయత్నిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీజేపీ సైలెంట్ గా ఉందన్న ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. రాజకీయ తుపాను సృష్టించేందుకు తెరవెనుక పనులు జరుగుతున్నాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా గడ్డం పెంచారని, ఆయన గడ్డం పెరిగింది కానీ కాంగ్రెస్ పార్టీ ఎదగలేకపోయిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసే పరిస్థితి లేదని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోకుండానే విజయం సాధిస్తుందని అర్వింద్ స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌కు పోటెత్తిన జనం

- నగరానికి నలువైపులా భారీగా ట్రాఫిక్ జామ్
- గంటల తరబడి వాహనదారుల అవస్థలు



**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 22 :** దసరా పండుగ సెలవులు ముగియడంతో ప్రజలు తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటున్నారు. దీంతో గురువారం నగరానికి వచ్చే ప్రధాన రహదారులపై భారీగా ట్రాఫిక్ రద్దీ నెలకొంది. నగరానికి నలువైపులా వాహనాలు బారులు తీరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంటల తరబడి వాహనాలు ముందుకు కదలకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లిన కుటుంబాలు తిరిగి నగరానికి చేరుకోవడంతో ప్రధాన రహదారులపై వాహనాల సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. కార్లు, ద్విచక్ర వాహనాలు, బస్సులతో రహదారులు కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా నగరంలోకి ప్రవేశించే మార్గాల్లో వాహనాల రాకపోకలు నెమ్మదించాయి. దీంతో గమ్యస్థానాలకు చేరుకోవడానికి సాధారణ సమయం కంటే ఎక్కువ సమయం పట్టింది. దసరా సెలవుల అనంతరం ఒక్కసారిగా పెరిగిన రద్దీతో నగర రహదారులపై ట్రాఫిక్ సమస్య తీవ్రంగా కనిపించింది. ప్రయాణికులు ట్రాఫిక్‌లో చిక్కుకుని అవస్థలు పడాల్సి వచ్చింది

# కొమురం భీం ఆశయాలను కాపాడుకోవాలి

- ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు కొమురం భీం: మంత్రి సీతక్క





**దుమ్ముగూడెం, (భద్రాద్రి కొత్తగూడెం), వెలుతురు అక్టోబర్ 22:** నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, "జల్, జంగల్, జమీన్" నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు కొమురం భీం అని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో గురువారం నాడు నిర్వహించిన కొమురం భీం విగ్రహావిష్కరణ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు సహా పెద్ద సంఖ్యలో ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీ సమాజానికి కొమురం భీం ఒక దిక్సూచి అని, ఆయన పోరాట స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, అస్తిత్వం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ఎప్పటికీ మరచిపోకూడదని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్, కొమురం భీం, బిర్సా ముండా, జ్యోతిరావు పూలే వంటి మహనీయులు తమ పోరాటాలతో సమాజంలో మార్పునకు బాటలు వేశారని సీతక్క అన్నారు. వారు చేసిన త్యాగాలు, పోరాటాల ఫలితంగానే అణగారిన వర్గాలకు హక్కులు, రిజర్వేషన్లు, చట్టపరమైన రక్షణలు అందాయని పేర్కొన్నారు. అలాంటి మహనీయులను మన హృదయాల్లో నిలుపుకొని, వారి ఆశయాలను ఆచరణలో కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీలు ఇతర సామాజిక వర్గాలతో కలిసిమెలిసి జీవిస్తూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారని మంత్రి అన్నారు. ఆదివాసీ పోరాటాలు దేశ చరిత్రలో కీలకమైనవని, అణచివేతకు వ్యతిరేకంగా వారు సాగించిన పోరాటాలు హక్కుల సాధనకు మార్గం చూపాయని పేర్కొన్నారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీతక్క అన్నారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, ఐక్యంగా పరిష్కారాలు సాధించుకోవాలని సూచించారు. పరస్పర సహకారం, ఐక్యతతోనే ఆదివాసీ సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కొమురం భీం విగ్రహావిష్కరణకు ఆదివాసీ సంఘాలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడం సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని పిలుపునిస్తూ జై కొమురం భీ అని నినదించారు.

# మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో 16 కేటగిరీల్లో ఉద్యోగాలు



**మేడ్చల్-మల్కాజిగిరి, వెలుతురు అక్టోబర్ 22:** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం), పట్టణ జాతీయ ఆరోగ్య మిషన్ (యూఎన్‌హెచ్ఎం) సహా వివిధ ఆరోగ్య పథకాల కింద ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్ నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం 16 కేటగిరీల్లో మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, ఇతర సిబ్బంది పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. నోటిఫికేషన్ ప్రకారం మెడికల్ ఆఫీసర్లు 17, స్టాఫ్ నర్సులు వివిధ విభాగాల్లో 50, సపోర్టింగ్ స్టాఫ్ 9, MLHP/CHO/MO విభాగంలో 13, ఏఎన్ఎంలు 8, ల్యాబ్ టెక్నీషియన్లు 16 పోస్టులు ఉన్నాయి. వీటితోపాటు జిల్లా ఎపిడెమియాలజిస్ట్, పబ్లిక్ హెల్త్ మేనేజర్, ఫార్మసిస్టులు, ఆర్బీఎస్కే/ఆర్కేఎస్కే కోఆర్డినేటర్, ఎం-మినీహబ్ మేనేజర్ తదితర పోస్టులను భర్తీ చేయనున్నారు. మొత్తం ఖాళీల సంఖ్య 119గా ఉంది. పోస్టులను బట్టి నెలవారీ వేతనం రూ.15,600 నుంచి రూ.52,000 వరకు చెల్లించనున్నారు. మెడికల్ ఆఫీసర్లకు రూ.52,000, జిల్లా ఎపిడెమియాలజిస్ట్‌కు రూ.50,000, MLHP/CHO/మో పోస్టులకు అర్హతను బట్టి రూ.40,000 లేదా రూ.29,900, స్టాఫ్ నర్సులకు రూ.29,900, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులకు రూ.27,300 వేతనం నిర్ణయించారు. ఇతర పోస్టులకు నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా వేతనాలు చెల్లిస్తారు. అభ్యర్థులు సంబంధిత పోస్టులను బట్టి నిర్దేశించిన విద్యార్హతలు కలిగి ఉండాలి. మెడికల్, నర్సింగ్, ఫార్మసీ, పారామెడికల్ పోస్టులకు సంబంధిత రాష్ట్ర కౌన్సిళ్లలో రిజిస్ట్రేషన్ తప్పనిసరి. కొన్ని పోస్టులకు పబ్లిక్ హెల్త్, హెల్త్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాల్లో ఉన్నత విద్యార్హతలతోపాటు పని అనుభవం కూడా అవసరం.

**దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 23 నుంచి...**

నోటిఫికేషన్ నంబర్ 286/E1/DMHO/ MDCL /2026 ప్రకారం అక్టోబర్ 23 నుంచి 28 వరకు, ఆదివారం మినహా, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అభ్యర్థులు రూ.500 రిజిస్ట్రేషన్ ఫీజును ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా పేరిట సమర్పించాలి. పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాలు, డిమాండ్ డ్రాఫ్ట్‌తో కలిపి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయం, F-1, IDOC భవనం, అంతాయిపల్లి, శామీర్‌పేట, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా చిరునామాలో అందజేయాలి. దరఖాస్తు ఫారం, పూర్తి మార్గదర్శకాల కోసం జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://medchal-malkajgiri. telangana.gov.in ను సందర్శించాలని అధికారులు సూచించారు. ఎంపిక సమయానికి అందుబాటులో ఉన్న ఖాళీలను బట్టి పోస్టుల సంఖ్య పెరగవచ్చని లేదా తగ్గవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే ముందు పూర్తి నోటిఫికేషన్‌ను పరిశీలించి, అర్హతలు, రిజిస్ట్రేషన్ నిబంధనలు, అవసరమైన ధ్రువపత్రాలు, వేతన వివరాలను నిర్ధారించుకోవాలని ఆనంద్ సూచించారు.

# కొమురం భీమ్, పండుగ సాయన్నకు హైడ్రా నివాళి



**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 22:** ఆదివాసీల హక్కుల సాధన కోసం 'జల్, జంగల్, జమీన్' నినాదంతో పోరాడిన కొమురం భీమ్, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం నిలబడిన ప్రజా వీరుడు పండుగ సాయన్నల జయంతిని హైడ్రా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇరువురి సేవలను స్మరించుకుంటూ.. వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు ఘనంగా నివాళులర్పించారు. అన్యాయంపై పోరాటం, సమానత్వం కోసం తపన, పేదలు మరియు అణగారిన ప్రజల హక్కుల పరిరక్షణ కోసం వారు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని కమిషనర్ అన్నారు. వారి పోరాట స్ఫూర్తి, ధైర్యం, ప్రజల పట్ల అంకితభావం భావితరాలకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో అలయ్ బలయ్

**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 22 :** హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఏటా నిర్వహించే 'అలయ్ బలయ్' సాంస్కృతిక కార్యక్రమం ఈరోజు అట్టహాసంగా ప్రారంభమైంది. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఆయన కుమార్తె బండారు విజయలక్ష్మిల నేతృత్వంలో ఈ వేడుకలు జరుగుతున్నాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెబుతూ, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ప్రతి ఏటా దసరా తర్వాత కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ కార్యక్రమంలో తెలంగాణ జానపద కళారూపాలను ప్రదర్శిస్తున్నారు. బతుకమ్మ, బోనాలు, డప్పు, గుస్సాడీ, కోలాటం వంటి సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఏడాది 'నషా ముక్త్ భారత్' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ వేడుకలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలు పార్టీల నేతలు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు.



**సమాచార హక్కుకు**

# సంకెళ్లు, జవాబుదారీతనానికి చెల్లుచీటి!

పారదర్శక పాలనకు ప్రాణాధారమైన ఆర్టీఐ చట్టం అమలులో నిర్లక్ష్యం.. సమాచార కమిషన్లలో ఖాళీలు, పేరుకుపోతున్న అప్పీళ్లు ప్రజాస్వామ్యానికి సవాలు జవాబుదారీతనం లేని అధికారం నిరంకుశత్వానికి దారితీస్తుంది. పారదర్శకత కొరవడిన పాలనలో అవినీతి వేళ్లూనుకుంటుంది. ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించే అవకాశం ప్రజలకు లేనప్పుడు ప్రజాస్వామ్యం తన అసలు స్ఫూర్తిని కోల్పోతుంది. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఉండాల్సిన విశ్వాసానికి విఘాతం కలుగుతుంది. ఈ ముప్పును నివారించి, పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, ప్రభుత్వ వ్యవహారాలపై పౌరులకు పర్యవేక్షణాధికారం కల్పించడం లక్ష్యంగా సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) 2005లో అమలులోకి వచ్చింది. రెండు దశాబ్దాలుగా ప్రజాస్వామ్యానికి కీలకమైన సాధనంగా నిలిచిన ఈ చట్టం ఇప్పుడు అమలు పరంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ప్రభుత్వ విభాగాల్లో సమాచారాన్ని అందించడంలో నిర్లక్ష్యం, సమాచార కమిషన్లలో ఖాళీలు, అప్పీళ్ల పరిష్కారంలో జాప్యం వెరసి చట్టం ఆశించిన ప్రయోజనాలను నీరుగారుస్తున్నాయి ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ యజమానులు. ప్రభుత్వాలు ప్రజల నుంచి పన్నుల రూపంలో సేకరించిన నిధులతోనే పాలన సాగిస్తాయి. ప్రజల ప్రయోజనాల కోసం ఏర్పాటైన ప్రభుత్వ విభాగాలు, వాటి అధికారులు తమ విధులను ఎలా నిర్వర్తిస్తున్నారు? ప్రజాధనం ఏ విధంగా ఖర్చువుతోంది? అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తున్నారా? సంక్షేమ పథకాల ఫలాలు అర్హులకు చేరుతున్నాయా? ప్రభుత్వ నిర్ణయాల వెనుక ఉన్న కారణాలేమిటి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకునే హక్కు పౌరులకు ఉండాలి. ఈ హక్కును చట్టబద్ధం చేసిన ఆర్టీఐ ప్రజలకు కేవలం సమాచారం పొందే అవకాశాన్నే కాకుండా, పాలనను ప్రశ్నించే శక్తిని కూడా అందించింది. అయితే చట్టం కాగితంపై ఉన్నంత బలంగా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్న విమర్శలు పెరుగుతున్నాయి. సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(2) ప్రభుత్వ పారదర్శకతకు సంబంధించి అత్యంత కీలకమైన బాధ్యతను నిర్దేశిస్తోంది. ప్రజలు ప్రత్యేకంగా దరఖాస్తులు పెట్టి అడిగిన తర్వాతే సమాచారం అందించడం కాకుండా, ప్రభుత్వ విభాగాలే స్వచ్ఛందంగా వీలైనంత ఎక్కువ సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఈ నిబంధన చెబుతోంది. ముఖ్యంగా ప్రభుత్వ నిర్ణయాలు, విధానాలు, వ్యయాలు, అధికారుల బాధ్యతలు, పథకాల అమలు వంటి వివరాలను ప్రజలు సులభంగా తెలుసుకునేలా చేయాలి. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంతోపాటు, స్థానిక భాషల్లోనూ సమాచారం అందించాలి. ఇలా జరిగితే ప్రజలు ప్రతి చిన్న విషయానికీ ఆర్టీఐ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం తగ్గుతుంది. అధికారులపై అనవసర పనిభారం తగ్గడంతోపాటు, పాలనలో పారదర్శకత పెరుగుతుంది. కానీ ఆచరణలో ఈ లక్ష్యం చాలాచోట్ల నెరవేరడం లేదు. ప్రభుత్వ వెబ్‌సైట్లలో సమాచారాన్ని సమగ్రంగా, సకాలంలో నవీకరించకపోవడం, ప్రజలకు అవసరమైన వివరాలను సులభంగా అందుబాటులో ఉంచకపోవడం, దరఖాస్తులకు అసంపూర్ణ సమాధానాలు ఇవ్వడం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. చట్టప్రకారం సాధారణంగా 30 రోజుల్లోగా సమాచారం అందించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో గడువును పాటించకపోవడం దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలిగిస్తోంది. అడిగిన




సమాచారాన్ని పూర్తిగా ఇవ్వకుండా అసంబద్ధమైన వివరాలతో సరిపెట్టడం, చట్టంలో నిర్దేశించిన మినహాయింపులకు సరైన ఆధారాలు చూపకుండా సమాచారాన్ని నిరాకరించడం వంటి ఫిర్యాదులూ వినిపిస్తున్నాయి. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్న పౌరుడు చివరకు సమాధానం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడితే, చట్టం ద్వారా కల్పించిన హక్కుకు అర్థమే లేకుండా పోతుంది. తెలంగాణలోనూ ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రెవెన్యూ, రవాణా, జీహెచ్‌ఎంసీ, మున్సిపాలిటీలు, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, పోలీసు తదితర ప్రజలతో నిత్యం సంబంధం ఉండే శాఖల్లో సమాచారాన్ని సకాలంలో అందించడం అత్యంత ముఖ్యం. భూముల రికార్డులు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు, అనుమతులు, రహదారులు, మౌలిక సదుపాయాల పనులు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై ప్రజలకు అనేక సందేహాలు ఉంటాయి. వాటికి స్పష్టమైన సమాధానాలు లభించకపోతే అనుమానాలు పెరుగుతాయి. కొన్ని సందర్భాల్లో తమకు జరిగిన అన్యాయాన్ని వెలుగులోకి తీసుకురావడానికి కూడా ప్రజలు ఆర్టీఐని ఆశ్రయిస్తారు. అలాంటప్పుడు సంబంధిత అధికారులు చట్టబద్ధమైన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాలి. సమాచారం ఇవ్వడాన్ని ఉపకారంగా కాకుండా, చట్టం విధించిన బాధ్యతగా గుర్తించాలి. ఆర్టీఐ అమలులో మరో ప్రధాన సమస్య సమాచార కమిషన్ల పనితీరు. ప్రభుత్వ విభాగాలు సమాచారం ఇవ్వకపోయినా, అసంపూర్ణంగా ఇచ్చినా బాధితులు మొదటి అప్పీల్ చేసుకోవచ్చు. అక్కడ కూడా న్యాయం జరగకపోతే సమాచార కమిషన్‌ను ఆశ్రయించే అవకాశం ఉంది. ఈ వ్యవస్థ సక్రమంగా పనిచేసినప్పుడే చట్టానికి అసలైన బలం చేకూరుతుంది. దరఖాస్తుదారులకు సకాలంలో న్యాయం అందించడంతోపాటు, ఉద్దేశపూర్వకంగా సమాచారం ఇవ్వని అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉంటుంది. అయితే కమిషన్లలో ఖాళీలు ఏర్పడటం, నియామకాల్లో జాప్యం జరగడం, విచారణలు నత్తనడకన సాగడం వల్ల ఈ వ్యవస్థ ఆశించిన స్థాయిలో ఫలితాలు అందించలేకపోతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. సతర్క్ నాగరిక్ సంఘటన్ నివేదికలో పేర్కొన్న గణాంకాలు ఈ సమస్య తీవ్రతను సూచిస్తున్నాయి. 2026 జూన్ నెలాఖరు నాటికి కేంద్ర సమాచార కమిషన్‌తోపాటు 28 రాష్ట్రాల సమాచార కమిషన్లలో 3.85 లక్షలకు పైగా రెండో అప్పీళ్లు, ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో కలిపి ఈ సంఖ్య 27 వేలకు మించిందని నివేదిక పేర్కొంటోంది. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కావు. సమాచారం కోసం ఎదురుచూస్తున్న పౌరుల సమస్యలకు, ప్రభుత్వ వ్యవస్థలపై వారు పెట్టుకున్న ఆశలకు సంబంధించిన అంశాలు. అయితే ఈ సంఖ్యలను రాష్ట్రాలవారీగా, కాలపరిమితులవారీగా విశ్లేషించడంతోపాటు, పెండింగ్ కేసులకు కారణాలను గుర్తించి పరిష్కార మార్గాలను అన్వేషించాలి. సమాచార కమిషన్లలో ఖాళీలు భర్తీ కాకపోవడం వల్ల విచారణల కోసం దరఖాస్తుదారులు నెలల తరబడి, కొన్ని సందర్భాల్లో మరింత ఎక్కువకాలం వేచి చూడాల్సి వస్తుంది. సమాచారం అవసరమైన సమయంలో అందకపోతే దాని వల్ల కలిగే నష్టాన్ని తర్వాత ఇచ్చే సమాధానం పూర్తిగా భర్తీ చేయలేకపోవచ్చు. ఉదాహరణకు, సంక్షేమ పథకం లబ్ధి, భూమి వివాదం, ప్రభుత్వ పనుల్లో అక్రమాలు లేదా ప్రజాధన వినియోగానికి సంబంధించిన వివరాలు ఆలస్యంగా అందితే, సంబంధిత వ్యక్తికి న్యాయం జరగడం మరింత క్లిష్టమవుతుంది. అందుకే సమాచార హక్కు వ్యవస్థలో వేగం, నిష్పాక్షికత, విశ్వసనీయత అత్యవసరం. ఇక్కడ ప్రభుత్వాల బాధ్యతను విస్మరించలేం. సమాచార కమిషనర్ల నియామకాలను సకాలంలో చేపట్టడం, ఖాళీలు ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, నియామక ప్రక్రియలో పారదర్శకత పాటించడం ప్రభుత్వాల విధి. వివిధ రంగాల్లో అనుభవం, ప్రజాసేవ పట్ల నిబద్ధత, చట్టంపై అవగాహన కలిగిన వ్యక్తులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. నియామకాల్లో రాజకీయ అనుబంధాలు లేదా వ్యక్తిగత పరిచయాలకే ప్రాధాన్యం లభిస్తోందనే అనుమానాలు తలెత్తకుండా ఎంపిక ప్రక్రియ విశ్వసనీయంగా ఉండాలి. సమాచార కమిషన్లు ప్రభుత్వాలకు అనుకూలంగా వ్యవహరించే సంస్థలుగా కాకుండా, ప్రజల హక్కులను కాపాడే స్వతంత్ర వ్యవస్థలుగా పనిచేయాలి. సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకోవడానికి చట్టంలోనే నిబంధనలు ఉన్నాయి. సరైన కారణం లేకుండా సమాచారాన్ని నిరాకరించడం, గడువులోగా అందించకపోవడం, ఉద్దేశపూర్వకంగా తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారం ఇవ్వడం వంటి సందర్భాల్లో చట్టం నిర్దేశించిన ప్రక్రియ ప్రకారం జరిమానా విధించే అవకాశం ఉంది. అయితే విచారణలు ఆలస్యమైతే, బాధ్యులపై చర్యలు తీసుకోవడం అరుదుగా మారితే, చట్టాన్ని ఉల్లంఘించడంపై భయం తగ్గుతుంది. అందువల్ల కమిషన్లు పెండింగ్ కేసులను ప్రాధాన్యక్రమంలో పరిష్కరించాలి. సమాచార హక్కు అమలుపై ప్రభుత్వ విభాగాల పనితీరును క్రమం తప్పకుండా సమీక్షించాలి. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని పరిష్కరించారు, ఎన్ని తిరస్కరించారు, తిరస్కరణలకు కారణాలేమిటి, ఎన్ని అప్పీళ్లు నమోదయ్యాయి వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అదే సమయంలో ఆర్టీఐ చట్టాన్ని ఉపయోగించే పౌరులకు అవసరమైన అవగాహన కల్పించాలి. సమాచారం కోరే విధానం, దరఖాస్తుల్లో స్పష్టంగా అడగాల్సిన వివరాలు, మొదటి అప్పీల్, రెండో అప్పీల్ ప్రక్రియలపై గ్రామస్థాయి నుంచి పట్టణాల వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార అధికారి వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలి. ఆన్‌లైన్ దరఖాస్తులు, దరఖాస్తుల స్థితిని తెలుసుకునే సదుపాయాలు, డిజిటల్ రికార్డుల నిర్వహణను మెరుగుపరచాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు, అణగారిన వర్గాలు, డిజిటల్ సదుపాయాలకు దూరంగా ఉన్నవారు కూడా ఈ హక్కును సులభంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలి. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేయడం మాత్రమే కాదు. ఎన్నికైన ప్రభుత్వాలు ఎలా పనిచేస్తున్నాయి, ప్రజాధనం ఎలా ఖర్చువుతోంది, అధికార యంత్రాంగం ప్రజలకు ఎంతవరకు జవాబుదారీగా ఉంది అనే విషయాలను నిరంతరం తెలుసుకునే అవకాశం కూడా ప్రజలకు ఉండాలి. సమాచార హక్కు ఆ అవకాశాన్ని కల్పించే కీలకమైన ప్రజాస్వామ్య సాధనం. దాన్ని బలహీనపరిచే నిర్లక్ష్యం అంతిమంగా ప్రజల హక్కులనే దెబ్బతీస్తుంది. ప్రశ్నించే పౌరులను ఇబ్బందిగా చూసే ధోరణి మారాలి. సమాచారం కోరడం ప్రజలకు కల్పించిన చట్టబద్ధమైన హక్కు, దానికి సమాధానం ఇవ్వడం ప్రభుత్వ వ్యవస్థల బాధ్యత.

రెండు దశాబ్దాల ఆర్టీఐ ప్రయాణం ప్రజలకు సమాచారాన్ని అందించడంలో ఈ చట్టం ఎంతటి మార్పును తీసుకురాగలదో నిరూపించింది. అదే సమయంలో దాని అమలులోని లోపాలను కూడా స్పష్టంగా వెల్లడించింది. ఇప్పుడు అవసరమైనది చట్టం గొప్పతనాన్ని ప్రసంగాల్లో ప్రస్తావించడం కాదు, దాని స్ఫూర్తిని కార్యాచరణలో చూపించడం. సమాచార కమిషన్లలో ఖాళీలను భర్తీ చేయడం, పెండింగ్ అప్పీళ్లను తగ్గించడం, స్వచ్ఛంద సమాచార వెల్లడిని పెంచడం, అధికారుల నిర్లక్ష్యానికి అడ్డుకట్ట వేయడం వంటి చర్యలు తక్షణం చేపట్టాలి. ప్రభుత్వాలు పారదర్శకతను బాధ్యతగా స్వీకరించి, ప్రజల ప్రశ్నలకు సమాధానమిచ్చే సంస్కృతిని పెంపొందించినప్పుడే ఆర్టీఐకి నిజమైన సార్థకత చేకూరుతుంది. లేకపోతే జవాబుదారీతనం గురించి చెప్పే మాటలు ఆచరణలో అర్థరహితంగా మిగిలిపోతాయి. ప్రజాస్వామ్యానికి బలం ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టే పునాది పారదర్శకత. ఆ పునాదిని కాపాడటం ప్రభుత్వాలకే కాదు, మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థకూ అనివార్యమైన బాధ్యత.



-మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకులు.

ఏఐ వర్సెస్ జర్నలిజం

# కలం మాయమవుతుందా?

## కాలం మారినా.. జర్నలిజం విలువలు మారకూడదు!

ChatGPT గంటల్లో కాదు.. నిమిషాల్లోనే పదుల సంఖ్యలో వార్తలు రాయవచ్చు. కానీ ఓ రైతు కన్నీటి వెనుక ఉన్న కథను, ఓ పేదవాడి మౌనంలో దాగిన ఆవేదనను, ఓ బాధితుడి న్యాయం కోసం చేసే పోరాటాన్ని అదే లోతుతో అర్థం చేసుకోగ లదా? ఒకప్పుడు జర్నలిజం అంటే సైకిల్‌పై పల్లెలకు వెళ్లడం.. రైతు పొలం గట్టున కూర్చుని అతని కష్టాలను వినడం.. కూలీ చెమటలోని వ్యథను, సామాన్యుడి జీవితంలోని సమస్యలను అక్ష రాలుగా మలచడం. వార్త వెనుక నిజాన్ని వెతక డం.. ప్రజల గొంతుకగా నిలవడం! ఇప్పుడు కాలం మారింది. చేతిలో స్మార్ట్‌ఫోన్.. తెరపై కృత్రిమ మేధస్సు ఓ ప్రాంప్ట్ ఇస్తే నిమిషాల్లోనే వార్త సిద్ధం! ప్రెస్‌నోట్‌ను కథనంగా మార్చడం, అనువదించడం, గణాంకాలను క్రమబద్ధీకరించడం.. అన్నీ వేగంగా జరిగిపోతున్నాయి. దీంతో కొందరిలో ఓ ప్రశ్న మొదలైంది. మూడు దశాబ్దాలుగా కలాన్ని నమ్ముకు న్న జర్నలిస్టుగా నా సమాధానం ఒక్కటే.. జర్నలిజానికి ప్రత్యర్థి కావచ్చు.. కానీ బాధ్యతాయుతమైన జర్నలిస్టుకు ప్రత్యామ్నాయం కాదు!

**వేగం పెరిగింది..**

**కానీ నిజం వెతికే బాధ్యత తగ్గకూడదు!**

వార్తలు రాయగలదు. భాషను మెరుగుపరచగలదు. సమాచారాన్ని సంక్షిప్తం చేయగలదు. అనువాదంలో సమయం ఆదా చేయగలదు. గతంలో గంటలు పట్టే పనిని నిమిషాల్లో పూర్తి చేయగలదు. ఇవన్నీ జర్నలిస్టుకు ఉపయోగపడే సాధనాలే. కానీ ఇక్కడే అసలు ప్రశ్న ఉంది. వార్తను రాయడం ఒక పని.. వార్తలోని నిజాన్ని నిర్ధారించడం మరో బాధ్యత! ఒక ప్రెస్‌నోట్‌లో ఇచ్చిన సమాచారం నిజమా? బాధితుడి వాదనలో వాస్తవమెంత? అధికారి చెప్పిన లెక్కలకు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న పరిస్థితులకు పొంతన ఉందా? ప్రభుత్వ ప్రకటనలో లేని ప్రజా సమస్య ఏమిటి? వీటికి సమాధానాలు కేవలం అందమైన వాక్యాలతో రావు. క్షేత్రస్థాయి పరిశీలన, ప్రశ్నించే ధైర్యం, ఆధారాల పరిశీలనతోనే లభిస్తాయి. రైతు కన్నీటిని డేటాగా మార్చగలం.. కానీ అతని సమస్యను ఎవరు ప్రశ్నిస్తారు? ఒక పసుపు రైతు పంటకు గిట్టుబాటు ధర రాక అప్పుల ఊబిలో కూరుకుపోయాడనుకుందాం. అతని నష్టాన్ని గణాంకాల్లో చూపగలదు. పంట ధరల చరిత్రను విశ్లేషించగలదు. ప్రభుత్వ విధానాలను వివరించగలదు. కానీ ఆ రైతు పొలం వద్దకు వెళ్లి.. “ఎంత పెట్టుబడి పెట్టారు? ఎంత అప్పు చేశారు? పంట అమ్మితే ఎంత మిగులుతుంది? పిల్లల చదువుకు డబ్బులున్నాయా?” అని ప్రశ్నించి, సమాధానాలను పరిశీలించి, అతని వేదనను సమాజం ముందుంచాల్సింది ఎవరు? అక్కడే క్షేత్రస్థాయి జర్నలిజం ప్రాధాన్యం కనిపిస్తుంది. రైతు నష్టాన్ని లెక్కించగలదు.. జర్నలిస్టు ఆ నష్టానికి కారణమైన వ్యవస్థను ప్రశ్నించాలి! సమాచారం ఉండొచ్చు. కానీ ఆ సమాచారాన్ని ప్రజా ప్రయోజనానికి ఉపయోగించాలనే బాధ్యతను నిర్ణయించేది మనిషే. సానుభూతితో కథనం రాయడం మాత్రమే కాదు.. ఆ సమస్యకు పరిష్కారం దొరికే వరకు ప్రశ్నించడం కూడా జర్నలిజంలో భాగమే.

**ఫేక్ న్యూస్‌కు వేగం తోడైతే..**

**ప్రజాస్వామ్యానికి ప్రమాదం!**

నకిలీ ఫొటోలు, మార్ఫింగ్ వీడియోలు, డీప్‌ఫేక్ దృశ్యాలు, నమ్మశక్యంగా కనిపించే తప్పుడు ప్రకటనలు సృష్టించడం సులభమవుతోంది. ఒక వ్యక్తి మాట్లాడని మాటను మాట్లాడినట్లుగా చూపించవచ్చు. జరగని ఘటనను జరిగినట్లుగా చిత్రీకరించవచ్చు. పాత ఫొటోకు కొత్త సందర్భాన్ని జోడించి ప్రజలను తప్పుదోవ పట్టించవచ్చు. ఒక్కసారి ఆలోచించండి.. ఒక ప్రజాప్రతినిధి పేరుతో తప్పుడు ప్రకటన వైరల్ అయితే? ఒక కలెక్టర్ ఆదేశించినట్లుగా నకిలీ ఉత్తర్వులు ప్రచారంలోకి వస్తే? ఒక ప్రాంతంలో ప్రమాదం జరిగినట్లు నకిలీ వీడియో వ్యాపిస్తే? వాస్తవం తెలుసుకునేలోపే ఆ సమాచారం వేల మందికి చేరవచ్చు. ప్రజల్లో భయం ఏర్పడవచ్చు. వ్యక్తుల ప్రతిష్ఠ దెబ్బతినవచ్చు. ఎన్నికల సమయంలో ఓటర్ల అభిప్రాయాలను ప్రభావితం చేయవచ్చు. తప్పుడు వార్తను సృష్టించడానికి నిమిషం చాలు.. దాని వల్ల దెబ్బతిన్న నమ్మకాన్ని తిరిగి నిర్మించడానికి సంవత్సరాలు పట్టవచ్చు! ఇక్కడ జర్నలిస్టు పాత్ర మరింత కీలకం. వైరల్ అవుతోందని వార్తను ప్రచురించడం జర్నలిజం కాదు. ఎవరు పంపారు? అసలు మూలం ఏమిటి? ఫొటో ఎప్పుడు తీసింది? వీడియోలోని వ్యక్తి నిజంగా ఆ మాటలు చెప్పారా? సంబంధిత అధికారుల స్పందన ఏమిటి? ఆధారాలు ఏమి చెబుతున్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతికినప్పుడే వార్తకు విశ్వసనీయత వస్తుంది.

**ఏఐ యుగంలో జర్నలిస్టు నిలబడాలంటే..**

**ఈ నాలుగు సూత్రాలు!**

అనువాదం, సమాచార క్రమబద్ధీకరణ, పాత వార్తల అన్వేషణ, గణాంకాల విశ్లేషణ, భాషా దిద్దుబాట్లకు ఉపయోగించుకోవాలి. అయితే ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి క్షేత్రస్థాయికి వెళ్లడం మానకూడదు. ప్రజలతో మాట్లాడటం, ప్రత్యక్షంగా పరిశీలించడం, అధికారులను ప్రశ్నించడం జర్నలిస్టు బాధ్యతగానే ఉండాలి.

**ఫ్యాక్ట్ చెకింగ్ మన వృత్తికి రక్షణ కవచం!**

ఇచ్చిన సమాచారం నిజమని గుడ్డిగా నమ్మకూడదు. పేర్లు, తేదీలు, గణాంకాలు, చట్టాలు, అధికారిక ప్రకటనలు, కోట్స్ అన్నింటినీ విశ్వసనీయ ఆధారాలతో నిర్ధారించాలి. అనుమానాస్పద ఫొటోలు, వీడియోలను మూల సమాచారం, ఇతర ఆధారాలతో పరిశీలించాలి. గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే: చెప్పింది” అనేది వార్తకు ఆధారం కాదు.. “ఆధారాలతో నిర్ధారించాం” అనేదే జర్నలిజానికి బలం!

**గణాంకాలకు మానవీయ కోణాన్ని జోడించాలి!**

“వందలాది మంది రైతులు నష్టపోయారు” అనేది ఒక సమాచారం. ఆ నష్టం ఒక కుటుంబం జీవనాన్ని ఎలా ప్రభావితం చేసిందో వివరించడం ఒక కథనం. అయితే భావోద్వేగం కోసం కల్పిత వ్యక్తులను, నిర్ధారించని సంఘటనలను సృష్టించకూడదు. బాధితుల అనుమతి, గౌరవం, గోప్యతను కాపాడుతూ వాస్తవాలను వెలికితీయాలి. జర్నలిజం అంటే కన్నీళ్లను చూపించడం మాత్రమే కాదు.. ఆ కన్నీళ్లకు కారణమైన సమస్యను గుర్తించి, బాధ్యులను ప్రశ్నించి, పరిష్కారం కోసం ప్రజా చర్చను ముందుకు తీసుకెళ్లడం. ప్రభుత్వాలు, మీడియా సంస్థలు బాధ్యతాయుతమైన వినియోగాన్ని ప్రోత్సహించాలి! రూపొందించిన దృశ్యాలు, ప్రజలను తప్పుదోవ పట్టించే సింథటిక్ కంటెంట్ విషయంలో స్పష్టమైన పారదర్శకత అవసరం.



- పుక్కళ్లర్ రాజేందర్ నాథ్
సీనియర్ జర్నలిస్ట్
ఫోన్: 9440287170

# గాడి తప్పుతున్న తెలంగాణ పోలీస్ శాఖ

అవినీతి మరకలతో ఖాకీ ప్రతిష్ఠకు సవాల్
ఏసీబీ ఉచ్చులో చిక్కుతున్న కొందరు పోలీసులు.. పోస్టింగుల్లో పైరవీల ఆరోపణలు.. ప్రక్షాళన ఎక్కడ...ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ఖాకీ.. అవినీతి ఆరోపణలతో వార్తల్లో నిలిస్తే వ్యవస్థపై నమ్మకం ఎలా నిలుస్తుంది...శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలకు న్యాయం అందించడం.. ఇవి పోలీస్ శాఖ ప్రధాన బాధ్యతలు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన పోలీసులే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటే పరిస్థితి ఏమిటి? సామాన్యులు చిన్న పనుల కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలన్నా డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందనే ఫిర్యాదులు వినిపిస్తే ప్రజలకు భరోసా కల్పించేదెవరు? తెలంగాణ పోలీస్ శాఖలో అవినీతి ఆరోపణలు, పోస్టింగుల కోసం పైరవీలపై వస్తున్న విమర్శలు ఇప్పుడు కీలక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

**అవినీతిపై ఉక్కుపాదం ఎక్కడ....?**

గతంలో ఏసీబీ డీజీగా బాధ్యతలు నిర్వహించిన ప్రస్తుత డీజీపీ సీవీ ఆనంద్ అవినీతి నిరోధక చర్యల్లో కఠిన వైఖరికి ప్రాధాన్యం ఇచ్చిన అధికారిగా గుర్తింపు పొందారు. అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోవాలన్న సందేశం పోలీస్ వ్యవస్థలో బలంగా ఉండాల్సిన అవసరం ఉంది. అయితే, అవినీతి నిరోధక చర్యలు కేవలం దాడులు, కేసుల నమోదుకే పరిమితం కాకుండా.. శాఖలోని ప్రతి స్థాయిలో జవాబుదారీతనాన్ని పెంచేలా ఉండాలి. అవినీతిపై కఠిన చర్యలకు ప్రాధాన్యం ఇచ్చే నాయకత్వం ఉన్నప్పటికీ, కొందరు పోలీసులపై లంచాల ఆరోపణలు ఎందుకు వస్తున్నాయి..? అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై అంతర్గత పర్యవేక్షణ ఎంత సమర్థంగా పనిచేస్తోంది... ఈ ప్రశ్నలకు శాఖ స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది...చిన్న పని కావాలన్నా డబ్బులేనా..?పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి గౌరవంగా స్పందించడం, ఫిర్యాదును స్వీకరించడం, చట్టప్రకారం చర్యలు తీసుకోవడం పోలీసుల బాధ్యత. కానీ ఫిర్యాదుల పరిష్కారం, విచారణలో పురోగతి, ఇతర సేవల కోసం డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలు నిజమైతే అవి తీవ్రంగా పరిగణించాల్సిన అంశాలు..పోలీస్



స్టేషన్‌లో సామాన్యుడికి న్యాయం అందాలంటే మధ్యవర్తుల అవసరం ఉండకూడదు. డబ్బు ఇచ్చిన వారికే పని జరిగి, నిబంధనల ప్రకారం వచ్చిన వారి ఫిర్యాదులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయనే భావన ప్రజల్లో ఏర్పడితే పోలీస్ వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటుంది. ఇలాంటి ఫిర్యాదులను ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

**గాడి తప్పుతున్న తెలంగాణ పోలీస్ శాఖ...!**

**అవినీతి మరకలతో ఖాకీ ప్రతిష్ఠకు సవాల్!**

ఏసీబీ ఉచ్చులో చిక్కుతున్న కొందరు పోలీసులు.. పోస్టింగుల్లో పైరవీల ఆరోపణలు.. ప్రక్షాళన ఎక్కడ..?ప్రజలకు రక్షణ కల్పించాల్సిన ఖాకీ.. అవినీతి ఆరోపణలతో వార్తల్లో నిలిస్తే వ్యవస్థపై నమ్మకం ఎలా నిలుస్తుంది..?శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలకు న్యాయం అందించడం.. ఇవి పోలీస్ శాఖ ప్రధాన బాధ్యతలు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన పోలీసులే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటే పరిస్థితి ఏమిటి? సామాన్యులు చిన్న పనుల కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలన్నా డబ్బులు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందనే ఫిర్యాదులు వినిపిస్తే ప్రజలకు భరోసా కల్పించేదెవరు? తెలంగాణ పోలీస్ శాఖలో అవినీతి ఆరోపణలు, పోస్టింగుల కోసం పైరవీలపై వస్తున్న విమర్శలు ఇప్పుడు కీలక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి..

**అవినీతిపై ఉక్కుపాదం ఎక్కడ...?**

గతంలో ఏసీబీ డీజీగా బాధ్యతలు నిర్వహించిన ప్రస్తుత డీజీపీ సీవీ ఆనంద్ అవినీతి నిరోధక చర్యల్లో కఠిన వైఖరికి ప్రాధాన్యం ఇచ్చిన అధికారిగా గుర్తింపు పొందారు. అవినీతికి పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోవాలన్న సందేశం పోలీస్ వ్యవస్థలో బలంగా ఉండాల్సిన అవసరం ఉంది. అయితే, అవినీతి నిరోధక చర్యలు కేవలం దాడులు, కేసుల నమోదుకే పరిమితం కాకుండా.. శాఖలోని ప్రతి స్థాయిలో జవాబుదారీతనాన్ని పెంచేలా ఉండాలి. అవినీతిపై కఠిన చర్యలకు ప్రాధాన్యం ఇచ్చే నాయకత్వం ఉన్నప్పటికీ, కొందరు పోలీసులపై లంచాల ఆరోపణలు ఎందుకు వస్తున్నాయి..? అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై అంతర్గత పర్యవేక్షణ ఎంత సమర్థంగా పనిచేస్తోంది? ఈ ప్రశ్నలకు శాఖ స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**చిన్న పని కావాలన్నా డబ్బులేనా..?**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి పౌరుడికి గౌరవంగా స్పందించడం, ఫిర్యాదును స్వీకరించడం, చట్టప్రకారం చర్యలు తీసుకోవడం పోలీసుల బాధ్యత. కానీ ఫిర్యాదుల పరిష్కారం, విచారణలో పురోగతి, ఇతర సేవల కోసం డబ్బులు అడుగుతున్నారనే ఆరోపణలు నిజమైతే అవి తీవ్రంగా పరిగణించాల్సిన అంశాలు. పోలీస్ స్టేషన్‌లో సామాన్యుడికి న్యాయం అందాలంటే మధ్యవర్తుల అవసరం ఉండకూడదు. డబ్బు ఇచ్చిన వారికే పని జరిగి, నిబంధనల ప్రకారం వచ్చిన వారి ఫిర్యాదులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయనే భావన ప్రజల్లో ఏర్పడితే పోలీస్ వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటుంది. ఇలాంటి ఫిర్యాదులను ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

**పోస్టింగుల కోసం పైరవీల ఆరోపణలు...!**

పోలీస్ శాఖలో పోస్టింగులు, బదిలీలు పూర్తిగా పారదర్శకంగా ఉండాలన్నది ప్రజాస్వామ్య పాలనలో కీలకమైన సూత్రం. అర్హత, అనుభవం, పరిపాలనా అవసరాల కంటే పలుకుబడి, పైరవీలు ప్రభావం చూపుతున్నాయనే ఆరోపణలు వస్తే అవి శాఖ విశ్వసనీయతకు సవాలుగా మారతాయి. పోస్టింగ్ కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోందనే ఆరోపణలు నిజమైతే, ఆ వ్యవహారంలో బాధ్యత ఎవరిది? నిర్ణయాలు తీసుకునే స్థాయిలో ఉన్నవారిపై పర్యవేక్షణ ఉందా..? బదిలీలు, నియామకాలకు స్పష్టమైన ప్రమాణాలు అమలవుతున్నాయా.? అనే అంశాలపై సమగ్ర సమీక్ష అవసరం.. అయితే, పోస్టింగుల్లో అక్రమాలు జరుగుతున్నాయని నిర్ధారించాలంటే సంబంధిత ఆధారాలు, ఫిర్యాదులు, అధికారిక రికార్డులు పరిశీలించాలి. ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ వాటిని నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించకుండా, నిష్పక్షపాత విచారణ ద్వారా నిజానిజాలను వెలికితీయాలి.

**ఏసీబీ కేసులు.. శాఖకు హెచ్చరికలు..!**

అవినీతి ఆరోపణలపై ఏసీబీ చేపట్టే తనిఖీలు, ట్రాప్ చర్యలు, కేసులు ప్రభుత్వ ఉద్యోగుల్లో జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఉపయోగపడాలి. పోలీస్ సిబ్బంది ఎవరైనా లంచం తీసుకుంటూ పట్టుబడినట్లు అధికారికంగా వెల్లడైతే, ఆ ఘటనను వ్యక్తిగత తప్పిదంగా మాత్రమే చూడకుండా వ్యవస్థలోని లోపాలను గుర్తించాలి..ఏ విభాగాల్లో ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయి? ఏ స్థాయి సిబ్బందిపై ఆరోపణలు నమోదవుతున్నాయి..? గతంలో చర్యలు ఎదుర్కొన్నవారిపై తదుపరి పర్యవేక్షణ ఎలా ఉంది? అవినీతి నిరోధక వ్యవస్థకు అందుతున్న ఫిర్యాదుల్లో ఎన్ని పరిష్కారమవుతున్నాయి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు కనుగొనడం ద్వారా శాఖలో మార్పులకు మార్గం సుగమమవుతుంది. ఏసీబీ కేసులో పేరు రావడం, ఆరోపణలు ఎదుర్కోవడం, నేరం నిర్ధారణ కావడం వేర్వేరు దశలు. అందువల్ల ప్రతి కేసులోనూ చట్టపరమైన ప్రక్రియను గౌరవిస్తూనే, శాఖాపరమైన చర్యలు నిబంధనలకు అనుగుణంగా ఉండాలి.

**చర్యలు తీసుకున్నా.. మార్పు కనిపిస్తోందా..?**

అవినీతి ఆరోపణలపై చర్యలు తీసుకోవడం ఎంత ముఖ్యమో, అవి పునరావృతం కాకుండా నిరోధించడం కూడా అంతే ముఖ్యం. ఒక ఉద్యోగిపై చర్య తీసుకున్న తర్వాత అదే తరహా ఫిర్యాదులు మరోచోట నుంచి వస్తే, కేవలం వ్యక్తులపై చర్యలతో సమస్య పూర్తిగా పరిష్కారం కావడం లేదని అర్థం చేసుకోవాలి..పోలీస్ స్టేషన్ల పనితీరుపై ఆకస్మిక తనిఖీలు, ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షలు, సిబ్బంది ప్రవర్తనపై ప్రజాభిప్రాయ సేకరణ, పోస్టింగుల ప్రక్రియలో పారదర్శకత, అవినీతి ఆరోపణలపై కాలపరిమితితో విచారణ.. ఇలాంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి..అలాగే, నిజాయితీగా విధులు నిర్వహించే సిబ్బందికి రక్షణ, ప్రోత్సాహం కల్పించాలి. అవినీతికి పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమాలను వెలుగులోకి తెచ్చే ఉద్యోగులు, ఫిర్యాదుదారులకు తగిన రక్షణ కల్పించడం కూడా అవసరం.

**డీజీపీ ముందున్న అసలు సవాల్..!**

ప్రస్తుత డీజీపీ సీవీ ఆనంద్ నాయకత్వంలో పోలీస్ శాఖలో క్రమశిక్షణ, పారదర్శకత, ప్రజలకు జవాబుదారీతనం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సిబ్బందిపై నిష్పక్షపాత విచారణ, పోస్టింగులు--బదిలీల్లో స్పష్టమైన విధానం, పోలీస్ స్టేషన్లలో ప్రజలకు మెరుగైన సేవలు.. ఇవన్నీ ప్రాధాన్య అంశాలుగా మారాలి..అవినీతి నిరోధక చర్యల ఫలితాలు కేవలం కేసుల సంఖ్యలో కాకుండా, ప్రజలకు అందుతున్న సేవల్లో కనిపించాలి. పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన సామాన్యుడు భయపడకుండా తన సమస్యను చెప్పగలగాలి. న్యాయం కోసం డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదన్న నమ్మకం కలగాలి. నిజాయితీగా పనిచేసే పోలీసుకు గౌరవం, అక్రమాలకు పాల్పడే వారికి చట్టప్రకారం శిక్ష.. ఇదే ప్రజలు ఆశించే మార్పు. మారాల్సింది వ్యక్తులేనా? వ్యవస్థ కూడా మారాలా..?తెలంగాణ పోలీస్ శాఖలో అవినీతి ఆరోపణలపై చర్చ వ్యక్తుల దగ్గరే ఆగిపోకూడదు. ఫిర్యాదుల పరిష్కారం నుంచి పోస్టింగుల వరకు ప్రతి దశలో పారదర్శకత ఉందా? అవినీతి నిరోధక చర్యలు క్షేత్రస్థాయిలో ఫలితాలిస్తున్నాయా? బాధ్యతాయుతమైన పర్యవేక్షణ కొనసాగుతోందా? అన్న అంశాలపై సమగ్ర సమీక్ష జరగాలి..ఖాకీపై ప్రజలకు ఉన్న గౌరవం అధికారంతో కాదు.. న్యాయంగా వ్యవహరించే తీరుతో నిలుస్తుంది..అవినీతి మరకలు అంటిన చోట ప్రక్షాళన జరగాలి. ఆరోపణలు ఎదుర్కొన్న ప్రతి ఒక్కరికీ నిష్పక్షపాత విచారణ జరగాలి. తప్పు నిర్ధారణ అయినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. పోస్టింగులు, బదిలీలు పారదర్శకంగా ఉండాలి. ప్రజలకు సేవలందించే పోలీస్ వ్యవస్థలో జవాబుదారీతనం పెరగాలి..అంతిమంగా నిలిచే ప్రశ్న ఒక్కటే.. తెలంగాణ పోలీస్ శాఖలో అవినీతికి అడ్డుకట్ట వేసి, ఖాకీ ప్రతిష్ఠను పునరుద్ధరించే సమర్థవంతమైన ప్రక్షాళన ఎప్పుడు..? పోలీస్ శాఖలో పోస్టింగులు, బదిలీలు పూర్తిగా పారదర్శకంగా ఉండాలన్నది ప్రజాస్వామ్య పాలనలో కీలకమైన సూత్రం. అర్హత, అనుభవం, పరిపాలనా అవసరాల కంటే పలుకుబడి, పైరవీలు ప్రభావం చూపుతున్నాయనే ఆరోపణలు వస్తే అవి శాఖ విశ్వసనీయతకు సవాలుగా మారతాయి. పోస్టింగ్ కోసం డబ్బులు చెల్లించాల్సి వస్తోందనే ఆరోపణలు నిజమైతే, ఆ వ్యవహారంలో బాధ్యత ఎవరిది? నిర్ణయాలు తీసుకునే స్థాయిలో ఉన్నవారిపై పర్యవేక్షణ ఉందా..? బదిలీలు, నియామకాలకు స్పష్టమైన ప్రమాణాలు అమలవుతున్నాయా..? అనే అంశాలపై సమగ్ర సమీక్ష అవసరం.. అయితే, పోస్టింగుల్లో అక్రమాలు జరుగుతున్నాయని నిర్ధారించాలంటే సంబంధిత ఆధారాలు, ఫిర్యాదులు, అధికారిక రికార్డులు పరిశీలించాలి. ఆరోపణలు వచ్చిన ప్రతిసారీ వాటిని నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించకుండా, నిష్పక్షపాత విచారణ ద్వారా నిజానిజాలను వెలికితీయాలి.



-గాడిపల్లి సునీల్ గౌడ్
సీనియర్ జర్నలిస్ట్ : 9502022333



## పండగ సాయన్న ఆశయాలు స్ఫూర్తిదాయకం: ఎమ్మెల్యే

ప్రజల కోసం పోరాడి, తనదైన చరిత్రను సృష్టించిన పండగ సాయన్న ఆశయాలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పండగ సాయన్న జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో గురువారం పండుగ సాయన్న విగ్రహానికి ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ఆత్మగౌరవం, సమానత్వం, ఆకలి లేని సమాజం కోసం సాగిన పోరాటానికి ప్రతీక పండుగ సాయన్న పోరాటమని అన్నారు. అధికారం, ఆధిపత్యం కొందరి చేతుల్లోనే ఉన్న కాలంలో అన్యాయాన్ని ప్రశ్నించి పేదల పక్షాన నిలబడడమే నిజమైన ధైర్యమని తన పోరాటాలతో చాటిచెప్పిన గొప్ప వీరుడు పండగ సాయన్న జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహనీయుల సేవలను స్మరించుకుంటూ వారి పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు. మహనీయుల జీవిత చరిత్రలను యువత తెలుసుకుని, వారి ఆశయాల నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు. సమాజంలో సమానత్వం, సామాజిక చైతన్యం, ప్రజాసేవా భావనలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో , మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, ముదిరాజ్ సంఘం నాయకులు అందే బాబయ్య, సంఘం నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం

కామారెడ్డి: కామారెడ్డి జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వరంగల్ డిక్లరేషన్ లో రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలనే నినాదంతో ఈ నెల 26న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వరంగల్ డిక్లరేషన్ లో రైతులకు అనేక హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఆ హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. "చలో తహసీల్ ఆఫీస్" పేరుతో చేపట్టే ధర్నాలో జిల్లాలోని అన్ని మండలాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరే వరకు ఉద్యమం కొనసాగిస్తామని, ఈ పోరాటానికి రైతాంగం, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శంకర్రావు, జోనల్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, సాయిరెడ్డి, పాల్గొన్నారు.

## సామాజిక న్యాయం కోసం పోరాడిన మహనీయుడు పండుగల సాయన్న

**సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రాబిన్‌హుడ్ 174వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ**



**రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 22:** రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగల సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి ముఖ్య అతిథిగా హాజరై పండుగల సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి మాట్లాడుతూ, దాదాపు 150 సంవత్సరాల క్రితం సమాజంలో చట్టపరమైన రక్షణలు పరిమితంగా ఉన్న సమయంలో నిజాం పాలనలోని నిరంకుశత్వం, భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల దౌర్జన్యాలను ఎదిరించి, పేదలు మరియు బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచిన గొప్ప మానవతావాది పండుగల సాయన్న అని పేర్కొన్నారు. అణగారిన వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను సహించలేక, పేద ప్రజల కోసం పోరాడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా సమాజంలో ఆర్థిక, సామాజిక అసమానతలు ఇంకా కొనసాగుతుండటం ఆందోళనకరమని ఆమె అన్నారు. ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతుండగా, పేదలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో, చట్టాలకు లోబడి ఉద్యమాలు చేపట్టాలని సూచించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఐకమత్యం ఎంతో అవసరమని, అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, పండుగల సాయన్న 174వ జయంతిని నిర్వహించుకుంటున్నప్పటికీ, ఆయన ఆశయాలైన సామాజిక సమానత్వం, పేదల సంక్షేమం, అణగారిన వర్గాలకు న్యాయం వంటి లక్ష్యాలు నేటికీ పూర్తిస్థాయిలో నెరవేరలేదని అన్నారు. పేద ప్రజల పక్షాన నిలిచి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పండుగల సాయన్న మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం మెరుగోనిపల్లి గ్రామంలో సాయమ్మ, అనంతయ్య దంపతులకు ముదిరాజ్ కుటుంబంలో జన్మించారని ఆయన వివరించారు. చిన్నతనం నుంచే మల్లయుద్ధం, గ్రామీణ క్రీడల్లో పాల్గొంటూ దృఢమైన శరీరదారుఢ్యాన్ని పెంపొందించుకున్న సాయన్న, అప్పటి నిజాం పాలనలో భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, ఇతర ఆధిపత్య వర్గాల దోపిడీని, పేద ప్రజలపై జరుగుతున్న దౌర్జన్యాలను చూసి చలించిపోయారని తెలిపారు. పంటలు పండిన తర్వాత పేద రైతుల నుంచి బలవంతంగా పన్నులు వసూలు చేయడం, వారి భూములను లాక్కోవడం వంటి అన్యాయాలను ఎదిరించేందుకు సాయన్న తన స్నేహితులతో కలిసి ఒక దళాన్ని ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. సంపన్నుల నుంచి దోచుకున్న సంపదను పేదలకు పంచడంతో పాటు, పేద ప్రజల వివాహాలకు బంగారం అందించి వారికి అండగా నిలిచేవారని వివరించారు. ప్రజల్లో సాయన్నకు పెరుగుతున్న ఆదరణను సహించలేని ఆధిపత్య వర్గాలు నిజాం పాలకులతో కలిసి కుట్రపూరితంగా ఆయనను హతమార్చాయని పేర్కొన్నారు. ధనవంతుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల సంక్షేమం కోసం జీవితాన్ని అంకితం చేసిన బహుజన వీరుడు పండుగల సాయన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిపాలన అధికారి సునీల్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేశురాం, ముదిరాజ్ మహాసభ రంగారెడ్డి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మహేందర్ ముదిరాజ్, ముదిరాజ్ సంఘం నాయకులు కాకి వేణుగోపాల్, కాకి లక్ష్మణ్, ఆనియన్ ముదిరాజ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పండుగ సాయన్న పోరాటం అసాధారణమైనది

**బీసీ జెఎసి రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**





**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 22:** నిజాం నిరంకుశ పాలనకు, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి, పేద ప్రజల పక్షాన నిలిచిన ధీరుడు, బహుజనుల బంధువు, తెలంగాణ రాబిన్ హుడ్‌గా పేరుగాంచిన వ్యక్తి పండుగ సాయన్న అని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు ఆయన 174వ జయంతి సందర్భంగా మాట్లాడుతూ,పండుగ సాయన్న తన కాలంలో నెలకొన్న సామాజిక అసమానతలు, భూస్వాముల దోపిడీ, నిజాం పాలనలోని నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ధీరుడని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పోరాడి, వారి హక్కుల సాధనకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు .పండుగ సాయన్న జీవితం నేటి బహుజన సమాజానికి స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ప్రజలు ఐక్యంగా సామాజిక న్యాయం, సమాన హక్కులు, రాజ్యాధికార సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. చరిత్రలో బహుజన వీరుల త్యాగాలకు తగిన గుర్తింపు లభించాలని, వారి చరిత్రను భావితరాలకు అందించేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పండుగ సాయన్న పోరాట స్ఫూర్తితో బహుజన సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.

## ముదిరాజ్ 174వ జయంతి వేడుకలు



**మంచాలవెలుతురు అక్టోబర్ 22:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవం పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి సందర్భంగా ఆరుట్ల ముదిరాజ్ సంఘం కార్యాలయంలో ముదిరా జ్ సంఘం అధ్యక్షుడు జిలమోని శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పండుగ సాయన్న చిత్రపటా నికి పూలమాలవేసి నివాళులర్పించి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆరుట్ల గ్రామ ఉపసర్పంచ్ నూకంరాజు ముదిరాజ్ మాట్లాడు తూ ముదిరాజ్ సంఘం హక్కుల కోసం పోరాటం చేసిన యోధుడు ముదిరాజ్ సంఘం ఒకటే కాదు బీసీ సంఘాల కోసం ఎన్నోపోరాటాలు చేసిన యోధుడు గొప్పవ్యక్తి పండుగ సాయన్నము దిరాజ్ అన్నారు ప్రతిఒక్కరు పండుగ సాయన్న ముదిరాజ్ అడుగుజాడల్లో నడవాలి ఆయన ఆశయసాధన కోసం పనిచేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘంపెద్దలు ము దిరాజ్ యువజన సంఘం సభ్యులు మత్స్యశాఖ అధ్యక్షులు సభ్యులు పెద్దమ్మ తల్లిగుడి అధ్య క్షులు సభ్యులు నాయకులు ముదిరాజ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## కొత్తపల్లి కళమ్మ దశదిన కర్మలో పాల్గొన్న నాయకులు



**మంచాల వెలుతురు అక్టోబర్ 22:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శ్రీ మహాలక్ష్మి సిం డికేట్ గ్రూప్ సభ్యుడు కొత్తపల్లి శేఖర్ గౌడ్ తల్లి కొత్తపల్లి కళమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో పా ల్గొని కళమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించిన ఆరుట్ల శ్రీమహాలక్ష్మి సిండికేట్ గ్రూ ప్ అధ్యక్షుడు అంతటి రాజుగౌడ్ ఇందిరమ్మకమిటీ సభ్యుడు చెరుకు నరసింహగౌడ్ వైయస్సా ర్ మాధగోని జంగయ్యగౌడ్ అనంతరం కళమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రాగాడ సానుభూ తి తెలిపారు కార్యక్రమంలో గ్రామస్తులు పాండాల సత్యనారాయణగౌడ్ తాళ్ళప్రభాకర్ గౌడ్ మా డుగులయాదయ్యగౌడ్ (కాప్రేడ్)అంతటి జానకిరామ్ గౌడ్ మాధగోని కాటంరాజు గౌడ్ బత్తుల రాజుగౌడ్ ఓరిగంటి మహేష్ గౌడ్ బోయపల్లి జంగయ్య సుంకరి శ్రీనివాస్ గౌడ్ పోలమోని నాగేష్ ముదిరాజ్ బలం జంగయ్య మాడుగుల ధనరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## బీసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించిన కలెక్టర్



జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్ లో కొనసాగుతున్న బీసీ స్టడీ సర్కిల్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సాయంత్రం సందర్శించారు. ఇది అద్దె భవనంలో కొనసాగుతుండడంతో తగిన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయా లేవా అని కలెక్టర్ నిశిత పరిశీలన జరిపారు. స్టడీ సర్కిల్ లో ఎంతమంది శిక్షణ పొందుతున్నారు, వారికి ఎలాంటి శిక్షణ అందిస్తున్నారు, ఎంతమందికి ఇప్పటివరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి, దీని నిర్వహణకు ప్రతి నెల ఎంత మొత్తం వ్యయం అవుతోంది తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీసీ స్టడీ సర్కిల్ కు శాశ్వత ప్రాతిపదికన రూ. 3.65 కోట్లను వెచ్చిస్తూ పక్కా భవనం నిర్మాణం కోసం గంగాస్తాన్‌లో 2016లోనే శంకుస్థాపన చేసినప్పటికీ న్యాయపరమైన సమస్య కారణంగా పనులు చేపట్టలేకపోతున్నారని పలువురు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. దీంతో కలెక్టర్ ఇలా త్రిపాఠి గంగాస్తాన్‌లో బీసీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణం కోసం ఉద్దేశించిన స్థలాన్ని సైతం సందర్శించి పరిశీలించారు. న్యాయపరమైన అడ్డంకులను అధిగమించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ సబ్ కలెక్టర్ సందీప్, ఇంచార్జి డీ.ఈ.ఓ సాయాగౌడ్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సాయి కుమార్, ఉన్నారు.

## మంచాల పోలీస్‌స్టేషన్‌లో యువతకు అవగాహన కార్యక్రమం

- ఆన్‌లైన్ ఆటలకు మాదకద్ర వ్యాలకు దూరంగా ఉండాలి
- ఇబ్రహీంపట్నం ఏసిపి రాజు



**మంచాల వెలుతురు అక్టోబర్ 22:** మంచాల మండలం పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంచాల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో యువతకు అవగాహన కల్పించేందుకు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వ హించారు ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు మంచాల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ మధు ఎస్‌ఐలు నాగేశ్వర రావు వంశీ పాల్గొన్నారుఈ సందర్భంగా పోలీసులు యువతకు పోలీ సుల విధులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుల స్వీకరణకేసుల నమోదు దర్యాప్తుప్రక్రియ గురించి వి వరించారుఫిర్యాదు అందిన తర్వాత పోలీసులు చేపట్టే విచారణ ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్) నమోదు విచారణ నిమిత్తం సంబంధిత వ్యక్తులను పిలిపించడం కేసులను న్యాయ స్థానాలకు పంపించే విధానం గురించి అవగాహన కల్పించిఎక్కడైనా గొడవలు ఇతరసమస్యలు తలెత్తినప్పుడు ప్రజలు చట్టాన్నిచేతుల్లోకి తీసుకోకుండా పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాల ని తెలిపారు యువత ఆన్‌లైన్ ఆటలకు బానిసలు కాకుండా చదువు క్రీడలు మంచి అలవాట్ల పై దృష్టి సారించాలని సూచించారు గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగానికి వాటి విక్ర యాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు మాదకద్రవ్యాల వల్ల భవిష్యత్తు దెబ్బతినడమే కాకుండా చట్టపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారుఈ కార్యక్రమంలో విద్యార్థులు చరణ్ మిట్టు టిల్లు గ్రామ యువత పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## కాంగ్రెస్ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గెలుపే లక్ష్యం: కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి అక్టోబర్ 22:** హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం గురువారం శంషాబాద్ సమీపంలోని మల్లికా కన్వెన్షన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, కాంగ్రెస్ అధిష్టానం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సామ రామ్మోహన్ రెడ్డిని ప్రకటించిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పట్టభద్రుల మద్దతు కూడగట్టి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు, నవంబర్ 6వ తేదీ ఓటర్ నమోదుకు చివరి తేదీ అని ప్రతి ఒక్కరూ ఓటర్ నమోదు చేసుకోవాలని సూచించారు. మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని కోరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో పట్టభద్రుల ఓటరు నమోదు కోసం తన కార్యాలయంలో ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులైన పట్టభద్రులు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మరియు మంత్రి శ్రీధర్ బాబు గారల నాయకత్వంలో పార్టీ శ్రేణుల సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని కూన శ్రీశైలం గౌడ్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మనోహర్ రెడ్డి,రామ్మోహన్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు మల్లు రవి గారు, మజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ గారు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు పారిజాత నరసింహారెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్, పార్టీ ఇన్‌చార్జులు, కార్పొరేషన్ చైర్మన్లు, NSUI,INTUC, మహిళా కాంగ్రెస్ నాయకులు,వివిధ స్థాయిల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీబీఆర్‌టీ పరీక్షలకు పటిష్ఠ బందోబస్తు

నిజామాబాద్: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించనున్న కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్టీ) పరీక్షలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్‌లోని అర్సపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న ఏవీ ఎంటర్‌ప్రైజెస్, మున్నూరు కాపు సంఘం భవనంలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు సీపీ తెలిపారు. పరీక్షల నిర్వహణ నేపథ్యంలో ఈ నెల 24 నుంచి 26 వరకు ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్(పాత సెక్షన్ 144 సీఆర్‌పీసీ) అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం పరీక్షా కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుంపులుగా చేరడం నిషేధమని తెలిపారు.

## పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం లక్ష సంతకాల ఉద్యమం..



షాద్ నగర్: ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి రైతాంగానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి మహబూబ్ నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ చేపట్టిన పండుగ సాయన్న స్ఫూర్తితో లక్ష సంతకాల సేకరణ షాద్ నగర్ లో కొనసాగింది. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట గురువారం నిర్వహించిన లక్ష సంతకాల సేకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని సంతకం చేసి తన మద్దతును ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు, వివిధ సంఘాల నాయకుల నుంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి జిల్లాల రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నిలిచిపోయిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని, ప్రాజెక్టుల కారణంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం, పరిహార ప్యాకేజీలను సక్రమంగా అమలు చేయాలని కోరారు.
పాత సాగునీటి ప్రాజెక్టుల తో పూర్తి ఆయకట్టుకు నీరందించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. డిండి లిఫ్ట్ పనుల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల రైతాంగ ప్రయోజనాలను కాపాడాలని, కృష్ణా జలాల పంపిణీలో పారదర్శకత పాటించాలని జేఏసీ నాయకులు కోరారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా చంద్రసాగర్--అప్పారావుపేట్ లిఫ్ట్ ఏర్పాటు, బల్మూరు మండల రైతులకు సాగునీటి సౌకర్యం కల్పించడం, వెల్లూరు--గొందిమళ్ల బ్యారేజీ నిర్మాణం చేపట్టడం వంటి అంశాలను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని డిమాండ్ చేసింది. లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం అక్టోబర్ 22 నుంచి నవంబర్ 30 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. సేకరించిన లక్ష సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రికి అందజేసి పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించాలని కోరనున్నట్లు వెల్లడించారు. రైతాంగ ప్రయోజనాల కోసం చేపట్టిన ఈ ఉద్యమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ముదిరాజ్ నాయకులు అందె బాబయ్య, అందె మోహన్, అంచె రాములు తదితరులు సంతకాలు చేశారు. పెండింగ్ ప్రాజెక్టుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా చైర్మన్ సత్యనారాయణ, పాల్గొన్నారు.

## భవిష్యత్తులో వ్యవసాయానికే పెద్దపీట : మంత్రి తుమ్మల



రాజేంద్రనగర్ : భవిష్యత్తు వ్యవసాయానిదేనని, రైతే రాజు అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వినూత్న కార్యక్రమమైన 'రైతు పొలాల్లోకి ఆవిష్కరణలు' కార్యక్రమాన్ని రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంతో పాటు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఖేత్ బచావో అభియాన్' కూడా విస్తృత స్థాయిలో రైతాంగానికి చేరువ కావాలని మంత్రి పిలుపునిచ్చారు. శాస్త్ర ఫలాలు రైతులకు చేరువ కావడంలో ఇంకా లోటుపాట్లు ఉన్నాయని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా వాటిని భర్తీ చేయాలన్నారు. యూరియా వాడకాన్ని ఇంకా తగ్గించి భూమి సారాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సాఫ్ట్‌వేర్ నిపుణులు కూడా పల్లెలకొచ్చి వ్యవసాయం చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన శక్తికి మించి వ్యవసాయానికి సాయం అందిస్తున్నారని మంత్రి వివరించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు.
ప్రస్తుతం ప్రపంచమంతా ఎల్ నినో సవాలును ఎదుర్కొంటున్నదని, దానిని అందరూ సమష్టిగా ఎదుర్కోవాలని సూచించారు. రానున్న నెలల్లో తాగునీటికి సైతం చాలా ఇబ్బంది ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు ఆచితూచి అడుగులు వేసి, అవకాశం ఉంటే కేవలం ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని సూచించారు. బోధనా సిబ్బంది నియామకాలు, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల స్టైపెండ్ పెంపు అంశాలను సానుకూలంగా పరిశీలిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. తన రెండేళ్ల కాలంలో విశ్వవిద్యాలయంలో అమలు చేసిన సంస్కరణల గురించి ఉపకులపతి అల్దాస్ జానయ్య వివరించారు. సీట్ల పెంపు, ఫీజుల తగ్గింపుతో పాటు కొత్త కళాశాలల ఏర్పాటు, కొత్త కోర్సులను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వ్యవసాయ కూలీల పిల్లలకు 15 శాతం సీట్లు కేటాయించామన్నారు. 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం ద్వారా సుమారు 3,20,000 మంది రైతులను నేరుగా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కలిశారని జానయ్య వివరించారు.
పరిశోధనలు, టెక్నాలజీలను రైతులకు మరింత చేరువ చేయడానికి 'రైతు పొలాల్లోకి ఆవిష్కరణలు' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జానయ్య వివరించారు. రానున్న రెండేళ్లలో ఈ కార్యక్రమాన్ని ఉద్యమ స్ఫూర్తితో అమలు చేస్తామన్నారు. అలాగే విశ్వవిద్యాలయ ర్యాంకును మొదటి పది స్థానాల్లో నిలపడానికి కృషి చేస్తామని అల్దాస్ జానయ్య హామీ ఇచ్చారు. విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న బోధనా సిబ్బంది నియామకాలకు సత్వరం అనుమతి ఇవ్వాలని, అలాగే పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల స్టైపెండ్ పెంపునకు అంగీకరించాలని జానయ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో పంటల మార్పిడికి, చిరుధాన్యాలు, పప్పుదినుసులు, నూనెగింజల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఐసీఏఆర్ సంస్థల ఉన్నతాధికారులు రైతాంగానికి సూచించారు. ఈ సందర్భంగా 'రైతు పొలాల్లోకి ఆవిష్కరణలు' కార్యక్రమ కరపత్రాన్ని, రెండేళ్ల విశ్వవిద్యాలయ ప్రగతి వీడియోను మంత్రి విడుదల చేశారు. అదేవిధంగా కొందరు రైతులకు పప్పుధాన్యాల విత్తన సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నార్మ్ సంచాలకులు ఆర్.ఎం. సుందరం, ఇక్రిశాట్ శాస్త్రవేత్త హరికిషన్, క్రీడా శాస్త్రవేత్త మారుతి, ఐఐఎంఆర్ సంచాలకులు తారా సత్యవతి, ఐఐఓఆర్ సంచాలకులు మాథూర్, రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్ డాక్టర్ ఎస్.కె. రావు, పరిశోధనా సంచాలకులు డాక్టర్ మరాఠి బలరాం, విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు, బోధనా సిబ్బంది, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీకొని మహిళ మృతి..

,వలిగొండ: టిప్పర్ ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని సంగెం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరికి గ్రామానికి చెందిన చింతల లక్ష్మి(45) వెంకటేష్ భార్య భర్తలు దసరా పండుగ సందర్భంగా మహిళ తల్లి గారి ఇల్లు వర్కట్ పల్లి గ్రామానికి వచ్చి గురువారం రాయగిరికి తిరుగు ప్రయాణంలో స్కూటీపై వెళుతుండగా సంగెం గ్రామంలో బొల్లేపల్లి గ్రామం నుండి వస్తున్న టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో మంజుల తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

## అన్న సమారాధన కార్యక్రమానికి
## కంబాల రూ.25 వేల విరాళం

గోకవరం మండలం కామరాజుపేట దుళ్ల వీధిలో దేవీ నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించనున్న, అన్న సమారాధన కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు రూ. 25 వేల విరాళం అందించారు. కామరాజుపేటకు చెందిన యువత దేవీ నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని, ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించాలని కోరుతూ గోకవరం?తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయంలో కంబాల శ్రీనివాసరావును యువత కోరారు. స్పందించిన కంబాల శ్రీనివాసరావు అన్న సమారాధనకు గాను రూ. 25 వేల విరాళాన్ని ఆన్‌లైన్ ద్వారా వారికి అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేయడం గొప్ప సేవాభావానికి నిదర్శనమని, ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

# పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

### జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**మునుగోడు, అక్టోబర్ 22 (వెలుతురు ):**
పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పత్తిని కొనుగోలు చేయాలని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం మునుగోడు సమీపంలోని సల్సార్ బాలాజీ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పత్తి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన పత్తి, రైతుల వివరాలు, స్లాట్ బుకింగ్ తదితర అంశాలపై సీసీఐ అధికారులు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్లాట్ బుకింగ్‌లో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పత్తి తేమ శాతాన్ని పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. తూకం, ధరల్లో ఎలాంటి తేడాలు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని, సీసీఐ కేంద్ర రిజిస్టర్, జిన్నింగ్ మిల్లు రిజిస్టర్లలో వివరాలు ఒకే విధంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధికంగా పత్తిని కొనుగోలు చేస్తున్నాయని వ్యాపారులు కలెక్టర్‌కు తెలిపారు. క్వింటాల్ పత్తికి రూ. 9,160 వరకు ధర చెల్లిస్తున్నట్లు వివరించారు. అనంతరం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

**యాసంగిలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి**
రానున్న యాసంగిలో ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో వరికి బదులుగా జొన్న, సజ్జ, పుచ్చకాయ, కూరగాయలు తదితర పంటలను సాగు చేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు. మునుగోడు ప్రాంతంలో మినుము, కుసుమ, ఆముదం వంటి పంటలకు కూడా భూములు అనుకూలంగా ఉన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని అన్నారు. రైతులు సమిష్టి వ్యవసాయం చేసేందుకు ముందుకు వస్తే, పంటకు అనుగుణంగా మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేలా జిల్లా యంత్రాంగం తరఫున ప్రణాళిక రూపొందించాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, డీసీఓ మమత, మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవిలను ఆదేశించారు. పంట పండించిన వెంటనే రైతులు విక్రయించుకునేలా మార్కెటింగ్ అనుసంధానం కల్పించాలని సూచించారు. వేసవిలో కూరగాయలు సాగు చేసే రైతులకు నిల్వ సదుపాయాలపై కూడా దృష్టి సారించాలని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గోదాములను మిల్లెట్స్ నిల్వకు అనువుగా సిద్ధం చేయాలని చెప్పారు. నీటి వసతి ఉన్న రైతులకు మిల్లెట్స్, కూరగాయల సాగు కోసం బిందు, తుంపర సేద్య పరికరాలతో పాటు విత్తనాలను సబ్సిడీపై అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు విత్తనాలు, సాగు సౌకర్యాలతో పాటు మార్కెటింగ్ అనుసంధానం, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్, మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి, డీసీఓ మమత, సీసీఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## అమిత్ షా జన్మదినం సందర్భంగా పండ్లు, బ్రెడ్ పంపిణీ

**గుండాల అక్టోబర్ 22(వెలుతురు)**
: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పింగళి విజయభాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంపటి సురేష్, ప్రధాన కార్యదర్శులు కప్పరి నాగిరెడ్డి, ఆవుల సాయితేజ, కోశాధికారి నర్సింగోజు పరమేశ్వరి, మహిళా మోర్చా అధ్యక్షురాలు బి. సంగీత, గ్రామ శాఖ అధ్యక్షుడు బంగారోజు సోమచారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు దేశ రక్షణలో అమిత్ షా చేస్తున్న కృషిని కొనియాడారు.

## హామీలు నెరవేర్చాలని వినతి



**మోత్కూర్, అక్టోబర్ 22,వెలుతురు న్యూస్ :**
ఇటీవల మోత్కూర్ చేనేత సహకార సంఘానికి ఎన్నికలు జరిగిన సందర్భంలో వంగరి రాములు ప్యానలు ప్రకటించిన హామీలన్నీ నెరవేర్చాలని గురువారం నాడు చేనేత సహకార సంఘం మేనేజర్ వేముల నర్సయ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం మాజీ డైరెక్టర్ కూరపాటి రాములు సంఘ సభ్యులు పసునూరి యాదయ్య,కొక్కుల సత్యనారాయణ,గుర్రం రవి,రేగోటి లక్ష్మీనారాయణ,మహేశ్వరం ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

# ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు



గజ్వేల్: రాష్ట్రంలో పంటలు ఎండిపోతూ రైతులు కన్నీరు పెడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్ల ఏర్పడిన కరువని ఆరోపించారు. అధికారులను సస్పెండ్ చేస్తామని చెప్పడం కాకుండా, ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం బూరుగుపల్లి గ్రామంలో సాగునీరు, విద్యుత్ అందక ఎండిపోయిన వరి పంట పొలాలను గురువారం ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి హరీశ్‌రావు పరిశీలించారు. పంట నష్టంతో ఆవేదన చెందుతున్న రైతులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
అనంతరం రైతులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు పది నెలల ముందే హెచ్చరించినా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, పత్తి రైతులకు పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇతర రాష్ట్రాలు రైతులకు ఆర్థిక సాయం అందిస్తూ కరువు మండలాలు ప్రకటిస్తుంటే, తెలంగాణలో ఇప్పటివరకు ఎలాంటి సహాయం అందలేదని విమర్శించారు. బూరుగుపల్లిలో రైతులు విద్యుత్ సమస్యలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. అరవింద్‌రెడ్డి అనే రైతు మూడు ఎకరాల పంటను కాపాడుకునేందుకు జనరేటర్ అద్దె, డీజిల్ కోసం మూడు రోజుల్లో రూ. 21 వేలు ఖర్చు చేసినా రెండున్నర ఎకరాల పంటను కాపాడుకోలేకపోయారని వివరించారు. స్వామి అనే రైతుకు మూడు ఎకరాల్లో రెండు ఎకరాల 30 గుంటల పంట ఎండిపోయిందని, దయ్యాల యాదగిరి పది ఎకరాల్లో తొమ్మిది ఎకరాలకు పైగా నష్టపోయారని పేర్కొన్నారు. తక్కువ వోల్టేజీ, రెండు ఫేజ్‌ల విద్యుత్ సరఫరా వల్ల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి రైతులు అదనపు నష్టాలను ఎదుర్కొంటున్నారని అన్నారు.
సాగునీటి ప్రాజెక్టులను నడపాలి
కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపులను ప్రారంభించి మల్లన్నసాగర్, రంగనాయకసాగర్‌లోకి నీటిని ఎత్తిపోయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టుల మోటార్లను కూడా 24 గంటలు నడిపించాలని కోరారు. సాగునీరు, విద్యుత్ అందిస్తే మరో 20 నుంచి 30 రోజులపాటు శ్రమించి మిగిలిన పంటలను కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కాళేశ్వరం రెండో టీఎంసీ పనులు నిలిచిపోవడం, ఇతర ప్రాజెక్టుల నిర్వహణలో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కరోనా విపత్కర సమయంలోనూ కేసీఆర్ ప్రభుత్వం రైతులకు నిరంతర విద్యుత్, సాగునీరు అందించి వ్యవసాయానికి అండగా నిలిచిందని హరీశ్‌రావు అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేయడంలో, విద్యుత్ కొనుగోళ్లు, బొగ్గు నిల్వల విషయంలో విఫలమైందని విమర్శించారు. అధికారులపై చర్యలతో సమస్య పరిష్కారం కాదని, ప్రభుత్వ పెద్దలే బాధ్యత వహించాలని వ్యాఖ్యానించార
కరువు పరిస్థితుల్లో ప్రజలపై రూ. 5,420 కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపడం, బస్సు చార్జీలు పెంచడం సరికాదని హరీశ్‌రావు విమర్శించారు. పంటలు ఎండిపోయి ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఇస్తామని ప్రకటించిన రూ. 12 వేల ఆర్థిక సాయాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తక్షణమే కరువు మండలాలను ప్రకటించాలని ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలన్నారు. మిగిలిన పంటలను కాపాడేందుకు 24 గంటల నాణ్యమైన విద్యుత్, సాగునీరు సరఫరా చేయాలని, కన్నెపల్లి, దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టుల మోటార్లను నిరంతరాయంగా నడపాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు రూ. 12 వేల ఆర్థిక సాయం వెంటనే విడుదల చేయాలని, తాగునీటి ఎద్దడి నివారణకు కలెక్టర్లకు నిధులు కేటాయించాలని కోరారు. విద్యుత్ చార్జీల భారం, పెంచిన బస్సు చార్జీలను ఉపసంహరించుకోవాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులను ఆదుకోవాలని, పంట నష్టపోయిన వారికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగిస్తామని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చందన రవీందర్, గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



## విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి

రామన్నపేట: విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సీఈ బాలస్వామి అన్నారు. మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామంలో గురువారం వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులు ఐలాపురం చంద్రమోళిలతో మాట్లాడారు. సమస్యల ఏమైనా ఉన్నాయా, విద్యుత్ సరఫరా, పంటల కోతలపై ఆరాతీశారు. ఎలినీనో ప్రభావంతో ఏర్పడుతున్న ప్రతికూల పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధిక నీటి అవసరం ఉన్న వరి సాగుకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, దీనివల్ల భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించడంతోపాటు వ్యవసాయ విద్యుత్ వినియోగాన్ని ఆదా చేయవచ్చని రైతులకు వివరించారు. సరఫరాలో అంతరాయం లేకుండా రైతులకు విద్యుత్ అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామంలో లో-ఓల్టేజ్ సమస్యను పరిష్కరించడం కోసం నూతనంగా ఏర్పాటు చేసిన 100 కేవిఏ ట్రాన్స్ ఫార్మర్ ను ఆయన ప్రారంభించారు. ఆయన వెంట డీఈ. డి.మల్లిఖార్జున్ , ఏడిఈ. కే.శ్రీకాంత్, ఏఈలు యం.కోటేశ్వరరావు, జి. నరసింహ, గ్రామ సర్పంచ్ మారేపల్లి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ ఐలయ్య వార్డు సభ్యులు, కాంట్రాక్టర్ జి.రాంరెడ్డి, సిబ్బంది యం.నటరాజ్, టి.అశోక్, కే.శ్రీనివాస్ రెడ్డి, కే.సత్తిరెడ్డి, యం.సురేష్, యం యాదగిరి, ఎండి.చాంద్ పాల్గొన్నారు.

## కొడంగల్ లో సీఎం రేవంత్ పర్యటన

దసరా పండుగను పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కొడంగల్లోని తన నివాసంలో నియోజకవర్గ ప్రజలు, స్థానిక నాయకులతో ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, నాయకులు ముఖ్యమంత్రిని కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముఖ్యమంత్రి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పండుగవేళ ప్రజలు, నాయకులతో సాగిన ఈ ఆత్మీయ కలయిక కొడంగల్లో పండుగ వాతావరణాన్ని మరింత సందడిగా మార్చింది.

## స్వర్ణకార శంఖారావం బహిరంగను విజయవంతం చెయ్యాలి



**మోత్కూర్, అక్టోబర్ 22,వెలుతురు న్యూస్ :**
ఈనెల 24 తేదీ శనివారం సాయంత్రం 4 గంటలకు హైదరాబాదులోని సరూర్నగర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో జరగబోయే స్వర్ణకార శంఖారావం బహిరంగ సభను విజయవంతం చెయ్యాలని గురువారం నాడు మండల స్వర్ణకార సంఘ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర స్వర్ణకార సంఘం నాయకులు మరియు యాదాద్రి భువనగిరి జిల్లా స్వర్ణకార సంఘం నాయకులు పాల్గొని దిశా నిర్దేశం చేశారు. అనంతరం స్వర్ణకార శంఖారావ సభకు సంబంధించిన కరపత్రాలు, వాహనాల స్టిక్కర్లను మోత్కూర్ మండల స్వర్ణకార సంఘం అధ్యక్షులు అక్కేనపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

## అన్న సమారాధన కార్యక్రమానికి
## కంబాల రూ.25 వేల విరాళం

గోకవరం మండలం కామరాజుపేట దుళ్ల వీధిలో దేవీ నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించనున్న, అన్న సమారాధన కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు రూ. 25 వేల విరాళం అందించారు. కామరాజుపేటకు చెందిన యువత దేవీ నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని, ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించాలని కోరుతూ గోకవరం?తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయంలో కంబాల శ్రీనివాసరావును యువత కోరారు. స్పందించిన కంబాల శ్రీనివాసరావు అన్న సమారాధనకు గాను రూ. 25 వేల విరాళాన్ని ఆన్‌లైన్ ద్వారా వారికి అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేయడం గొప్ప సేవాభావానికి నిదర్శనమని, ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను, సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.

## హోసూర్‌లో కూటమి తరఫున బిజెపి బ్రహ్మయ్య నామినేషన్ దాఖలు



పత్తికొండ మండల పరిధిలోని హోసూర్ గ్రామంలో ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ల పర్వం జోరుగా సాగుతోంది. ఇందులో భాగంగా, హోసూర్ గ్రామం నుండి కూటమి ప్రభుత్వం తరఫున ఎంపీటీసీ-1 అభ్యర్థిగా బిజెపి బ్రహ్మయ్య అధికారికంగా తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ నామినేషన్ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలియజేశారు. నామినేషన్ దాఖలు అనంతరం అభ్యర్థి బ్రహ్మయ్య మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని, ప్రజల ఆశీస్సులతో భారీ మెజారిటీతో గెలుపొందుతామని ధీమా వ్యక్తం చేశారు



## ఎండిన పంటలతో రైతులకు తీవ్ర నష్టం: సీపీఐ(ఎం)

: ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులంతా క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాలను పరిశీలించాలని కోరారు. గురువారం నల్లగొండ పట్టణంలోని 14వ డివిజన్ చర్లపల్లిలో ఎండిపోయిన వరి, పత్తి పంటలను సీపీఐ(ఎం) రాష్ట్ర, జిల్లా నాయకులు, రైతు సంఘం నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. చర్లపల్లిలో వరి పంట పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. కొన్ని చోట్ల పంట పూర్తిగా ఎండిపోయిందని, తాలు తప్ప గింజ కనిపించని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. మరో తడి నీరు అందితే పంట చేతికొచ్చేదని, పెట్టుబడులు పెట్టిన రైతులకు చివరకు పైసా కూడా మిగలని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న, సన్నకారు రైతులు పెట్టిన పెట్టుబడి సైతం తిరిగి రాకపోతే వారి కుటుంబాల పరిస్థితి దుర్భరంగా మారుతుందన్నారు. పత్తి పంట పైకి పచ్చగా కనిపిస్తున్నా ఆకులు వాడిపోతున్నాయని, కాయలు ఎండిపోయి రాలుతున్నాయని చెప్పారు. మరో వారం రోజులు వర్షాలు కురవకపోతే పత్తి పంట కూడా పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.
వర్షాభావ పరిస్థితులపై కేబినెట్‌లో చర్చించడం మాత్రమే సరిపోదని రాఘవులు అన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలో 315 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. వాతావరణ శాఖ నివేదికల ఆధారంగా కాకుండా మంత్రులు నేరుగా పొలాల్లోకి వెళ్లి పంటలు పరిశీలించాలని సూచించారు. రైతుల వాస్తవ పరిస్థితులు తెలుసుకుని వారికి ఎలాంటి సహాయం అందించాలనే దానిపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని కోరారు. తాగునీటి సమస్య పై దృష్టి సారించడంతో పాటు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పెట్టుబడులు చేతికి రాకపోవడంతో రైతులు కుటుంబ పోషణకు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 20 వేల కోట్ల నుంచి రూ. 30 వేల కోట్ల వరకు నిధులు కోరినట్లు తెలుస్తోందని, అయితే ఆ నిధులు ఎంత వరకు సరిపోతాయో పరిశీలించాల్సిన అవసరం ఉందని రాఘవులు అన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వనరుల నుంచి రైతులకు తక్షణ సహాయంగా ఎంత మొత్తం ఖర్చు చేయనుందో ప్రకటించాలని కోరారు. రైతు సంఘాలతోనూ చర్చించి నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు అత్యవసర చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్,తీగల సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, సుధాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## రైతులను ఇబ్బంది పెట్టకుండా పత్తి కొనుగోలు చేయాలి: నల్గొండ జిల్లా కలెక్టర్



మునుగోడు: పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తిని కొనుగోలు చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సల్సార్ బాలాజీ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటుచేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి కొనుగోలు కేంద్రానికి వచ్చిన పత్తి, ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిసిఐ అధికారులు, రైతులు, జిల్లా వ్యవసాయ ,అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి అమ్ముకునేందుకు స్లాట్ బుకింగ్ లో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.
పత్తి తేమ శాతాన్ని పరిశీలించి ఎంత ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ జిన్నింగ్ మిల్లులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మించి ప్రైవేట్ వ్యాపారస్తులు క్వింటాల్ పత్తి రూ. 9160 కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రైతుల నుండి అలాగే కొనుగోలు కేంద్రం నిర్వాహకుల నుంచి సమస్యలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. తూకం ఎలా చేస్తున్నారని అడుగుతూ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, సిసిఐ కొనుగోలు కేంద్రం రిజిస్టర్ కు జిన్నింగ్ మిల్లు రిజిస్టర్ కు తేడా ఉండకుండా చూడాలన్నారు. తూకం, ధరల్లో తేడా లేకుండా కొనుగోలు చేయాలన్నారు. పక్కనే ఉన్న పత్తి రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఎక్కడినుండి వచ్చారని, ఎకరాకు ఎన్ని క్వింటాళ్లు వస్తుందని, ప్రస్తుతం గ్రామాలలో భూగర్భ జలాల పరిస్థితి ఎలా ఉందని, గత యాసంగిలో ఎలాంటి పంటలు వేశారని అడిగి తెలుసుకున్నారు. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రానున్న యాసంగిలో రైతులు నీరు అందుబాటులో ఉన్నచోట వరి వేయకుండా జొన్నలు, సజ్జలు, పుచ్చకాయ, కూరగాయల వంటి పంటలను వేసుకోవాలని, సమిష్టి వ్యవసాయం చేసేందుకు ముందుకు వస్తే రైతులు వారి పంటకి తగ్గట్టుగా అమ్ముకునేందుకు జిల్లా యంత్రాంగం తరఫున ఏర్పాటు చేస్తామని, ఈ విషయంపై ప్రణాళిక రూపొందించాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్ ను, అలాగే డిసీఓ మమత, మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవిలను ఆదేశించారు.
వేసవిలో రైతులు కూరగాయలు లాంటివి పండిస్తే నిలువ ఉంచుకునేందుకు ఆలోచించాలని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల గోదాములను మిల్లెట్స్ నిల్వ ఉంచుకునేందుకు సిద్ధం చేయాలన్నారు. అలాగే పంట పండించగానే రైతులు అమ్ముకునే విధంగా వారికి మార్కెటింగ్ అనుసంధానం చేసేలా చూడాలని మార్కెటింగ్ శాఖ ఏడిని ఆదేశించారు. మినుములు, కుసుమ, ఆముదం వంటి పంటలు కూడా పండించేందుకు మునుగోడు ప్రాంతంలో భూములు అనుకూలంగా ఉన్నందున సమిష్టి వ్యవసాయం చేయడం ద్వారా ప్రతి రైతు మార్కెట్ కు వెళ్లకుండా ఉన్నచోటనే అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందని, మార్కెట్ ను కల్పించే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.

# మల్లికార్జున రైస్ మిల్లు పై అధికారుల దాడులు..



మాగనూర్: మండల పరిధిలోని వడ్వాట్ గ్రామ శివారులో మల్లికార్జున రైస్ మిల్లుపై సంబంధిత అధికారులు దాడులు నిర్వహించారు. ప్రభుత్వ ధాన్యం నిల్వలకు సంబంధించి భారీగా బస్తాలు తక్కువగా ఉన్నట్లు గుర్తించిన అధికారులు ఈ వ్యవహారంలో ఇద్దరు పై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ప్రభుత్వానికి మొత్తం రూ. 7,85,30,918 చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. ఈ వ్యవహారానికి సంబంధించి 31 జూలై 2023న తొలుత క్రిమినల్ కేసు నమోదైంది. అనంతరం 19 ఏప్రిల్ 2024న శంకర్ లింగం రైస్ మిల్లులో 76,000 బస్తాలను నియంత్రణలో ఉంచాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రబీ 2024--25 సీజన్‌కు సంబంధించి 4,972 బస్తాలతో పాటు 76,000 బస్తాలు కలిపి మొత్తం 80,972 బస్తాలు ఉండాల్సి ఉంది. అయితే అధికారులు తనిఖీలు నిర్వహించిన సమయంలో సంబంధిత ధాన్యం బస్తాలు మిల్లులో లేనట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఎన్ఫోర్సుమెంట్ నాగరాజు, కాలప్ప, డీఎం సివిల్ సప్లైస్ సైదులు తదితర అధికారులు తనిఖీలు నిర్వహించారు

## బిజెపి కరీంనగర్ జిల్లా నూతన కార్యవర్గం

**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 22:**
భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ప్రకటించింది. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం గురువారం రోజున జిల్లా శాఖ కార్యవర్గ ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు గా గుర్రాల వెంకట్ రెడ్డి ,బింగి వేణు ఎర్రబెల్లి సంపత్ రావు , దురిశెట్టి సంపత్ ,సిహెచ్. నరసింహరాజు గాజుల స్వప్న , జిల్లా ప్రధాన కార్యదర్శులు గా గుజ్జ శ్రీనివాస్ రావు , మాడ వెంకట్ రెడ్డి కానుమల్ల గణపతి , జిల్లా కార్యదర్శులు గా గుంజేటి శివ కుమార్ ,కోల అశోక్ , సంపెల్లి సంపత్ రావు, చేపూరి సత్యం గౌడ్ ,ధాడి సునీత , రెడ్డవేని రాజు , జిల్లా కార్యాలయ కార్యదర్శి గా కాడార్ల విమల్ కుమార్ . జిల్లా ఐటీ కన్వీనర్ అన్నాజి వినీత్ కుమార్ , జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గొడుగు వినోద్ కుమార్ ల నియామకం జరిగింది. జిల్లాలో భారతీయ జనతా పార్టీ నీ క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి , కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలు , నిర్ణయాలను, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి నూతన జిల్లా కార్య వర్గం తగిన కృషి చేయాలని జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం సూచించారు.

## పేదల పక్షాన నిలిచిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న కలెక్టర్ చిత్రా మిశ్రా

నిజాం కాలంలో పెత్తందార్ల అన్యాయాలకు, దొరల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ఎంతో మంది పేదలకు అండగా నిలిచిన నిలిచిన మహనీయుడు పండుగ సాయన్న అని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. గురువారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఐడీఓసీ లో పండుగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, డీఆర్వో స్వామి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, ఇతర అధికారులు, ముదిరాజ్ సంఘం నాయకులు సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్మాట్లాడుతూ. సొంతంగా సైన్యం ఏర్పాటు చేసుకొని దోపిడీ చేస్తున్న దొరలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. సమాజంలోని అణగారిన వర్గాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు..



ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల నామినేషన్ల సందర్భంగా, నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరగడానికి చాగలమర్రి మండలంలో 144 ఓల్డ్ సి ఆర్ పి సి సెక్షన్ తోపాటు 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలులో ఉంటుందని ఎస్సై నాగేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపుగా చేరడం కానీ, అనుమతులు లేకుండా ర్యాలీ నిర్వహించడం, కర్రలు ఇతర ఆయుధాలు తీసుకువెళ్లడం నిషేధించడం అయిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తమ ఓటు హక్కును ఓటరు వినియోగించుకునేందుకు సహకరించాలని కోరారు.

## మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శంశీర్ అలీకి అవకాశం కల్పించాలి

- ముస్లిం మైనారిటీలకు కాంగ్రెస్ అధిష్ఠానం న్యాయం చేయాలి
- కోహిర్ మాజీ ఎంపీటీసీ మహమ్మద్ అబ్దుల్ వాహిద్ విజ్ఞప్తి





**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 22:**
వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ముస్లిం మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన కోహిర్ పట్టణ మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ శంశీర్ అలీకి కేటాయించి, నియోజకవర్గంలోని ముస్లిం మైనారిటీలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం న్యాయం చేయాలని కోహిర్ మాజీ ఎంపీటీసీ మహమ్మద్ అబ్దుల్ వాహిద్ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ వాహిద్ మాట్లాడుతూ.. గత మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని, పార్టీ బలోపేతానికి శంశీర్ అలీ అంకితభావంతో కృషి చేస్తున్నారని తెలిపారు. పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, 15 సంవత్సరాలకు పైగా కోహిర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందించారని గుర్తుచేశారు. ఆయన సీనియారిటీని, పార్టీకి చేసిన సేవలను గుర్తించి జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించాలని కోరారు .ఇప్పటివరకు ముస్లిం మైనారిటీ సామాజిక వర్గానికి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కలేదని, ఈసారైనా ఆ వర్గానికి అవకాశం కల్పించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని చాటాలని అన్నారు. పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న నాయకులను గుర్తించి తగిన పదవులు కేటాయించడం సముచితమని అభిప్రాయపడ్డారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ సురేష్ షెట్కార్ విజయానికి ముస్లిం మైనారిటీలు కీలకంగా నిలిచారని అబ్దుల్ వాహిద్ పేర్కొన్నారు. పార్టీ విజయానికి సహకరించిన ముస్లిం మైనారి టీలకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించేలా ఎంపీ సురేష్ షెట్కార్ చొరవ తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం శంశీర్ అలీ సేవలను, సీనియారిటీని పరిగణనలోకి తీసు కొని జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆయనకు కేటాయించాలని మహమ్మద్ అబ్దుల్ వాహిద్ విజ్ఞప్తి చేశారు

## వెంకట్రావుపేట్ చౌరస్తాలో పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి



**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 22:**
కౌడిపల్లి మండల పరిధిలోని వెంకట్రావుపేట్ చౌరస్తాలో ఈరోజు పండుగ సాయన్న ముదిరాజ్ గారి 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అధికారిక లాంచనాలతో పండుగ సాయన్న ముదిరాజ్ గారి జయంతిని ఘనంగా నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా ముదిరాజులను బీసీ డీ నుండి బీసీ ఏలోకి మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దొంతుల దుర్గయ్య ముదిరాజ్, దొంతుల శ్రీను ముదిరాజ్,దొంతుల రాజు ముదిరాజ్, దొంతుల యాదయ్య ముదిరాజ్, నీలం నర్సింలు ముదిరాజ్, మన్నే నర్సింలు ముదిరాజ్, నాయిని సత్యనారాయణ ముదిరాజ్, మన్నే ఆంజనేయులు ముదిరాజ్, దొంతుల కృష్ణ ముదిరాజ్, ఉప్పరి శ్రావణ్ ముదిరాజ్, మన్నే లక్ష్మణ్ ముదిరాజ్, సత్తయ్య ముదిరాజ్ మరియు గ్రామ నాయకులు సయ్యద్ పాషా , వీరాగౌడ్,బాబర్, పాల్గొన్నారు.

## అల్లం పంటకు కొత్త తెగులు.. రైతులు అప్రమత్తంగా ఉండాలి!

- జహీరాబాద్, కోహిర్ మండలాల్లో కేంద్ర బృందం సంయుక్త పర్యటన
- నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారుల సూచన

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 22:**
సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, కోహిర్ మండలాల్లో అల్లం పంటకు కొత్తగా అగ్గి తెగులును పోలిన తెగులు సోకినట్లు గుర్తించడంతో కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారులు, శాస్త్రవేత్తల బృందం సంయుక్తంగా పర్యటించి పంటలను పరిశీలించింది. తెగులు వ్యాప్తి చెందకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్ర సమగ్ర సస్యరక్షణ కేంద్రం , హైదరాబాద్ నుంచి ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారులు వెంకటరెడ్డి, బసవన్నప్ప, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయశంకర్ ఈ పర్యటనలో పాల్గొన్నారు. సంగారెడ్డి ఫల పరిశోధన స్థానం నుంచి శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక, నుంచి





శాస్త్రవేత్త శైలజ, స్థానిక ఉద్యాన శాఖ అధికారి సునీత రోస్, ఏఈవో సతీశ్ తదితరులు అల్లం సాగు చేసిన పొలాలను పరిశీలించారు.

**కర్ణాటక, కేరళలోనూ తెగులు వ్యాప్తి**
కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో ఇటీవల ఈ తెగులు వ్యాప్తి చెందినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలోని అల్లం పంటల్లోనూ ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ తెగులుకు కారణమయ్యే శిలీంధ్రాన్ని కేరళలోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పైసెస్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు లిప్రాక్సి ఫైరిక్యులేరియా జింజిబెరిస్ గా నిర్ధారించినట్లు వివరించారు.

**రైతులకు అధికారుల సూచనలు**
తెగులు నివారణకు ప్రొపికోనజోల్ లేదా టెబుకోనజోల్ మందును లీటరు నీటికి ఒక మిల్లీలీటరు చొప్పున కలిపి పిచికారీ చేయాలని అధికారులు సూచించారు. విత్తనంగా ఉపయోగించే అల్లం కొమ్ములకు కూడా తగిన శుద్ధి చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా తెగులు సోకిన ప్రాంతాల నుంచి విత్తనంగా ఉపయోగించే అల్లం కొమ్ములను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకురావద్దని హెచ్చరించారు. తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి తగిన సూచనలు తీసుకోవాలని రైతులకు సూచించారు.

## పోలీసుల విధులకు ఆటంకం.. పలువురు అరెస్ట్

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని గుడికందుల గ్రామంలో జరిగిన దాడి ఘటనలో ఇద్దరిని రిమాండ్ కు తరలించిన విషయం విధితమే.. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో సంఘటన స్థలానికి చేరుకున్న మిరుదొడ్డి పోలీసులు గుమిగూడిన వారిని వెళ్లిపోవాలని ఆదేశించారు.
అయితే, వారు పోలీసుల ఆదేశాలను ధిక్కరించి గొడవ కొనసాగించడంతో పాటు, అక్కడ ఉన్న పోలీసులను చేతులతో నెట్టివేసి, అసభ్య పదజాలంతో గొడవ సృష్టించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు, విధుల్లో ఉన్న పోలీసులకు ఆటంకం కలిగించిన పలువురిపై మిరుదొడ్డి ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసి పలువురిని అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.
ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ.. గ్రామాల్లో లేదా సమాజంలో ఎలాంటి గొడవలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని సూచించారు.

## టీజీ పీఎస్సీ పరీక్షకు సర్వం సిద్ధం చేయాలి: కలెక్టర్



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ టీజీ పీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 24న సంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న అసిస్టెంట్ సైంటిస్ట్ అనలిస్ట్ గ్రేడ్--II కంప్యూటర్ ఆధారిత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి పరీక్ష నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రుద్రారం గ్రామంలోని గీతం యూనివర్సిటీ లో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 150 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్ష రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి సెషన్ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని వివరించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి నిర్ణీత సమయానికి ముందుగానే చేరుకోవాలని సూచించారు. మొదటి సెషన్‌కు ఉదయం 8.30 గంటల నుంచి అనుమతిస్తారని, ఉదయం 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారని తెలిపారు. రెండో సెషన్‌కు మధ్యాహ్నం 1 గంట నుంచి ప్రవేశం కల్పిస్తారని, మధ్యాహ్నం 2 గంటలకు గేట్లు మూసివేస్తారని స్పష్టం చేశారు. గేట్లు మూసివేసిన తర్వాత ఆలస్యంగా వచ్చే అభ్యర్థులకు అనుమతి ఉండదని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, బ్లూటూత్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించరాదని అధికారులను ఆదేశించారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఇతర సిబ్బంది ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈని, అభ్యర్థులకు అవసరమైన రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రంలో వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచడంతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. దివ్యాంగ అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్ష రాసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షల నిర్వహణ సజావుగా సాగేందుకు చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పరితోష్ పంకజ్ వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, ట్రాన్స్‌కో ఎస్ఈ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య శాఖ, మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు, ఇస్నాపూర్ మున్సిపల్ కమిషనర్, తదితరులు పాల్గొన్నారు.



## ఊట్పల్లిలో ఎస్సీ అట్రాసిటీ కేసు..

కథలాపూర్ : జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం ఊట్పల్లి గ్రామంలో నమోదైన ఎస్సీ అట్రాసిటీ కేసుకు సంబంధించి మెట్‌పల్లి డీఎస్పీ రాములు గురువారం గ్రామంలో విచారణ చేపట్టారు. దసరా పండుగ రోజున గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన వివాదం కాస్తా ఘర్షణకు దారితీసింది. ఈ ఘటన పై బాధితుల ఫిర్యాదు మేరకు ఆరుగురి పై పోలీసులు ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ రాములు గ్రామానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాధితులతో పాటు స్థానికులను కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కథలాపూర్ సీఐ కొమ్ము తిరుపతి, ఎస్ఐ సీహెచ్. రవికిరణ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## డి-వన్ కాలువ నిర్మాణం నిలిపివేయాలి !



కొడిమ్యాల : కొడిమ్యాల మండలంలోని కొడిమ్యాల, చెప్యాల, అప్పారావుపేట, కొండాపూర్, ఆరేపల్లి గ్రామాల మీదుగా ప్రతిపాదించిన డి-వన్ వరద కాలువ నిర్మాణాన్ని నిలిపివేయాలని కోరుతూ ఐదు గ్రామాల రైతులు బుధవారం చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంను కలిసి వినతిపత్రం సమర్పించారు. 17 ఏళ్ల క్రితం ప్రతిపాదించిన ఈ కాలువ నిర్మాణంతో విలువైన వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పాత కాలువలు అందుబాటులో ఉన్నందున వాటిని పునరుద్ధరించాలని లేదా ప్రభుత్వ భూముల మీదుగా ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించాలని కోరారు. భూములకు పరిహారాన్ని ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే సత్యం, వారికి న్యాయం జరిగేలా చూస్తానని సానుకూలంగా స్పందించినట్లు రైతులు తెలిపారు.

## అవడం రంగనాథ్‌కు విజయదశమి శుభాకాంక్షలు

**పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భాస్కర్ మర్యాదపూర్వక భేటీ**



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 22:**
సంగారెడ్డి జిల్లా :- కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో ఫైనాన్షియల్ అడ్వైజర్ (డిప్యూటీ డైరెక్టర్)గా విధులు నిర్వహిస్తూ, అఖిల భారత పద్మశాలి సంఘం కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న అవడం రంగనాథ్‌ను తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం సంగారెడ్డి--మెదక్ జిల్లాల అధ్యక్షుడు జట్ల భాస్కర్ గురువారం సంగారెడ్డిలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రంగనాథ్‌కు విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలియజేసి, కండువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సందీప్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్, హరీష్‌రావులను కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన గుర్రపు మచ్చేందర్

**ఖేడ్ నియోజకవర్గ సమస్యలపై నేతలతో చర్చ**





**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 22:**
సంగారెడ్డి జిల్లా :- టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులను హైదరాబాద్‌లో ఎన్నారై జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్ మర్యాదపూర్వకంగా కలిసి విజయదశమి పండుగ శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా నారాయణఖేడ్ నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలు, ఇతర అంశాలపై వారితో చర్చించినట్లు గుర్రపు మచ్చేందర్ తెలిపారు. విజయదశమి పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, అందరికీ విజయం చేకూరాలని ఆకాంక్షించారు.

## నాణ్యమైన ఆహారం పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి బాపు మల్ శెట్టి



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 22:**
సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని కరస్ గుత్తి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మన టిఫిన్ సెంటర్, భోజన హోటల్‌ను నారాయణఖేడ్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాపు మల్ శెట్టి గురువారం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాపు మల్ శెట్టి మాట్లాడుతూ హోటల్‌కు వచ్చే వినియోగదారులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించడంతో పాటు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. హోటల్ యజమానులు రితిక, రమేష్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ రాష్ట్ర నాయకులు డాక్టర్ డి. ఓం ప్రకాశ్, జ్ఞానేశ్వర్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు భీమయ్య ముదిరాజ్, మహమ్మద్ ఆరిఫ్, మోహన్ నాయక్, సంగమేశ్వర్ చారి, మోహన్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొన్న ట్రాక్టర్.. ఇద్దరికి తీవ్ర గాయాలు..

హుజురాబాద్ మండల పరిధిలోని సిర్సపల్లి గ్రామ శివాలయం సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన అరుణ (40), ఆటో డ్రైవర్ దేవేందర్ (27) ప్రయాణిస్తున్న ఆటోను సిర్సపల్లి సమీపంలో ఓ ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో తీవ్రంగా దెబ్బతినగా, డ్రైవర్ దేవేందర్‌తో పాటు అరుణకు తల భాగంలో బలమైన రక్తగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 అత్యవసర సేవా సిబ్బంది.. పైలెట్ సదన్ రెడ్డి, ఈఎంటీ రాజేందర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హుజురాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## బేతంచెర్ల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం



నగర పంచాయతీ ఎన్నికల్లో కూటమి చైర్మన్ అభ్యర్థి టీఈ లోకేష్ గౌడ్‌తో పాటు కూటమి అభ్యర్థులను గెలిపించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి,ఆయన కుమార్తె కోట్ల చిత్రమ్మ ప్రజలను కోరారు. గురువారం పట్టణంలోని 1వ వార్డు అభ్యర్థి సయ్యద్ ఇద్రుస్ బాషా,7వ వార్డు అభ్యర్థి మురళీకృష్ణ,8వ వార్డు అభ్యర్థి దస్తగిరి,10వ వార్డు అభ్యర్థి పోలూరు సోమశేఖర్ రెడ్డి తరఫున వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల చిత్రమ్మ మాట్లాడుతూ బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ పదవి తొలిసారిగా బీసీ వర్గానికి కేటాయించబడిందని,ఈ నేపథ్యంలోబీసీలంతా ఐక్యంగా ఉండి కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వ పాలనకు,ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలోజరుగుతున్న అభివృద్ధికి మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనించాలని అన్నారు. పట్టణంలోని పలు వీధుల్లోసిమెంట్ రోడ్ల నిర్మాణం,తాగునీటి సమస్యల పరిష్కారానికి చేపట్టిన చర్యలు అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధి,ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోలూరు రాఘవరెడ్డి,బుగ్గన ప్రభాకర్ రెడ్డి,వంశీ,రామనాథం,జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

# 25న విశ్వకర్మ పొలిటికల్ సమ్మిట్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 22:**
విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ ఆధ్వర్యంలో మరో కీలక రౌండ్ టేబుల్ సమావేశానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 25న మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు విశ్వకర్మ పొలిటికల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్టు జేసేసీ కన్వీనర్, పారిశ్రామికవేత్త, సీనియర్ జర్నలిస్ట్ దేవరకొండ కాళిదాస్, కో-కన్వీనర్ అడ్లూరి రవీంద్రాచారిలు తెలిపారు. తెలంగాణలో విశ్వకర్మల జనాభా 10 నుండి 12 లక్షల మధ్య ఉందని, కేవలం 2 శాతం ఓట్ల తేడాతో ప్రభుత్వాలు ఏర్పడుతున్న తరుణంలో... 4 నుంచి 5 శాతం ఓటు బ్యాంకుతో ఎన్నికలను నిర్దేశించే స్థాయిలో విశ్వకర్మలు ఉన్నారని జేఏసీ నాయకులు తెలిపారు. అయిదు వృత్తులతోపాటుగా, అన్ని రంగాలలోనూ విశ్వకర్మలు తమ సత్తా చాటుతున్నారని గుర్తుచేశారు. సోమాజిగూడలోని ప్రెస్ క్లబ్ హైదరాబాద్‌లో జరిగే పొలిటికల్ సమ్మిట్‌కు అన్ని పార్టీలలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, సర్పంచులు, ఎన్నికలలో పోటీ చేసిన, ఎన్నికలకు సన్నద్ధమవుతున్న, ఆశావహ విశ్వకర్మలు భారీగా తరలివస్తున్నారని వెల్లడించారు. ఈ సదస్సుకు విశ్వకర్మ సమాజంలోని రాజకీయ జిజ్ఞాస కలిగిన వారంతా హాజరుకావచ్చని వివరించారు. విశ్వకర్మలను రాజకీయాలకు సన్నద్ధం చేయడం, కొత్త తరాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ సమ్మిట్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా మెట్రో కార్యాలయంలో సమ్మిట్ వాల్ పోస్టర్‌ను జేఏసీ ప్రతినిధులు ఆవిష్కరించారు. రిటైర్డ్ ఇంజనీర్ మల్లయ్య, సీనియర్ జర్నలిస్టులు బైరోజు వీరశేఖరాచారి, బి.రాజమౌళిచారి పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి అమిత్ షా జన్మదిన వేడుకలు




**హైదరాబాద్ : అక్టోబర్ 22 ( వెలుతురు )**
కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా జన్మదినాన్ని రాష్ట్రీయ అమిత్ షా యువ సంఘటన్ హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్ నాథ్ నేతృత్వంలో నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. హైదర్ గూడలోని ఎన్ఎస్ఎస్ లో కేక్ కట్ చేసి అమిత్ షాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ బస్తీలలో పేద ప్రజలకు నిత్యావసర సరుకులు, విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు... ఆసుపత్రి ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రమ్ నాథ్ మాట్లాడుతూ.. దేశ ప్రజల సంక్షేమం కోసం అమిత్ షా నిరంతరం దేశ భద్రత కోసం నక్సలిజాన్ని



నిలుమూరించడంలో అమిత్ షా ఆయన అచంచలమైన నిబద్ధత, దృఢమైన, సకాలంలో నిర్ణయాలు, యుద్ధ ప్రాతిపదికన తీసుకునే విధానం భారతదేశాన్ని బలమైన, సురక్షితమైన దేశంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. దేశంలో శాంతిభద్రతలను కాపాడటానికి, సేవ చేయడానికి ఆయన చేస్తున్న ప్రయత్నాలలో ఆయన విజయం సాధించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నానని. దేశ సమగ్రతను దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు చేస్తూ... రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు, విద్యార్థులకు అండగా నిలవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో సుమన్ సాయి వంశీ రాష్ట్రీయ అమిత్ షా యువ సంఘటన్ నాయకులు పాల్గొన్నారు.



## అన్న సమారాధన కార్యక్రమానికి కంబాల రూ.25 వేల విరాళం

గోకవరం మండలం కామరాజుపేట దుళ్ల వీధిలో దేవీ నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించనున్న, అన్న సమారాధన కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు రూ. 25 వేల విరాళం అందించారు. కామరాజుపేటకు చెందిన యువత దేవీ నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని, ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించాలని కోరుతూ గోకవరం? తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయంలో కంబాల శ్రీనివాసరావును యువత కోరారు. స్పందించిన కంబాల శ్రీనివాసరావు అన్న సమారాధనకు గాను రూ. 25 వేల విరాళాన్ని ఆన్‌లైన్ ద్వారా వారికి అందజేశారు.

# ట్యాంక్‌బండ్‌పై మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయడం అభినందనీయం

- మరి బీసీలకు రాజ్యాధికారంలో వాటా కల్పించరా?
- కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో బీసీలకు 50 శాతం అవకాశం కల్పించాలి
- గవర్నర్ కోటాలో భర్తీ చేసే నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల్లో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలి
- బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 22:**
తెలంగాణ రాష్ట్రంలో మహనీయుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయడం ద్వారా వారి సేవలను స్మరించుకోవడం అభినందనీయమని,అయితే బీసీలకు రాజకీయ అధికారంలో తగిన ప్రాతినిధ్యం



కల్పించినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో గణనీయమైన వాటా కలిగిన బీసీలకు రాజకీయ పదవుల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు కేవలం మహనీయుల విగ్రహాలు, జయంతి ఉత్సవాలకే పరిమితం కాకుండా, పాలనలోనూ నిర్ణయాధికారం లోనూ సముచితమైన భాగస్వామ్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో 50 శాతం బీసీలకు కేటాయించాలి. బీసీల జనాభా దామాషా, సామాజిక న్యాయం ప్రాతిపదికన నామినేటెడ్ పదవుల్లో తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. ముఖ్యంగా త్వరలో భర్తీ చేయనున్న గవర్నర్ కోటా నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవుల్లో ఇద్దరు బీసీ నాయకులకు అవకాశం కల్పించి, బీసీల రాజకీయ ప్రాతినిధ్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నిరూపించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వార్డు కమిటీలను బలోపేతం చేయాలి

- పురపాలక పరిపాలనలో పౌరుల భాగస్వామ్యం పెంచాలి
- ఎంఏ అండ్ యూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి యూఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్ తెలంగాణ వినతి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 22:**
పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి (ఎంఏ అండ్ యూడీ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ, ఎంఎంసీ, సీఎంసీ ప్రత్యేక అధికారిని యూఎఫ్ఈఆర్‌డబ్ల్యూఏఎస్ తెలంగాణ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపి, పురపాలక సంస్థలు, పట్టణ పరిపాలనకు సంబంధించిన వివిధ సమస్యలను ప్రస్తావిస్తూ వినతిపత్రాన్ని సమర్పించారు.

### వర్షపు నీటి నిర్వహణపై దృష్టి

సమర్థవంతమైన క్షేత్రస్థాయి పాలన, మెరుగైన పౌర సేవలను అందించేందుకు సీయూఆర్ఈ చట్టం ప్రకారం వార్డు కమిటీల ద్వారా పట్టణ పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని సభ్యులు నొక్కిచెప్పారు. పురపాలక పరిపాలనలో పౌరుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు వార్డు కమిటీలను బలోపేతం చేయాలని కోరారు. సమర్థవంతమైన వర్షపు నీటి నిర్వహణకు వీలుగా వర్షపు నీటి నిల్వ గుంతలు ఏర్పాటు చేయడంతో పాటు రహదారి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు.

### ఎస్టీపీ అదనపు నీటి సక్రమ నిర్వహణకు విజ్ఞప్తి



గేటెడ్ కమ్యూనిటీల నుంచి మురుగునీటి శుద్ధి కర్మాగారాల (ఎస్టీపీ) ద్వారా వచ్చే అదనపు నీటిని సేకరించి, సక్రమంగా నిర్వహించేలా చూడాలని కోరారు. విస్తృత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు నిబంధనల అమలును మెరుగుపరిచేందుకు నమోదు ప్రక్రియలను సరళీకృతం చేసి, నమోదు రుసుములను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.
ఈ సమావేశంలో సీతారాం ధోలిపాల, వి.వి. రావు, ఆర్.సి.వి. బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. లేవనెత్తిన సమస్యలను పరిశీలించి, పట్టణ పరిపాలనను బలోపేతం చేయడంతో పాటు సుస్థిర నీటి నిర్వహణను ప్రోత్సహించేందుకు, పురపాలక పరిపాలనలో పౌరుల భాగస్వామ్యాన్ని మరింత సులభతరం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సభ్యులు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ అధికారులను కోరారు.

# కొమరం భీమ్ ఆదివాసీ యోధుడు 125వ జయంతి

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 22:**
జల్, జంగిల్, జమీన్ (నీరు, అడవి, భూమి) హక్కుల కోసం పోరాడిన ఆదివాసీ వీరుడు,పోరాట యోధుడు కొమరం భీమ్ 125వ జయంతి సందర్భంగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ ఆయన చేసిన పోరాటపటమను గుర్తు చేశారు. కొమరం భీమ్ ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం నిజాం పాలనకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన గొప్ప విప్లవ యోధుడని కొనియాడారు. ఆదివాసీ ప్రజల జీవనాధారమైన నీరు, అడవి,భూమిపై వారికి సంపూర్ణ హక్కులు ఉండాలని నినదిస్తూ, వారి ఆత్మగౌరవం,స్వేచ్ఛ,హక్కుల సాధన కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. కొమరం భీమ్ పోరాట స్ఫూర్తి నేటికీ ఆదివాసీలకే కాకుండా సమాజంలోని అణగారిన వర్గాలందరికీ ఆదర్శమని అన్నారు. బడుగు,బలహీన వర్గాలు తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని, సామాజిక న్యాయం సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ వీరుల చరిత్రను భావితరాలకు తెలియజేసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం,




అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కొమరం భీమ్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని జాజుల లింగం గౌడ్ అన్నారు.

## అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా బీఆర్ఎస్ పార్టీ నాయకులు విస్తృత అవగాహన కల్పించాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సనత్ నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబర్ 6వ తేదీ వరకు గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. కాలనీలు, బస్తీలతో సంబంధం లేకుండా అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదుకు ప్రోత్సహించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ బాధ్యతగా వ్యవహరించి నమోదు ప్రక్రియపై విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించిన పార్టీ నాయకులను తలసాని అభినందించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం సమష్టిగా కృషి చేయాలి



హైదరాబాద్- రంగారెడ్డి- మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. నాంపల్లిలోని రెడ్ రోజ్ గార్డెన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. హైదరాబాద్ పరిధిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీకి ఎంతో రాజకీయ ప్రాధాన్యత కలిగినవని తెలిపారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా భవిష్యత్తులో హైదరాబాద్ పరిధిలో జరిగే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పార్టీ సీనియర్ నాయకుల సలహాలు, సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు తెలిపారు. అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు. నవంబర్ 6వ లోపు అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పండుగలు ముగిసిన నేపథ్యంలో మరుసటి రోజు నుంచే పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాల్లో బూత్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు తదితర అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించి, పీసీసీ నాయకులతో కలిసి రోజువారీగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోం

### మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్

కోహెడ మండలం, ధర్మసాగర్‌పల్లి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన పేరుతో రాజకీయ కక్షసాధింపులకు పాల్పడటం సిగ్గుచేటని, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని కేసులతో వేధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ విమర్శించారు. కోహెడ మండలం ధర్మసాగర్‌పల్లి గ్రామంలో కేసులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను ఆయన పరామర్శించి, పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష కార్యకర్తలను కేసులతో భయపెట్టాలని చూడటం వారి రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని అన్నారు. కేసులు పెట్టినంత మాత్రాన బీఆర్ఎస్ కార్యకర్తలు వెనక్కి తగ్గరని, ఉద్యమాల నుంచి పుట్టిన బీఆర్ఎస్ పార్టీని బెదిరింపులతో అణచివేయడం ఎవరి వల్లా కాదని స్పష్టం చేశారు. అధికారం శాశ్వతం కాదు ప్రజాసేవే అసలైన బాధ్యత. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి ఉపయోగించకూడదని హితవు పలికారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను వేధించడమే పనిగా పెట్టుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని బయటపెడుతోందని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను రాజకీయ కక్షతో వేధించే విధంగా వ్యవహరించలేదని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమని అన్నారు. అవసరమైతే



హైకోర్టును ఆశ్రయిస్తాం:బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోం ప్రతి కార్యకర్త వెనుక పార్టీ అండగా ఉంటుంది. బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు అండగా నిలుస్తాం. అవసరమైతే హైకోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తాం. సంబంధిత కేసులు చట్టబద్ధంగా కొట్టివేయబడే వరకు మా పోరాటం కొనసాగుతుంది. కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు అని సతీష్ కుమార్ స్పష్టం చేశారు. బంధువుల ద్వారా పాలన సాగించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం:మండలాల వారీగా బంధువులను ముందుంచి, వారి ద్వారానే ప్రభుత్వ పనులు చేయించే విధానం రాజుల కాలం నాటి పాలనను తలపిస్తోందని సతీష్ కుమార్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి, నేరుగా ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉందని అన్నారు. అధికారులను, ప్రజలను పక్కనపెట్టి బంధువుల ద్వారా పాలన సాగించాలనుకోవడం సరైన విధానం కాదని పేర్కొన్నారు.

## కథలాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

### విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం.

జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించే క్రమంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారు ఈరోజు కథలాపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, స్టేషన్ రికార్డులు, సిబ్బంది హాజరు, బీట్ వ్యవస్థ, రౌడీషీటర్లు మరియు నేరస్తులపై నిఘా, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజాఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, ప్రజలకు భద్రతాభావం కల్పించేలా విజిబుల్ పోలీసింగ్‌ను ముమ్మరం చేయాలని ఆదేశించారు. సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, గ్రామాల్లో జరిగే ప్రతి ముఖ్యమైన ఘటనను ఉన్నతాధికారులకు వెంటనే తెలియజేయాలని సూచించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసి చోరీలు, గంజాయి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై కఠిన నిఘా కొనసాగించాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అలాగే సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మైనర్ల వాహన వినియోగం, ప్రమాదకర డ్రైవింగ్, మోడిఫైడ్ సైలెన్సర్లపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## జనరిక్ మందులపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

అనారోగ్యంతో ఆసుపత్రి పాలైతే పేషెంట్ జబ్బు వల్ల కాకుండా మందుల బిల్లుకు భయపడే పరిస్థితి పోవాలంటే జనరిక్ మందులపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాలని వారధి ట్రస్ట్ చైర్మన్ కట్టమూరి సుబ్బారావు తెలిపారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్టీ రవీంద్ర విక్రమ్ తో కలిసి ఆయన మాట్లాడుతూ డాక్టర్లు రాసే మందుల చీటీలోని కార్పొరేట్ మందుల కంటే అత్యంత తక్కువ ధరలో అవే రకమైన మందులను అందించే జనరిక్ ఔషధాలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. డాక్టర్లు తమ ప్రిస్క్రిప్షన్ లో కార్పొరేట్ మందుల పేర్లు రాయవద్దని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సూచిస్తున్నా కూడా అలా జరగక పోవడం వల్ల పేషెంట్లు మందుల కోసం అత్యధిక డబ్బులను వెచ్చించాల్సి వస్తుందని, కార్పొరేట్ మందులతో పోలిస్తే అత్యంత తక్కువ ధరలో అదే మందును అందిస్తున్న జనరిక్ మందుల పట్ల ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఇకముందు వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బ్రాండెడ్, కార్పొరేట్ మందులకు, జనరిక్ మందుల మధ్య ధరల వ్యత్యాసాలను ఆయన వివరించారు.

## కొడంగల్ ఆలయ నిర్మాణ పనులు పరిశీలించిన సీఎం రేవంత్

వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని ప్రసిద్ధి చెందిన శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. పేదల తిరుపతిగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాన్ని అత్యంత వైభవంగా తీర్చిదిద్దే పనులు కొనసాగుతున్నాయి. ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు ముఖ్యమంత్రి బాలాలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.

## మెడికవర్ ఆసుపత్రిలో రోగి మృతి ఘటన

- సోషల్ మీడియాలో అవాస్తవాల ప్రచారం
- స్పందించిన యాజమాన్యం

సికింద్రాబాద్ మెడికవర్ ఆసుపత్రిలో రోగి మృతి ఘటనపై స్పందించిన యాజమాన్యం, తప్పుడు ప్రచారంపై సమగ్ర విచారణకు డీజీపీని కోరనున్నట్లు వెల్లడించింది. హాస్పటల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో హాస్పిటల్స్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కృష్ణ మాట్లాడుతూ యువ రోగి మృతి పట్ల విషాదం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రోగి వచ్చినప్పటి పరిస్థితితో పాటు చికిత్స విధానం గురించి చెబుతూ వైద్యులు అవసరమైన చికిత్సలు మాత్రమే అందచేయడం జరిగిందని వివరించారు. ఈ ఘటనకు సంబంధించి కొన్ని వేదికల్లో వాస్తవాలకు విరుద్ధమైన సమాచారం ప్రచారం అవుతున్న నేపథ్యంలో ప్రజలకు సరైన వివరాలు తెలియాల్సిన అవసరం ఉందని ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రోగి బయటి డయాగ్నస్టిక్ సెంటర్‌లో చేయించుకున్న సీటీ స్కాన్‌తో ఆసుపత్రికి వచ్చారని, ఆ నివేదికలో సుమారు 16 x 17 x 20 మిల్లీమీటర్ల పరిమాణంలో కిడ్నీ రాయి ఉన్నట్లు, అది మూత్ర ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో మూత్రపిండంలో వాపు ఏర్పడినట్లు వెల్లడైందని ఆ పరిమాణంలో ఉన్న రాయిని తొలగించడానికి శస్త్ర చికిత్స తప్పనిసరి అని అందుకే శస్త్ర చికిత్స చేసి తొలగించడం జరిగిందని చెప్పారు. కానీ 1ఎంఎం, 2ఎంఎం అని రాయి అని సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేసారని అన్నారు. కొంతమంది వ్యక్తులు మెడికవర్ హాస్పిటల్ కు ఒక రాజకీయ పార్టీ నేతకు సంబంధం అంతకడుతూ తమ సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నం చేసారని వారిపైన చట్ట రిత్యా చర్యలు తీసుకోవాలని కోరడంతో పాటు పరువు నష్టం దావా కూడా వేయనున్నట్లు వెల్లడించారు.

## పోలీసు శాఖలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం



ప్రజలకు మరింత వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంపోలీసు అధికారులు, సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించి, విధుల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ శ్రీమతి డి,సునిత రెడ్డి, ఐపీఎస్., అన్నారు. పోలీసు కార్యాలయాల్లో మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా పరిపాలనా సామర్థ్యం పెరిగి, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని ఆమె పేర్కొన్నారు. వనపర్తి సర్కిల్ కార్యాలయంలో నూతనంగా నిర్మించిన అదనపు గదిని బుధవారం జిల్లా ఎస్పీ డి,సునిత రెడ్డి, ఐపీఎస్., ప్రారంభించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయ విధులను సౌకర్యవంతంగా నిర్వహించేందుకు ఈ గదిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ కార్యాలయాన్ని పరిశీలించి, సిబ్బందికి అందుబాటులో ఉన్న సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కార్యాలయ మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకుని ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన పోలీసు సేవలను అందించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని ఆమె కోరారు. విధుల నిర్వహణలో సమన్వయం, క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన సేవాభావం అత్యంత ముఖ్యమని తెలిపారు.

# ఇకపై కంటి గాయాలకు అత్యవసర చికిత్స

- దేశంలోనే మొదటి వినూత్న కార్యక్రమం
- 108 ఈఎంఆర్ఐ అంబులెన్స్‌లు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 22 :** కంటి గాయాల బాధితులకు తక్షణ ప్రాథమిక చికిత్స అందించడం, సకాలంలో ప్రత్యేక ఆసుపత్రులకు తరలించడం ద్వారా శాశ్వత దృష్టి లోపాన్ని నివారించేందుకు ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల, ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ (108), సరోజినీ దేవి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో దేశంలోనే మొట్టమొదటి వినూత్న కార్యక్రమాన్ని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ డైరెక్టర్ కే కృష్ణంరాజు, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గుళ్ళపల్లి ఎన్ రావు ప్రారంభించారు. దీపావళి పండుగ వేళ కంటి ప్రమాదాలు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చిన ఈ సేవల్లో భాగంగా 108 అంబులెన్స్ పారామెడికల్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణతో పాటు కంటి అత్యవసర కిట్లను సమకూర్చారు. కంటి గాయాల విషయంలో తక్షణమే సరైన వైద్యం అందించడం అత్యంత ఆవశ్యకం. చికిత్సలో ఆలస్యం జరిగితే తీవ్రమైన దుష్ప్రభావాలతో పాటు శాశ్వత దృష్టి లోపం ఏర్పడే ప్రమాదం ఉంది. ఉమ్మడి భాగస్వామ్యంతో కంటి గాయాలను గుర్తించడం, సత్వర ప్రాథమిక చికిత్స అందించడం, సకాలంలో ప్రత్యేక కంటి ఆసుపత్రులకు తరలించడం, అత్యవసర స్పందన వ్యవస్థల సామర్థ్యాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈఎంఆర్ఐ జీహెచ్ఎస్ ఆధ్వర్యంలో నడిచే 108 అంబులెన్సుల పారామెడికల్ సిబ్బందికి కంటి గాయాల బాధితులకు ప్రత్యేక కంటి ఆసుపత్రికి తరలించేలోపు ప్రాథమిక చికిత్స అందించేలా శిక్షణ ఇచ్చారు. అంబులెన్సులలో ప్రత్యేక కంటి గాయాల కిట్లను కూడా అందుబాటులో ఉంచారు. కంటి గాయాల వల్ల సంభవించే నివారించదగిన అంధత్వాన్ని తగ్గించే లక్ష్యంలో ఇది అత్యంత కీలకమైన అడుగు. ముఖ్యంగా యువత, పని చేసే వయసులో ఉన్న వారిలో దృష్టి లోపానికి కంటి గాయాలే ప్రధానమైనవి. సాధారణంగా కంటి గాయమైన బాధితులు ఆసుపత్రికి చేరుకోవడానికి సగటున నాలుగు రోజుల సమయం పడుతోంది. దీనివల్ల చికిత్స తర్వాత పూర్తి దృష్టి తిరిగి వచ్చే అవకాశాలు తగ్గిపోతున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా బాధితులను వెంటనే ప్రత్యేక కంటి ఆసుపత్రికి చేర్చడం సాధ్యమవుతుంది. తద్వారా రోగులకు మెరుగైన దృష్టి ఫలితాలు లభిస్తాయి.

# హైడ్రాపై పాట విడుదల



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 22:** నగరం ఎలా ఉండేది.. ఆక్రమణలతో ఎలా వరదలకు గురైంది.. ప్లాస్టిక్ వ్యర్థాలతో వరద కాలువలు ఎలా నిండిపోయాయి.. హైడ్రా వచ్చిన తర్వాత నగరం ఎలా భద్రంగా మారింది అనే అంశాలను వివరిస్తూ బొడసింగి సురేష్ కుమార్ పాడిన పాటను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం విడుదల చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన చేతుల మీదుగా ఈ పాటను బొడసింగి సురేష్ కుమార్ విడుదల చేయించారు. వలస బతుకుల మీద పాడిన పాటను ఏవీ రంగనాథ్ పుట్టిన రోజున గతేడాది విడుదల చేయించిన సురేష్ కుమార్ ఈ ఏడాది హైడ్రాతో నగరంలో వచ్చిన మార్పును వివరించారు. రాంగోపాల్ పేట పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ఓ, సర్కిల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తూనే.. జనాన్ని చైతన్యం చేస్తూ సురేష్ కుమార్ పలు పాటలు పాడడం అభినందనీయమని హైడ్రా కమిషనర్ అన్నారు. ఇటీవల గణేష్ ఉత్సవాల సమయంలో డీజే సౌండ్స్ మీద సురేష్ తన పాటతో తెచ్చిన చైతన్యం అభినందనీయమన్నారు. సురేష్ కడారి ఈ పాటను రచించగా.. కళ్యాణ్ కీస్ సంగీతం అందించారు.

### ఒప్పందాలు పెట్టుబడులుగా మారి

## ఉత్పత్తి ప్రారంభించే అంశంపై దృష్టి పెట్టాలి



**అమరావతి, వెలుతురు అక్టోబర్ 22 :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 22వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు లోకేష్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నారాయణ, కందుల దుర్గేష్, వర్చువల్గా హాజరైయిది. పరిశ్రమలు, ఇంధన శాఖ, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన రంగాల్లో వివిధ పెట్టుబడి ప్రతిపాదనలపై ఎస్ఐపీబీలో చర్చ జరిగింది. గతంలో కుదుర్చుకున్న ఒప్పందాలు పెట్టుబడులుగా మారి ఉత్పత్తి ప్రారంభించే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. మొత్తం 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టులకు సంబంధించి కార్యాచరణ ప్రారంభించినట్టు అధికారులు వెల్లడించారు. పెట్టుబడుల సదస్సు నిర్వహించేందుకు వీలుగా విశాఖలో ఓ అంతర్జాతీయ స్థాయి అత్యుత్తమ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు అయ్యేలా చూడాలని సీఎం ఆదేశించారు. రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్లో పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలు కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. లాజిస్టిక్స్ హబ్లో భాగంగా పోర్టులు, ఎయిర్ పోర్టులతో పాటు ఈస్ట్ వెస్ట్ కనెక్టివిటీపై దృష్టి పెట్టాలని సూచించారు. సెమీ కండక్టర్ రంగంలో తయారీ యూనిట్లతో కూడిన ఎకోసిస్టం రాష్ట్రంలో ఏర్పాటు కావాలని ముఖ్యమంత్రి అన్నారు.

# మేడిగడ్డ కేసును మళ్లీ తెరవాలి

- మూడేళ్లయినా విచారణలో పురోగతి లేదు.. సిట్‌తో దర్యాప్తు చేయాలి
- రేవంత్ ప్రభుత్వంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజం



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 22:** కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడంపై నమోదైన కేసును మళ్లీ విచారించాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మూడేళ్ల క్రితం ఫిర్యాదు చేసినా విచారణలో పురోగతి లేకపోవడం, 2025లో కేసును గుర్తుతెలియని నిందితుల పేరుతో మూసివేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో సమగ్ర సాంకేతిక విచారణ జరిపి, ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని కోరారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజీ 20వ పిల్లర్ వద్ద భారీ శబ్దం వచ్చిందని అసిస్టెంట్ ఇంజనీర్ రవికాంత్ మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. పేలుడు పదార్థాలు ఉపయోగించి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమైనపుడు బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించి, సాంకేతిక ఆధారాలతో విచారణ జరపాల్సి ఉందన్నారు. భూకంపం కారణమా అనే కోణంలోనూ సంబంధిత సంస్థలతో పరిశీలన చేయాల్సి ఉండగా, ఎలాంటి ఆధారాలు లభించలేదంటూ కేసును మూసివేయడం అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. ఈ వ్యవహారంపై డీజీపీకి త్వరలో లేఖ రాస్తామని వెల్లడించారు.

**రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు**

రాష్ట్రంలో పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనేక ప్రాంతాల్లో వరి పంటకు నీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని సాకుగా చూపి ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకుంటోందని విమర్శించారు. కరువును ఎదుర్కొనేందుకే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని, ప్రస్తుత పరిస్థితుల్లోనూ అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కన్నెపల్లి పంపుహౌస్‌లో మోటార్లు నడిపి నీటిని ఎత్తిపోయవచ్చని, బీఆర్ఎస్ పోరాటం తర్వాత మోటార్లు ప్రారంభించిన ప్రభుత్వం మళ్లీ నిలిపివేసిందని అన్నారు. రూ. 40 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మిస్తే నీటిని ఎత్తిపోయవచ్చని, రోజుకు ఒక టీఎంసీ నీటినైనా వినియోగించుకునే అవకాశం ఉన్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావం, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రూ. 20 వేల కోట్ల పంట నష్టం జరిగే ప్రమాదం ఉందని వ్యవసాయ విశ్వవిద్యాలయం నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ వ్యవహారంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల పాత్రపైనా విచారణ జరపాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. వారి ఫోన్ కాల్ వివరాలతో పాటు రాజకీయ వ్యూహకర్తల కోణంలోనూ దర్యాప్తు చేయాలన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని తనుగుల చెక్‌డ్యామ్ పేల్చివేత కేసును కూడా మూసివేశారని ప్రస్తావిస్తూ, ఈ ఘటనల వెనుక ఇసుక మాఫియా ప్రమేయంపై అనుమానాలున్నాయని ఆరోపించారు. మరోవైపు, ప్రజాధనాన్ని ఇతర అవసరాలకు భారీగా ఖర్చు చేస్తున్న ప్రభుత్వం రైతుల కోసం నిధులు కేటాయించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. అనుభవజ్ఞులైన ఇంజనీర్ల సేవలను వినియోగించుకోవాలని, గతంలో పనిచేసిన అధికారులను బెదిరించి జైలుకు పంపడం సరికాదన్నారు. ఎన్ని కేసులు పెట్టినా తెలంగాణ రైతాంగం కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు మేడే రాజీవ్ సాగర్, బాక్రి, గెల్లు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణకు సమరశంఖం

- కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం
- ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకుంటాం : కేటీఆర్
- టెండర్ల అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలి



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 22 :** సింగరేణి సంస్థ ప్రయోజనాలను కాపాడటంతో పాటు బొగ్గు గని కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను బలహీనపరిచే, ప్రైవేటీకరణ దిశగా నడిపించే ప్రయత్నాలను అడ్డుకుంటామని, కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని తేల్చిచెప్పారు. గోదావరిఖనిలో ఇటీవల నిర్వహించిన సింగరేణి కార్మిక గర్జన సభ విజయవంతమైన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు గురువారం తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. సింగరేణిలో ప్రస్తుత పరిస్థితులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్థ భవిష్యత్తు, కార్మిక సంఘం బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. సమావేశానికి హాజరైన నాయకులు కేటీఆర్‌కు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ ముప్పు నుంచి కాపాడటంతో పాటు సంస్థలో జరుగుతున్న అవకతవకలు, టెండర్ల వ్యవహారాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. గోదావరిఖని సభలో ప్రస్తావించిన సింగరేణి ఆర్థిక వ్యవహారాలు, బొగ్గు ఉత్పత్తి తగ్గుదల, టెండర్లలో అక్రమాల ఆరోపణలు, సంస్థకు రావాల్సిన నిధుల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన సింగరేణి కార్మికుల సంక్షేమంపై విస్తృతత ప్రచారం చేయాలని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కార్మికులకు మరింత అండగా ఉండాలని సూచించారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన, సంక్షేమ కార్యక్రమాల పునరుద్ధరణ, టీబీజీకేఎస్ బలోపేతం లక్ష్యంగా రానున్న రోజుల్లో సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో నిర్ణయించారు. సింగరేణి కార్మికులకు అండగా ఉంటూ కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల వైఖరిని ఎండగడతామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.

## కొత్తపల్లి మండలంలో ఎంపీటీసీ నామినేషన్లు..

### 10 మంది అభ్యర్థుల వివరాలు వెల్లడి



**కొత్తపల్లి వెలుతురు అక్టోబర్ 22 :** నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలో ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియలో భాగంగా వివిధ గ్రామాల నుంచి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ పత్రాల్లో పేర్కొన్న వివరాల ప్రకారం టీడీపీ, వైఎస్సార్‌సీపీ, బీజేపీ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచారు. గ్రామాల వారీగా అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి: దుద్యాల-2 ఎంపీటీసీ: టీడీపీ తరఫున ఈరగాళ్ల రాజు నామినేషన్ దాఖలు చేయగా, వైఎస్సార్‌సీపీ తరఫున రాజమూరి పుల్లయ్య, బంగి చిన్న లింగమ్మ నామినేషన్లు సమర్పించారు. ఎర్రమఠం ఎంపీటీసీ: వైఎస్సార్‌సీపీ తరఫున పెరుగు నాగలక్ష్మి రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. నందికుంట ఎంపీటీసీ: వైఎస్సార్‌సీపీ తరఫున యర్రం నాగభారతి, స్వతంత్ర అభ్యర్థిగా మేడం పార్వతమ్మ నామినేషన్లు దాఖలు చేశారు. గోకవరం ఎంపీటీసీ: బీజేపీ తరఫున బోయ వేణుగోపాల్ నామినేషన్ సమర్పించారు. శివపురం ఎంపీటీసీ: వైఎస్సార్‌సీపీ తరఫున షేక్ మహమ్మద్ గౌస్ నామినేషన్ దాఖలు చేయగా, స్వతంత్ర అభ్యర్థులుగా షేక్ మహమ్మద్ షా, షేక్ మహబూబ్ బాషా నామినేషన్లు సమర్పించారు. ఎన్నికలపై ఆసక్తికొత్తపల్లి మండలంలోని పలు ఎంపీటీసీ స్థానాల్లో వివిధ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో స్థానికంగా ఎన్నికల సందడి నెలకొంది. ఆయా గ్రామాల్లో అభ్యర్థుల మధ్య పోటీ ఎలా ఉండబోతోందన్న అంశంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. గమనిక: అందించిన జాబితాలో మొత్తం 10 మంది అభ్యర్థుల పేర్లు ఉన్నాయి. నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ అనంతరం తుది పోటీదారుల వివరాలు స్పష్టమవుతాయి.

## కూటమి ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ల సందడి




**కంచికచర్ల వెలుతురు అక్టోబర్ 22 :** కంచికచర్ల మండలంలో కూటమి ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, మ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య గారు మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా కూటమి అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య , రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేప డుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామం లోని ప్రజలకు వివరించాలని నాయకులు, కార్యకర్త లకు సూచించారు. ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను, గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమై పనిచేయాలిప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి సారించాలని సౌమ్య గారు సూచించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ అభ్యర్థులకు అండగా నిలవాలని, ఎన్నికల ప్రక్రియలో ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

**అభ్యర్థులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య శుభాకాంక్షలు**

కంచికచర్ల మండలంలో కూటమి అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య , ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటూ ప్రజల మద్దతు పొందేందుకు కృషి చేయాలని సూచించారు. నామినేషన్లలో పాల్గొన్న కూటమి నేతలు, అభ్యర్థులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం కంచికచర్ల మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడికి వేదికగా నిలిచింది.

# బ్యారేజీని పేల్చేసిన కేసును ఎలా క్లోజ్ చేస్తారు?

- కరువు రేవంత్ రెడ్డి తెచ్చిందే, ఎల్ నినో వల్ల కాదు
- ఆంధ్ర ప్రయోజనాల కోసమే, కాఫర్ డ్యాం కట్టలేదు.డ్యాం లు కూల్చడం యుద్ధనేరమే
- డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,బిఆర్ఎస్



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 22 :** కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష్?మ బ్యారేజ్ 21 అక్టోబర్ 2023 లో రవికాంత్ ఫిర్యాదు చేసి 3 ఏళ్లు దాటింది. ఇప్పటికీ ఎలాంటి చర్యలు లేవు. గాఢ నిద్రలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల్లో రైతులు తీవ్ర బాధలు పడుతున్నారు. పత్తి రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. సి ఎం పట్టించుకోకుండా ఎల్ నినో ప్రభావం వల్ల నీరు ఇవ్వలేం అంటున్నారు. యాసంగి అసలు పంటలు వేయకండి అంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారు. తాగడానికి కూడా నీరు లేవని బెదిరిస్తున్నారు. కానీ వాస్తవాలు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ బాగుంటే ఈ కరువు వచ్చేది కాదు. కంట్రోల్డ్ ఎక్స్ ప్లోజన్ తో డిటోనేటర్లు పెట్టి పేల్చి ఉంటారని అనుమానమని అన్నారు. మేడిగడ్డ లక్ష్మి బారేజ్ లో 8 బ్లాక్ లు ఉండగా... 7 వ బ్లాక్ పిల్లర్ 20 కుంగిపోయింది. అక్టోబర్ 21,2023 లో సాయంత్రం రవికాంత్ ఇంజనీర్ ఫిర్యాదుతో 174/2023 ఐపిసి 357 ప్రకారం కేసు నమోదు అయింది. కేసు నమోదైన వెంటనే నేర స్థలాన్ని సీజ్ చేసి క్రాక్స్ వచ్చిన పిల్లర్ దగ్గర సాంపుల్స్ సేకరించి, వీడియో రికార్డ్ చేసి, సెల్ ఫోన్ టవర్స్ లొకేషన్స్ తీసుకొని కాల్ డేటా తీసుకొని విశ్లేషించాల్సిన పరిస్థితి ఉండాలి. జియాలజీ డిపార్ట్ మెంట్ ద్వారా సీస్మిక్ డాటా సేకరించాల్సింది. భూకంపం ఏమైనా వచ్చిందా, రిక్టర్ స్కేల్ మీద రీడింగ్ ఎంత నమోదైంది అనేది తెలుసుకొని ఉండాలి. ఎందుకంటే డిటొనేటర్లు తో పేలుళ్లు జరిగినపుడు భూకంపం వచ్చినట్టుగా శబ్దం వస్తుంది. 2025 లోనే ఈ కేసును అన్ డిటెక్టివ్ గా మూసేశారు. ఎవిడెన్స్ లేదని, తప్పుడు సమాచారం అని, అన్ డిటెక్టివ్ అని పోలీసిబి కేసు క్లోజ్ చేయవచ్చు. అన్ డిటెక్టివ్ అంటే పోలీసులకు కూడా ఈ కేసులో అనుమానం ఉంది. కాంట్రాక్టర్లు, సిడబ్ల్యుసి రిపోర్ట్ తీసుకున్నారా లేదా? అప్పటికీ కాళేశ్వరం వ్యతిరేకంగా మాట్లాడే కాంగ్రెస్ బిజెపి నేతలు, వారి పోల్ స్ట్రాటజిస్టుల కాల్ డాటా సేకరించారా? హోం మంత్రి రేవంత్ రెడ్డే, ఆయన దగ్గరనే లక్ష మంది పోలీసులు ఉన్నారు. సిఐడి, ఎస్.బి, ఇంటలిజెన్స్,కౌంటర్ ఇంటలిజెన్స్ అందరూ ఆయన చేతిలోనే ఉన్నారు. అయినా కేసులు అర్థాంతరంగా మూసేశారు. ఇది క్లోజ్ చేసే కేసు కాదు. అత్యంత అధునాతన టెక్నాలజీ ఉపయోగించి విచారణ జరపాల్సిన కేసు. ఎలా క్లోజ్ చేశారు. జెనీవా ఒప్పందం ప్రకారం ఏ డ్యాం కూల్చేసినా అది యుద్ధ నేరం అని ప్రపంచ దేశాలు అంగీకరించాయి. అలాంటి యుద్ధనేరం తెలంగాణలో జరిగింది. అలాంటి కేసును ఎలా క్లోజ్ చేస్తారు. 2025 తనుగుల హుజూరాబాద్ మానేరు నది మీద 35 కోట్లతో కట్టిన చెక్ డ్యాం ను దుండగులు పేల్చేశారు. ఆ కేసు కూడా విచారణ చేయకుండా ఆపేశారు. ఇదేంటని అడిగితే ఎక్స్ పర్ట్ ఒపీనియన్‌కి పంపామని చెబుతున్నారు. హుస్సేమియా వాగు మీద మరోసారి పేల్చాలని పోతుంటే పోలీసులే కాంగ్రెస్ నాయకులను ఆపారు. 25 లక్షల క్యూసెక్కుల వరదను ఆపగలిగిన లక్ష్మి బ్యారేజీ. కూలిపోయే నాటికి వరద ప్రవాహం 22 లక్షల క్యూసెక్కులు మాత్రమే ఉంది అలాంపుడు ఎలా కుంగిపోతుంది. కిషన్ రెడ్డి అక్టోబర్ 3 2023న తియస్థా నది మీద కట్టిన డ్యాం ధ్వంసమైతే 70 మంది చనిపోయారు కానీ ఆయన,దీనిపై ఎన్.డి.ఎస్.ఎ కు లేఖ రాయలేదు. కానీ కేవలం మేడిగడ్డలో ఒక పిల్లర్ కుంగిపోయిందని ఎన్ డి ఎస్ ఏ కు కిషన్ రెడ్డి లేఖ రాసారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్, రేవంత్ ఫోన్ కాల్ డాటా మరియు వారి పోల్ స్ట్రాటజిస్టులు,వారితో సంబంధాలు కలిగి ఉన్న మాజీలను గుర్తించి వారి కాల్ డేటా సేకరించి విచారణ చేయాలి. కన్నెపల్లి పంప్ హౌస్ ఆన్ చేయకపోవడం వల్ల ఆంధ్రకు లాభం. క్రాప్ హాలిడే అంటూ సి ఎం మాట్లాడడం దారుణం. సాగు నీరు లేకపోవడానికి కారణం రేవంత్ రెడ్డే. ఇప్పటికే 734 టి ఎం సిల నీరు సముద్రం లో అందులో 400 టి ఎంసి ల నీరు గత ఆగస్టు నెలలోనే కలిసాయి. కేసిఆర్ మీద కోపంతో మాత్రమే కన్నెపల్లి నీరు ఎత్తిపోయలేదు. కేటిఆర్ ,హరీష్ రావు పోరాటంతో కొంత కాలం ఎత్తిపోసి మళ్లీ ఆపేశారు. సీనియర్ రైటైర్డ్ ఇంజనీర్లు చెప్తున్న ప్రకారం, ఇప్పటికీ 1 లక్ష 15 వేల క్యూసెక్కుల నీరు గోదావరి నదిలో పారుతుంది. కేవలం 25,30 కోట్లతో మేడిగడ్డ వద్ద ఇప్పటికైనా కాఫర్ డ్యాం కడితే రోజు 1.4 టి ఎంసి నీరు ఎత్తుకోవచ్చు. కాఫర్ డ్యాం నిర్మాణానికి కేవలం 50 రోజులు పట్టేది. నీరు ఆంధ్రకు పంపడానికే కాఫర్ డ్యాం కట్టలేదని అన్నారు.

# ఫ్రాన్స్ అల్లర్లకు, భారత్ నిరసనలకు లింక్

**-ఫాక్స్ న్యూస్ రిపోర్ట్‌తో కాంగ్రెస్‌పై బీజేపీ ఫైర్**



**న్యూఢిల్లీ, వెలుతురు, అక్టోబర్ 22 :** ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీపై బీజేపీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఫ్రాన్స్‌లో చోటుచేసుకున్న అల్లర్లకు, భారత్‌లో సీఈసీకి వ్యతిరేకంగా జరిగిన నిరసనలకు మధ్య సంబంధం ఉందంటూ అమెరికన్ మీడియా సంస్థ 'ఫాక్స్ న్యూస్' ప్రచురించిన కథనాన్ని బీజేపీ ఈ సందర్భంగా ఉటంకించింది. ఇది కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు కాంగ్రెస్ పన్నిన కుట్ర అని ఆరోపిస్తూ, రాహుల్ గాంధీ ద్రోహి అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసిందిఫాక్స్ న్యూస్ డిజిటల్ నిర్వహించిన పరిశీలనలో, 13 దేశాలకు చెందిన 101 సంస్థలు ఈ నిరసనలను సమన్వయం చేస్తూ మద్దతు ఇస్తున్నట్లు తెలిసిందని సదరు కథనం పేర్కొంది. ఫ్రాన్స్‌లోని అశాంతికి, భారత్‌లో యువత నేతృత్వంలో జరిగిన ప్రదర్శనలకు మధ్య అంతర్జాతీయ సంబంధాలు ఉన్నట్లు ఆరోపించింది.గురువారం ఈ నివేదికను ఆధారంగా చేసుకుని బీజేపీ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా మీడియా సమావేశంలో మాట్లాడారు. "ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ దేశంలో అరాచకాన్ని, ద్రోహాన్ని ప్రోత్సహించే నమూనాను ప్రదర్శిస్తున్నారు. ఈ కుట్రలకు విదేశీ ఏజెన్సీలతో సంబంధాలు ఉన్నాయని నేటి నివేదిక బట్టబయలు చేసింది. కాబట్టి, ఈ ద్రోహుల నాయకుడు ఎవరు? అని ప్రశ్నించడంలో తప్పు లేదు" అని భాటియా ధ్వజమెత్తారు. దురదృష్టవశాత్తు మన ప్రతిపక్ష నేత బాధ్యతారాహిత్యంగా, అపరిపక్వంగా వ్యవహరిస్తున్నారని, లభిస్తున్న ఆధారాల ప్రకార ఆయనను దేశద్రోహి లేదా మీర్ జాఫర్ అని పిలవడంలో అతిశయోక్తి లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఫాక్స్ న్యూస్ రిపోర్ట్ ప్రకారం 'రెడ్-గ్రీన్ ఎకోసిస్టమ్ ఆఫ్ ప్రొటెస్ట్' నడుస్తోందని, ఇందులో 'రెడ్' అంటే కమ్యూనిస్ట్ వర్గాలని, 'గ్రీన్' అంటే ఇస్లామిక్ వర్గాలని ఆయన వివరించారు.మరో బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారి సైతం 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. "ప్రపంచవ్యాప్త దర్యాప్తులో కాంగ్రెస్ సాగిస్తున్న అరాచకం, ప్రభుత్వాన్ని మార్చే కుట్ర బహిర్గతమైంది" అని ఆయన పేర్కొన్నారు. 'ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్' (పీఐ) అనే కమ్యూనిస్ట్ సంస్థ ఫ్రాన్స్, అల్బేనియా, భారత్‌లోని నిరసనలకు ఒకేరకమైన సందేశాలను సమన్వయం చేసిందని, కొత్త తిరుగుబాటు ద్వారా వ్యవస్థీకృత శక్తిని సాధించడమే దీని లక్ష్యమని ఆ నివేదికను ఉటంకిస్తూ భండారి ఆరోపించారు.అంతేకాకుండా, "2025 ఏప్రిల్ 10న రాహుల్ గాంధీ, సోనియా గాంధీలు 10 జనపథ్‌లో ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఇది విదేశీ ప్రజాస్వామ్య వ్యతిరేక శక్తుల రిమోట్ కంట్రోల్‌లో కాంగ్రెస్ ఉందనడానికి నిదర్శనం" అని ప్రదీప్ భండారి సంచలన ఆరోపణలు చేశారు. ఈ సమావేశంపై, నిరసనల సమయంలో పీఐతో సమన్వయం చేసుకున్నారా అనే అంశంపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# 12 లక్షల ఎకరాల్లో పంట నష్టం



**మెదక్, వెలుతురు అక్టోబరు 22 :** రోమ్ నగరం తగలబడిపోతుంటే ఫిడేల్ వాయించినట్టు ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కరువు పరిస్థితుల్లో ప్రజలను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైపోయాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు.గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఇది కాలం తెచ్చిన కరువు కాదని మేం గతంలో కూడా చాలాసార్లు చెప్పామన్నారు.. ..10 నెలల క్రితమే ఎల్‌నినో వస్తుందని కరువు పరిస్థితులు ఏర్పడుతాయని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వాలను హెచ్చరించారు. కానీ మన రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్రపోయి ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ దాదాపు 12 లక్షల ఎకరాల్లో పంట ఎండిపోతుంది.. పత్తి లాంటి పంట కనీసం దిగుబడి కాదు.. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు.పత్తి దిగుబడి బాగా తగ్గిపోయి ఎకరాకు 2-3 క్వింటాళ్లు కూడా రానట్వంటి పరిస్థితి ఉన్నది. పత్తి దిగుబడి బాగా తగ్గిపోయిందన్నారు హరీశ్ రావు.. 10-12 లక్షల ఎకరాల్లో పంటలు బాగా ఎండిపోతున్నాయి. ఇప్పటికే అనేక జిల్లాల్లో ప్రజలు తాగునీటికి, సాగునీటికి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. పక్క రాష్ట్రాలు ఇప్పటికే కరువు మండలాలు ప్రకటించాయి. ఈ దేశంలో కొన్ని రాష్ట్రాలు తక్షణ ఆర్థిక సాయాన్ని ప్రకటించి రైతాంగానికి అందిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాలు తాగునీటి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం జిల్లా కలెక్టర్లకు నిధులు విడుదల చేస్తున్నారు.. కానీ ఇంతవరకు మన తెలంగాణ ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటించలేదు.. తక్షణ ఆర్థిక సాయం ప్రకటించలేదు.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు.. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాల విషయంలో ఫెయిల్ అయిపోయారన్నారు. ఇయ్యాళ్ల కొందామంటే కరెంట్ లేదని రేవంత్ రెడ్డి బీద అరుపులు మాట్లాడుతున్నారని హరీశ్ రావు మండిపడ్డారు.

# డిప్యూటీ సీఎంవో పేరిట ఫేక్ వాట్సాప్ ఛానల్

**కఠిన చర్యలు ఉంటాయని పవన్ కార్యాలయం వార్నింగ్**




**విజయవాడ అక్టోబరు 22 :** ఏపీ డిప్యూటీ సీఎం ఆఫీస్ పేరిట ఒక ఫేక్ వాట్సాప్ ఛానల్ సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతుంది. దీనిపై డిప్యూటీ సీఎం కార్యాలయం స్పందించింది. "ఆవజూబీబిఎ అటూ, ఒనిటష్త్రతీజీ ఖతీజీటవబష్త్ర" పేరుతో నడుస్తోన్న అనధికారిక వాట్సాప్ ఛానల్‌తో ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ఈ నకిలీ ఛానల్ ద్వారా డిప్యూటీ సీఎం ఆఫీస్ పేరు, గుర్తింపును దుర్వినియోగం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా సంబంధం లేని అంశాలను ప్రచారం చేస్తున్నారని తెలిపింది. ఇటువంటి ఉద్దేశపూర్వక తప్పుడు ప్రచారాలు, అధికారిక హోదాను దుర్వినియోగం చేయడం ఏమాత్రం ఆమోదం కాదని హెచ్చరించింది.ఈ వ్యవహారంపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరినట్లు డిప్యూటీ సీఎం కార్యాలయం అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ కార్యాలయాల గుర్తింపును దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలను తప్పవని హెచ్చరించారు. బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం ఆఫీస్ పేరిట చలామణీ అవుతున్న ఫేక్ వాట్సాప్ ఛానల్‌ను ప్రజలెవ్వరూ నమ్మొద్దని, ఫాలో అవ్వవద్దని, అందులోని సమాచారాన్ని ఇతరులకు షేర్ చేయవద్దని అధికారులు సూచించారు. అధికారిక సమాచారం కోసం ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి చెందిన వెరిఫైడ్ సోషల్ మీడియా ఖాతాలను, అధికారిక ఛానల్‌ను మాత్రమే ఫాలో అవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# బీసీ కులగణన తప్పులు సరి చేస్తాం




**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 22 :** బీసీ కులగణనలో తమ వివరాలు నమోదు కాలేదని భావించే వారు ముందుకొస్తే లెక్కలను సరిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అవసరమైతే బీసీ జనాభా లెక్కలను సవరించి, జాబితాలోకి రాని వారిని చేర్చుతామని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకల్లో సీఎం పాల్గొని మాట్లాడారు. వందేళ్లలో ఎవరూ చేయని సాహసం తమ ప్రభుత్వం చేసిందని, ఏడాదిలోనే కులగణన పూర్తి చేసి తొలిసారిగా బీసీల జనాభా లెక్కలను తేల్చామని అన్నారు. ఏ కులం వారైనా తమ జనాభా తక్కువగా నమోదైందని భావి స్తే సంబంధిత వివరాలు అందించాలని సూచించారు. వచ్చే కేబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి లెక్కలను మరింత పక్కాగా చేస్తామని వెల్లడించారు.తనకు అవకాశం ఉంటే తన కుర్చీ చుట్టూ బలహీనవర్గాలను కూర్చోబెట్టుకోవాలన్నదే తన ఆలోచన అని రేవంత్ రెడ్డి అన్నారు. ముదిరాజ్‌లను ప్రస్తుతం బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్‌పైనా సీఎం స్పందించారు. ఈ అంశంపై ముదిరాజ్ నాయకులు న్యాయ నిపుణులను సంప్రదించి, ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. గంగపుత్రుల్లో ఉన్న అపోహలను కూడా తెలుసుకోవాలని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన పలువురికి పదవులు కల్పించామని, మిగిలిన నాయకులకు కూడా త్వరలో అవకాశాలు వస్తాయని హామీ ఇచ్చారు.తన పనితీరుపై మాట్లాడుతూ పరోక్షంగా గత సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. తనకు ఇంకా వయసు, ఓపిక ఉన్నాయని, తాను ఫామ్ హౌస్‌లో పడుకునే రకాన్ని కాదని వ్యాఖ్యానించారు.పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. పండుగ సాయన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దొడ్డి కొమురయ్య, పండుగ సాయన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్ సమీపంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. బలహీనవర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# అక్టోబర్ 27-30 మధ్య తీవ్ర తుఫాను హెచ్చరిక



**విజయవాడ, వెలుతురు అక్టోబరు 22 :** తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ముఖ్యమైన హెచ్చరిక జారీ చేసింది. బంగాళాఖాతంలో అక్టోబర్ 23న (శుక్రవారం) మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని, దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు వాతావరణ శాఖ సూచనలు జారీ చేసింది.థాయ్‌లాండ్ గల్ఫ్, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన ఆవర్తనానికి అనుబంధంగా ఈ వ్యవస్థ బలపడుతోంది. ఇది ఉత్తర అండమాన్ సముద్రం వైపు కదిలి, ఆ తర్వాత పశ్చిమ-వాయవ్య దిశగా ప్రయాణించనుంది. దీని గమనం, తీవ్రతను బట్టి రెండు రాష్ట్రాలపై వాతావరణ ప్రభావం ఆధారపడి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

**ఆంధ్రప్రదేశ్‌లో వర్ష హెచ్చరిక**

ఆంధ్రప్రదేశ్‌పై ఈ అల్పపీడన ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ అమరావతి కేంద్రం వెల్లడించింది. ముఖ్యంగా ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని, మత్స్యకారులు తదుపరి సూచనలు అందే వరకు వేటకు వెళ్లవద్దని సూచించింది.

**తెలంగాణలో తేలికపాటి జల్లులు**

ఇక తెలంగాణలోనూ పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం బలపడే కొద్దీ ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాల సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడటం వంటివి చేయరాదని, ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు కోత కోసిన పంటలను కాపాడుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ సమాచారాన్ని అనుసరించాలని అధికారులు కోరుతున్నారు.మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ అల్పపీడన పరిణామాలు రానున్న రోజుల్లో బలపడి తీవ్రమైన తుఫానుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయని భారత వాతావరణ శాఖ ప్రకటించింది. అక్టోబర్ 27 నుంచి 30వ తేదీల మధ్య ఈ తుఫాను తీవ్ర రూపం దాల్చి కోస్తాంధ్ర , ఒడిశా తీరాల వైపు దూసుకొచ్చే సూచనలు స్పష్టమవుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర కోస్తాంధ్రలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, ఉమ్మడి గోదావరి జిల్లాలతో పాటు ఒడిశా దక్షిణ తీరప్రాంతాలు ఈ తుఫాను తీవ్ర ప్రభావానికి గురయ్యే అవకాశం ఉండటంతో తీరప్రాంత యంత్రాంగాన్ని ముందస్తుగా అప్రమత్తం చేశారుఈ ముప్పు దృష్ట్యా అక్టోబర్ 27 నుంచి 30 మధ్య కోస్తాంధ్ర ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 60 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో, పీక్ సమయంలో అంతకంటే ఎక్కువ వేగంతో ఈదురు గాలులు వీచే వీలుంది. తీరప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టీమ్స్ సమాయత్తమవుతున్నాయి. వేటకు వెళ్లిన మత్స్యకారులను వెంటనే తీరానికి తిరిగి రావాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారుఈ తుఫాను ప్రభావం పొరుగున ఉన్న తెలంగాణపై ఎంతవరకు ఉంటుంది? అనే దానిపై వాతావరణ శాఖ స్పష్టతనిచ్చింది. తెలంగాణకు నేరుగా తుఫాను ముప్పు లేనప్పటికీ, తీరప్రాంతానికి సమీపంలో ఉండే ఉమ్మడి ఖమ్మం , నల్గొండ, సూర్యాపేట , మహబూబాబాద్ జిల్లాల్లో దీని ప్రభావం పడే అవకాశం ఉంది. అక్టోబర్ 27 రాత్రి నుంచి 30వ తేదీల మధ్య తెలంగాణలోని తూర్పు, దక్షిణ జిల్లాల్లో మోస్తరు నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముంది. అయితే హైదరాబాద్ సహా పశ్చిమ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో తుఫాను ప్రభావం సాపేక్షంగా తక్కువగానే ఉండనుంది. అక్కడ వాతావరణం పొడిగా ఉన్నప్పటికీ, ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడే వీలుంది. కానీ, తూర్పు తెలంగాణ జిల్లాల్లో హఠాత్తుగా వీచే ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షాల వల్ల చేతికొచ్చిన ఖరీఫ్ పంటలకు కొంతమేర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, ఆయా జిల్లాల రైతులు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.అక్టోబర్ చివరి వారంలో రానున్న ఈ తుఫాను తీవ్రత ప్రధానంగా కోస్తాంధ్ర-ఒడిశా తీరాలపైనే కేంద్రీకృతమై ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యంత్రాంగాన్ని హై అలర్ట్‌లో ఉంచగా, తెలంగాణ సైతం సరిహద్దు జిల్లాల్లో వాతావరణ మార్పులను నిశితంగా పరిశీలిస్తోంది. రాబోయే 48 గంటల్లో ఈ తుఫాను కచ్చితమైన గమనం , దాటే తీరంపై ఎఓఆ పూర్తి స్థాయి బులెటిన్లను విడుదల చేయనుంది.

# నకిలీ నంబర్ ప్లేట్.. లైసెన్స్ లేని డ్రైవర్



**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 22 :** మేడ్చల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరింగింది. బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని వరంగల్ హైవే పిల్లర్ నంబర్ 57 వద్ద ఉదయం సుమారు 6:30 గంటలకు ఓ ఫార్చ్యూనర్ కారు ముందు వెళ్తున్న ఓ వాహనాన్ని వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు వెళ్తున్న కారులో ప్రయాణిస్తున్న భార్యభర్తలకు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు వెంటనే వారిని హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన యువకుడిని అరెస్ట్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సివిల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సాయిశివ (30), తన భార్య మేఘన (28)తో కలిసి ూ08 ఇఖీ 7435 నంబరు గల ఐ10 కారులో ఎల్‌బీ నగర్ నుంచి వరంగల్ జిల్లా నర్సంపేట వైపు బయలుదేరారు. వీరి కారు పీర్జాదీగూడ హైవే పిల్లర్ నంబర్ 57 సమీపానికి చేరుకోగానే, వెనుక నుంచి అతివేగంగా వచ్చిన టయోటా ఫార్చ్యూనర్ కారు బలంగా ఢీకొట్టింది. ఈ ధాటికి ముందున్న ఐ10 కారు పల్టీ కొట్టింది. అనంతరం ఫార్చ్యూనర్ కారు ముందుకు వెళ్లి విద్యుత్ స్తంభాన్ని సైతం ఢీకొట్టి ఆగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సాయిశివ, మేఘన దంపతులను చికిత్స నిమిత్తం చైతన్యపురిలోని ఓజోన్ ఆసుపత్రికి తరలించారు.ఫార్చ్యూనర్ కారు నడిపిన వ్యక్తిని నారపల్లికి చెందిన మంగీలాల్ కుమారుడైన 19 ఏళ్ల అకున్ సబర్వాల్‌గా గుర్తించారు. సదరు వ్యక్తి మద్యం సేవించి ఉన్నట్లు అనుమానం వ్యక్తమైంది. అంతేకాకుండా, డ్రైవింగ్ లైసెన్స్ గురించి ఆరా తీయగా తన వద్ద లైసెన్స్ లేదని తెలిపినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన ఫార్చ్యూనర్ కారుకు అమర్చిన నంబర్ ప్లేట్ కూడా నకిలీదిగా పోలీసులు గుర్తించారు.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు భారతీయ న్యాయ సంహిత (ఃఔ) సెక్షన్లు 281, 125(జీ) తో పాటు మోటారు వాహనాల చట్టం (ఓఎ ఞఇబి) లోని సెక్షన్లు 181, 185(జీ), 183, 184, 185, 179(1), 179(2), 80(ం), 50, 51 కింద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు పోలీసులు. డ్రైవింగ్ లైసెన్స్ లేదని తెలిసి కూడా వాహనం నడపడానికి అనుమతించినందుకు వాహన యజమాని మంగీలాల్‌పై కూడా ఓఎ ఞఇబి సెక్షన్ 180 కింద కేసు నమోదు చేశారు.మద్యం తాగి వాహనాలు నడపడం, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, నకిలీ నంబర్ ప్లేట్లు వాడటం చట్టరీత్యా తీవ్రమైన నేరాలని పోలీసులు తెలిపారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇచ్చే యజమానులపై కూడా కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలను ఎల్లప్పుడూ కలిగి ఉండాలని సూచించారు

# మేడిగడ్డ బ్యారేజీ పనులను కూల్చేశారు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 22 :** మేడిగడ్డ బ్యారేజ్ కూల్చేశారని అధికారులకు ఫిర్యాదు చేసి మూడు సంవత్సరాలు గడిచింది. ఇంతవరకు ఆ కేసులో ఎలాంటి పురోగతి లేదని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. మొద్దు నిద్రలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మేల్కొలిపి, ఆ కేసు గురించి గుర్తుచేయాలనే ఈరోజు మీడియా సమావేశం ఏర్పాటు చేశామన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సీఈ సురేష్ నిజం చెప్పాడని అతన్ని సస్పెండ్ చేశారు. ఇప్పుడు ఐఏఎస్ అధికారుల కమిటీ వేశారు. సోషియాలజీ, హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చదువుకున్న వాళ్లకు ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్, బొగ్గు వినియోగం ఎలా అర్థమవుతాయి? అని ప్రశ్నించారు. ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు ఇంటికి పోలీసులను పంపించారు. విద్యుత్ సంస్థలను బాగు చేసిన ఇంజినీర్లపై కక్ష ఎందుకు? అని నిలదీశారు.కాగా, మేడిగడ్డ దగ్గర బాంబ్ పేలిన శబ్దం వచ్చింది. దీని మీద ఇన్వెస్టిగేషన్ చేయండని కాంగ్రెస్ మంత్రుల సమక్షంలో అప్పటి ఇంజినీర్ ఇన్ చీఫ్ మురళీధర్ రావు చెప్పిన విషయం తెలిసిందే. మరోవైపు బీఆర్ఎస్ నేతలు సైతం రాజకీయ కుట్ర కోణంలోనే మేడిగడ్డ దగ్గర బాంబులు పెట్టి పేల్చారని, దీంతోనే పిల్లర్‌లో పగుళ్లు వచ్చాయని చెప్పారు. ఫిర్యాదు చేసి ఇన్ని రోజులు అవుతున్నా మురళీధర్ రావు మాటలు విన్నాక, కావాలనే మేడిగడ్డ వద్ద బాంబులు పెట్టి పేల్చినట్లు బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలు నేడు మరింత బలపడుతున్నాయి.

# నాలుగు రోజుల్లోనే రూ.755 కోట్ల 14 లక్షల విలువైన మద్యం



**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 22 :** తెలంగాణ రాష్ట్రంలో దసరా పండుగ సందర్భంగా మద్యం అమ్మకాలు భారీగా నమోదయ్యాయి. పండుగకు ముందు నాలుగు రోజుల్లోనే మొత్తం రూ.755 కోట్ల 14 లక్షల విలువైన మద్యం విక్రయాలు జరిగాయని ఎక్సైజ్ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ లెక్కలు రాష్ట్రంలో మద్యం వినియోగం పెరుగుదలను, తద్వారా ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయాన్ని సూచిస్తున్నాయి. ముఖ్యంగా దసరా పండుగకు ముందురోజు, అక్టోబర్ 19న, మద్యం అమ్మకాలు అత్యధిక స్థాయికి చేరుకున్నాయి. ఆ ఒక్క రోజులోనే ఏకంగా రూ.303 కోట్ల 40 లక్షల విలువైన మద్యం అమ్ముడుపోయింది. పండుగకు ముందు ఈ అమ్మకాలు పెరగడం సాధారణంగా జరిగే పరిణామమే అయినప్పటికీ, ఈసారి నమోదైన సంఖ్యలు గత రికార్డులను అధిగమించాయి. అమ్మకాల వివరాలను పరిశీలిస్తే, అక్టోబర్ 14న రూ.102 కోట్ల 17 లక్షల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. అక్టోబర్ 15న మద్యం డిపోలకు సెలవు కావడంతో అమ్మకాలు నమోదు కాలేదు. తిరిగి అక్టోబర్ 16న రూ.126 కోట్ల 32 లక్షలు, అక్టోబర్ 17న రూ.223 కోట్ల 25 లక్షల విలువైన మద్యం అమ్ముడైంది. అక్టోబర్ 18న ఆదివారం సెలవు కావడంతో అమ్మకాలు తగ్గగా, అక్టోబర్ 19న అత్యధికంగా రూ.303 కోట్ల 40 లక్షల విక్రయాలు జరిగాయి. ఈ నాలుగు పనిదినాల్లో మొత్తం రూ.755 కోట్ల 14 లక్షల అమ్మకాలు నమోదయ్యాయి.విక్రయించిన మద్యం రకాలలో, ఈ నాలుగు రోజుల్లో 6,83,000 కేసుల హార్డ్ లిక్కర్ అమ్ముడైంది. బీరు విక్రయాలు మరింత ఎక్కువగా, 10,44,000 కేసులకు చేరుకున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో సాధారణంగానే బీరు వినియోగం అధికంగా ఉంటుందని ఈ గణాంకాలు మరోసారి ధృవీకరించాయి. అక్టోబర్ 19 వరకు మొత్తం అక్టోబర్ నెలలో రూ.2,055 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. గత నెలలతో పోలిస్తే, సెప్టెంబర్ నెలలో రూ.3,209 కోట్లు, ఆగస్టు నెలలో రూ.3,482 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. దసరా పండుగ కారణంగా అక్టోబర్ నెలలో కూడా అమ్మకాలు భారీగానే నమోదయ్యే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత దసరా పండుగతో పోలిస్తే ఈసారి అమ్మకాలు పెరిగాయి. గత దసరా సమయంలో నాలుగు రోజుల్లో రూ.698 కోట్ల విలువైన మద్యం అమ్ముడవగా, ఈసారి రూ.755 కోట్ల 14 లక్షలకు చేరుకోవడం గణనీయమైన వృద్ధిని సూచిస్తుంది.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 2,620 వైన్ షాపులు, సుమారు 1,200 బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్బులు, క్లబ్బుల ద్వారా ఈ మద్యం విక్రయాలు జరుగుతాయి. ఈ మద్యం మొత్తం తెలంగాణలో ఉన్న 17 మద్యం డిపోల నుంచి సరఫరా అవుతుంది. ఎక్సైజ్ శాఖ ద్వారా లభించే ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన వనరులలో ఒకటి. సంక్షేమ కార్యక్రమాలకు, ఇతర ప్రభుత్వ ప్రయోజిత పథకాలకు నిధులు సమకూర్చడంలో మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం కీలక పాత్ర పోషిస్తుంది. రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ తర్వాత అత్యధిక ఆదాయాన్ని సమకూర్చే శాఖగా ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ నిలుస్తుంది. ఈ కారణంగానే ప్రభుత్వాలు మద్యం అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటాయి. ఈ పండుగ సీజన్ అమ్మకాలు ప్రభుత్వానికి ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని సమకూర్చినట్లు తెలుస్తోంది.

## 18 లక్షల దర్శనాలు.. 36 లక్షల లడ్డూలు

**విజయవాడ, వెలుతురు అక్టోబరు 22:**



విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయ్. దసరా మహోత్సవాల సందర్భంగా శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం భారీగా భక్తులు తరలివచ్చారు. లడ్డూ ప్రసాదం విక్రయాల్లో సరికొత్త రికార్డును నమోదు చేశాయి. దుర్గమ్మ దర్శనార్థం వచ్చిన లక్షల మంది భక్తులకు ఎటువంటి కొరత రాకుండా దేవాదాయ శాఖ కమిషనర్ పర్యవేక్షణతో దేవస్థానం పకడ్బం దీ ప్రణాళికతో లడ్డూ ప్రసాదాన్ని అందుబాటులో ఉంచింది. ఉత్సవాలు ప్రారంభమైన అక్టోబర్ 11 నుంచి అక్టోబర్ 21 దసరా మరుసటి రోజువరకూ భక్తుల రద్దీ ఇలా ఉందిశరన్నవరాత్రి ఉత్సవా ల్లో భాగంగా 10 రోజులలో మొత్తం 15,05, 359 మంది భక్తులు అమ్మవారిని దర్శించు కోగా.. అక్టోబర్ 21 రాత్రి 7 గంటల సమయా నికి సుమారు 1,55,000 మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. దీంతో ఇప్పటివరకు మొత్తం 11 రోజుల్లో కనకదుర్గమ్మను దర్శించు కున్న భక్తుల సంఖ్య 18,60,359 కి చేరింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లలో పటిష్టమైన ఏర్పాట్లు, మంచినీరు, ప్రసాదం పంపిణీ నిరంతరాయంగా కొనసాగు తున్నాయి. భక్తులు దేవస్థాన నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా దర్శనాలు పూర్తి చేసుకుం టున్నారు. ఈ ఏడాది దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో లడ్డూ ప్రసాదం విక్రయాల్లో సరికొత్త రికార్డు... 10 రోజుల్లో రికార్డు స్థాయిలో 30,69,048 లడ్డూల విక్రయం జరిగింది. ఈ సంఖ్య గతేడాది కన్నా 7.49 లక్షలు అధికం. ఇక 12వ రోజైన సాయంత్రం 6:00 గంటల వరకు 5,08,676 లడ్డూలు విక్రయం జరిగింది. ఇప్పటివరకూ విక్రయించిన లడ్డూల సంఖ్య 35,77,724. భక్తుల రద్దీకి అనుగుణంగా ఎలాంటి కొరత లేకుండా నిరంతరాయంగా లడ్డూ ప్రసాదం అందిస్తున్నారు దేవస్థానం అధికారులు.

# సౌదీ ఎయిర్‌పోర్ట్‌పై హౌతీల దాడి

- భారతీయుడి సహా ఇద్దరి మృతి
- యెమెన్‌లో కాల్పుల విరమణ ఒప్పందం విఫలమవడంతో పెరిగిన దాడులు
- సౌదీ చమురు, పౌర సదుపాయాలపై దాడులు తీవ్రతరం చేసిన హౌతీలు
- ఎర్ర సముద్రంలో ఆయిల్ షిప్‌మెంట్లను కూడా అడ్డుకుంటున్న తిరుగుబాటుదారులు





**రియాద్, వెలుతురు అక్టోబర్ 22 :**

సౌదీ అరేబియాపై యెమెన్‌కు చెందిన హౌతీ తిరుగుబాటుదారులు దాడులను మరింత తీవ్రతరం చేశారు. బుధవారం రాత్రి దమ్మామ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిలో ఇద్దరు వ్యక్తులు మరణించగా, మరో ఎనిమి ది మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని సౌదీ సివిల్ ఏవియేషన్ అథారిటీ నేడు ఒక ప్రకటనలో అధికారి కంగా ధ్రువీకరించింది. మృతుల్లో ఒకరు సౌదీ పౌరు డు కాగా, మరొకరు భారతీయుడని అధికారులు తెలిపారు. దాడి కారణంగా విమానాశ్రయానికి జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

గత కొన్ని వారాలుగా సౌదీ అరేబియాలోని చమురు క్షేత్రాలు, పౌర మౌలిక సదుపాయాలపై హౌతీల దాడులు తీవ్ర స్థాయిలో పెరిగాయి. ఈ దాడుల కారణంగా రియాద్‌లోని ప్రధాన విమానాశ్ర యాన్ని మూసివేయడంతో పాటు సౌదీ ప్రభుత్వం ఓ కీలక పెట్టుబడుల సదస్సును కూడా వాయిదా వేసు కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం ఈ నెలలోనే సౌదీ విమానాశ్రయాలపై జరిగిన వివిధ దాడుల్లో ఇప్పటివరకు మొత్తం 22 మంది మరణించినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

మరోవైపు ఎర్ర సముద్రంలో హౌతీలు మారిటైమ్ దిగ్బంధనం విధించడం కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు ఎగుమతిదారు అయిన సౌదీ అరేబియా నుంచి వెళ్లే ఆయిల్ షిప్‌మెంట్లకు ఇది పెద్ద ముప్పుగా మారింది. యెమెన్‌లో సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు, ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఏళ్లుగా అంతర్యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం గత జులైలో విఫలమైంది. అప్పటి నుంచి హౌతీలు దాడులను తీవ్రతరం చేశారు. ఒప్పందం ముగిసిన తర్వాత సౌదీ నౌకలు, భూభాగాలు, చమురు క్షేత్రాలే లక్ష్యంగా దాడులు ప్రారంభించిన హౌతీలు, సెప్టెంబర్‌లో భారీ దాడికి దిగి ఎర్ర సముద్ర తీరంలోని పలు ప్రభుత్వ ఆధీన ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి ప్రతిగా హౌతీల నియంత్రణలో ఉన్న యెమెన్‌లోని పలు ప్రాంతాలపై సౌదీ వైమానిక దళం తరచూ వైమానిక దాడులు జరుపుతోంది. ఈ పరస్పర దాడులతో యెమెన్ సంక్షోభం మరింత తీవ్రమవుతోంది.

## ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య హక్కులపై దాడులు జరుగుతుంటే

# టీబీజేపీ నాయకుల మౌనం ఎందుకు?



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 22:**

### ఎన్నికల సంఘం ఇప్పటికైనా కళ్లు తెరవాలి

**నామినేషన్ హక్కులను అడ్డుకునే చర్యలపై తక్షణ విచారణ జరపాలి**

**టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్ కుమార్**

తెలంగాణ బీజేపీ నాయకులారా.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు వస్తుంటే మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? మీ రాజకీయ మిత్రపక్షంగా ఉన్న కూటమి ప్రభుత్వంపై ఇన్ని ప్రశ్నలు తలెత్తుతున్నా స్పందించకపోవడానికి కారణమేంటి? ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ హక్కులు రాష్ట్ర సరిహద్దులను బట్టి మారిపోతాయా? తెలంగాణలో ఒక మాట, ఆంధ్రప్రదేశ్‌లో మరో మాట మాట్లాడటమేనా మీ రాజకీయ నీతి?

ఆంధ్రప్రదేశ్‌లో అధికార దుర్వినియోగం, ప్రతిపక్షాలపై దాడులు, నామినేషన్ల ప్రక్రియకు ఆటంకాలు కలిగిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా పరిశీలించాల్సిన అంశాలు. ఎన్నికల్లో ప్రత్యర్థులను ప్రజల మద్దతుతో ఓడించాలి తప్ప, వారు పోటీలో నిలబడకుండా అడ్డుకోవడం ద్వారా రాజకీయ ప్రయోజనం పొందాలని ప్రయత్నిస్తే అది ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఈ ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది.

బీజేపీ నాయకులు దక్షిణ, రామచంద్రరావు.. మీ మిత్రపక్ష ప్రభుత్వానికి మీరు మద్దతు ఇస్తున్నప్పుడు, అక్కడి ప్రజల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ విషయంలోనూ అదే బాధ్యతతో మాట్లాడాలి కదా? ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షాలకు నామినేషన్లు దాఖలు చేసే స్వేచ్ఛ ఉందా లేదా? అభ్యర్థులు ఎలాంటి బెదిరింపులు లేకుండా ఎన్నికల్లో పోటీ చేయగలుగుతున్నారా? ఈ ప్రశ్నలకు మీరు స్పష్టమైన సమాధానం చెప్పాలి.

రాజకీయ మైత్రి పేరుతో ప్రజాస్వామ్య హక్కుల విషయంలో మౌనం వహించడం సరైన వైఖరి కాదు. మీ మిత్రపక్ష ప్రభుత్వానికి నిజంగా ప్రజాస్వామ్యంపై గౌరవం ఉంటే, ప్రతిపక్షాల ఆరోపణలపై విచారణకు సహకరించాలని, అభ్యర్థుల నామినేషన్ హక్కులను కాపాడాలని మీరు బహిరంగంగా కోరాలి. రాజకీయ సంబంధాలు ప్రజల హక్కుల కంటే గొప్పవి కావు.

**ఎన్నికల సంఘం కళ్లు తెరవాలి - ఇంతకంటే ఏం నిదర్శనం కావాలి?**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్ హక్కులకు ఆటంకాలు ఎదురవుతున్నాయనే ఆరోపణలు, రాజకీయ దాడులపై వస్తున్న ఫిర్యాదులు ఎన్నికల సంఘం తక్షణ దృష్టికి వెళ్లాల్సిన తీవ్రమైన అంశాలు. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన ఎన్నికల సంఘమే స్పందించడం లేదనే భావన ప్రజల్లో ఏర్పడితే, ప్రజాస్వామ్య సంస్థల విశ్వసనీయతకు తీవ్ర నష్టం కలుగుతుంది.

ఎన్నికల సంఘం కళ్లకు గంతలు కట్టుకుని కూర్చున్నట్లుగా వ్యవహరించకూడదు. అక్కడ జరుగుతున్న పరిణామాలను ఇప్పటికైనా కళ్లుతెరిచి చూడాలి. అభ్యర్థులు స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునే హక్కుకు భంగం కలుగుతోందని ఫిర్యాదులు వస్తున్నప్పుడు, వాటిని పరిశీలించకుండా మౌనంగా ఉండటం ఎంతవరకు సమంజసం? ఎన్నికల సంఘం నిర్వీర్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలకు తావివ్వకుండా, తన రాజ్యాంగబద్ధమైన బాధ్యతను తక్షణమే నిర్వర్తించాలి.

నామినేషన్లకు ఆటంకాలు ఎదుర్కొన్న అభ్యర్థుల ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, ప్రతి ఘటనపై నిష్పక్షపాత దర్యాప్తు జరపాలి. అవసరమైన ఆధారాలను సేకరించి, బాధితులకు రక్షణ కల్పించాలి. అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. ఎన్నికలు స్వేచ్ఛగా,నిష్పక్షపాతంగా జరిగేలా తగిన చర్యలు చేపట్టాలి.

ఎన్నికల సంఘానికి నా విజ్ఞప్తి ఒక్కటే - ఇప్పటికైనా కళ్లు తెరవండి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలుగుతోందనే ఆరోపణలను తీవ్రంగా పరిగణించి, తక్షణమే జోక్యం చేసుకోండి. ప్రజల ఓటు హక్కును, అభ్యర్థుల పోటీ చేసే హక్కును కాపాడండి. మీ నిష్పక్షపాత చర్యల ద్వారా ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించండి.

ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం మాత్రమే కాదు, అది ఎక్కడ ప్రమాదంలో పడినా స్పందించడం ముఖ్యం. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న అన్యాయాలపై తెలంగాణ బీజేపీ నాయకులు తమ వైఖరిని స్పష్టం చేయాలి. మీ మిత్రపక్ష ప్రభుత్వాన్ని ప్రశ్నించండి. ప్రజాస్వామ్య పరిరక్షణ విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు తావివ్వకండి.

## విద్యుత్ కొరత రాకుండా

# పటిష్ట చర్యలు

**(మొదటిపేజీ తరువాయి)**

తెలిపారు. ఈ నేపథ్యంలో ఉత్పత్తిని మరింత పెంచి రోజువారీ 140 మిలియన్ యూనిట్ల లక్ష్యాన్ని సాధించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

**యాదాద్రి ప్లాంట్‌పై ప్రత్యేక దృష్టి**

విద్యుత్ ఉత్పత్తి పెంపులో భాగంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంపై ప్రత్యేక దృష్టి సారించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ కేంద్రంలోని 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగు యూనిట్లు ఇప్పటికే విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయని, ఐదో యూనిట్‌ను ఈ నెల 20న గ్రిడ్‌కు అనుసంధానించినట్లు అధికారులు వివరించారు. మిగిలిన సాంకేతిక, నిర్వహణపరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ఐదో యూనిట్‌ను పూర్తిస్థాయి వాణిజ్య కార్యకలాపాల్లోకి తీసుకురావాలని సూచించారు.

యాదాద్రి ప్లాంట్‌లోని రెండు యూనిట్లకు బొగ్గు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా కోల్ ఇండియా లిమిటెడ్ నుంచి ప్రత్యామ్నాయ సరఫరా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ మార్గం ద్వారా నవంబర్ నుంచి బొగ్గు సరఫరా ప్రారంభమవుతుందని వెల్లడించారు.

టీజీజెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాల రోజువారీ సగటు ఉత్పత్తి 2024-25లో 65.90 మిలియన్ యూనిట్లుగా, 2025-26లో 76.46 మిలియన్ యూనిట్లుగా నమోదైందని అధికారులు వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్ 21 నాటికి ఈ ఉత్పత్తి 90.97 మిలియన్ యూనిట్లకు చేరిందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రోజుకు 14.51 మిలియన్ యూనిట్లు, సుమారు 19 శాతం పెరుగుదల నమోదైందన్నారు.

థర్మల్ విద్యుత్ కేంద్రాల్లోని అన్ని యూనిట్లు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని, ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్‌ను పెంచాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. ఉత్పత్తిని ప్రతిరోజూ సమీక్షిస్తూ లక్ష్య సాధన దిశగా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

**మూతపడిన పరిశ్రమలకు బకాయిల చెల్లింపుల్లో వెసులుబాటు**

రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిల పరిష్కారానికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానాన్ని పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. అర్హత కలిగిన పరిశ్రమల యాజమాన్యాలకు బకాయిల చెల్లింపుల్లో వెసులుబాటు కల్పించేలా సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని TGSPDCL, TGNPDCL సీఎండీలకు సూచించారు.

మూతపడిన పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకుని, బకాయిల పరిష్కారానికి అందుబాటులో ఉన్న అవకాశాలు, నిబంధనలపై అవగాహన కల్పించాలని తెలిపారు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ విధానం ద్వారా అర్హులైన పరిశ్రమలకు ఊరట లభించడంతో పాటు, విద్యుత్ పంపిణీ సంస్థలకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్లకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

అలాగే సింగరేణి, జెన్‌కో, ట్రాన్స్‌కో తదితర సంస్థలకు వివిధ విభాగాల నుంచి రావాల్సిన బకాయిల వసూళ్లకు చర్యలు చేపట్టాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

**విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఏర్పాట్లు**

రానున్న రోజుల్లో విద్యుత్ డిమాండ్ ఎంత పెరిగినా అందుకు అనుగుణంగా ఉత్పత్తి, ప్రసారం, పంపిణీ వ్యవస్థలను సిద్ధం చేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రకాష్ జ్యోతి, జెన్‌కో సీఎండీ హరీశ్, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్, ఆర్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్, సింగరేణి డైరెక్టర్ గౌతం పోట్రు తదితరులు పాల్గొన్నారు.

# సిక్కోలులో టీడీపీ అభ్యర్థే.. వైసీపీ మేయర్

**శ్రీకాకుళం, వెలుతురు అక్టోబరు 22:**

శ్రీకాకుళం టీడీపీ నేత గుండా లక్ష్మి దేవి పార్టీకి రాజీనామా చేశారు. మాజీ ఎమ్మెల్యే అయిన ఆమెకు గత ఎన్నికల్లో టిక్కెట్ నిరాకరించారు. కూటమి ప్రభుత్వంలో తను ఆశించిన ప్రాధాన్యత దక్కకపోవడం, పొత్తులో భాగంగా మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించడంతో అసంతృప్తికి గురయ్యారు. అదే సమయంలో వైసీపీ నుంచి ఆమెకు మేయర్ ఆఫర్ వచ్చింది. మేయర్ టిక్కెట్ ఇస్తామని ఆశపెట్టడంతో పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. సుమారు 40 ఏళ్ల పాటు ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు నాయకత్వం వరకు టీడీపీ అభివృద్ధి కోసం తన కుటుంబం అంకితమై పనిచేసిందని, అలాంటి పార్టీని ఇప్పుడు వీడాల్సి రావడం ఎంతో బాధగా ఉందని గుండ లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త, దివంగత మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అడుగుజాడల్లో నడుస్తూ శ్రీకాకుళంలో పార్టీని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన తనకు, కీలకమైన సమయంలో తగిన గుర్తింపు లభించలేదని ఆమె వాపోయారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడిన తమను కాదంటూ స్థానికంగా కొందరు వ్యూహాత్మకంగా అణగదొక్కాలని చూశారని, ఈ అవమానాల భారాన్ని మోయలేకే పార్టీ వీడేందుకు సిద్ధమయ్యామని ఆమె తన సన్నిహితులు, అనుచరుల వద్ద ఆవేదన వెళ్లగక్కినట్లు తెలుస్తోంది. శ్రీకాకుళం మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు రంగంలోకి దిగి గుండ లక్ష్మీదేవిని పార్టీలోకి ఆహ్వానించడంతో పాటు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా ఆమెను బరిలో దింపేందుకు రంగం సిద్ధం చేశారు. నగరంలో గుండ కుటుంబానికి ఉన్న బలమైన పట్టును, సామాజికవర్గ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల ఖర్చంతా పార్టీయే భరిస్తుందని హామీ ఇవ్వడంతో.. గుండ లక్ష్మీదేవి వైసీపీ కండువా కప్పుకోవడానికి ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. త్వరలోనే ఆమె తన అనుచరులతో విస్తృత సమావేశం నిర్వహించి అధికారికంగా ఫ్యాన్ పార్టీ గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది.




**విజయనగరంలో దెబ్బకు సిక్కోలులో రీవెంజ్**

స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట ఉత్తరాంధ్ర రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనును తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి టీడీపీ షాకిచ్చింది. మజ్జి శ్రీను పార్టీ మారడం విజయనగరం జిల్లాలో వైసీపీకి గట్టి షాక్ అని చెప్పొచ్చు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో ఆయనకు అనుచరగణం ఉంది. మజ్జి శ్రీనుతోపాటు ద్వితీయ శ్రేణి నాయకులు కూడా టీడీపీలోకి వెళ్లారు. 2019 ఎన్నికల్లో విజయనగరం జిల్లాలో జగన్ పార్టీ క్లీన్‌స్వీప్ చేయడంలో ఈయన కీలక పాత్ర పోషించారు. పార్టీలో చేరగానే ఆయనకు అరకు లోక్ సభ టీడీపీ అబ్జర్వర్‌గా బాధ్యతలు అప్పగించారు. మజ్జి శ్రీనును చేర్చుకోవడం ద్వారా విజయనగరం జిల్లాలో వైసీపీని టీడీపీ దెబ్బకొడితే.. గుండ ఫ్యామిలీని తమవైపు తిప్పుకోవడం ద్వారా తెలుగుదేశం పార్టీకి శ్రీకాకుళంలో రివర్స్ షాక్ ఇవ్వడానికి వైసీపీ రెడీ అవుతోంది. శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి టీడీపీకి రాజీనామా చేసి.. వైసీపీలో చేరబోతున్నారు. తెలుగు దేశం పార్టీతో గుండ ఫ్యామిలీకి 40 ఏళ్ల అనుబంధం ఉంది. 1982లో ఎన్టీఆర్ ఆహ్వానం మేరకు ఆమె భర్త గుండ అప్పల సూర్యనారాయణ టీడీపీలో చేరారు. అప్పల సూర్యనారాయణ వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన మంత్రిగానూ పని చేశారు. 1985, 1989, 1994, 1999ల్లో ఆయన శ్రీకాకుళం ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2004, 2009 ఎన్నికల్లో ధర్మాన ప్రసాద రావు చేతిలో ఆయన ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో అప్పల సూర్యనారాయణ సతీమణి లక్ష్మీదేవి ఎమ్మెల్యేగా గెలిచారు. 2019 ఎన్నికల్లో ఆమె ఓటమిపాలవగా.. 2024 ఎన్నికల్లో ఆమెకు టికెట్ కేటాయించలేదు. అప్పల సూర్యనారాయణ అనుచరుడిగా వ్యవహరించిన గొండు శంకర్‌కు టీడీపీ టికెట్ దక్కగా, ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు. 2026 జనవరి 12న అప్పల సూర్యనారాయణ కన్నుమూశారు. శ్రీకాకుళంలో రెండు చోట్ల ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తామని తన కుమారులు చంద్రబాబు నాయుణ్ని కలిసి కోరారని.. పార్టీ అధినేత అంగీకరించినా, విగ్రహం ఏర్పాటు చేయనీయలేదని లక్ష్మీదేవి వాపోయారు. 40 ఏళ్లుగా పార్టీలో ఉంటున్న తమను అవమానాలకు గురి చేస్తున్నారని, తట్టుకోలేకే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని ఆమె ప్రకటించారు. గుండ లక్ష్మీదేవి తన అనుచరులతో కలిసి వైఎస్సార్సీపీలో చేరబోతున్నారని ధర్మాన ప్రసాద రావు ఇప్పటికే బహిరంగంగా ప్రకటించారు. 50 వేల మంది అనుచరులతో ఆమె వైసీపీలోకి రాబోతున్నారన్నారు. గుండ లక్ష్మీదేవి ధర్మాన బ్రదర్స్‌కు వరుసకు సోదరి అవుతారు. టీడీపీలో గుండ ఫ్యామిలీ అసంతృప్తితో ఉన్న విషయాన్ని గమనించిన ధర్మాన ఆమెను వైసీపీలోకి ఆహ్వానించారని తెలుస్తోంది. గుండ లక్ష్మీదేవి వైసీపీలో చేరితే ఆమెకు మేయర్ టికెట్ ఇస్తామని.. ఖర్చు మొత్తం తామే భరిస్తామని ధర్మాన హామీ ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. కోర్టు కేసు కారణంగా శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికలు ఇప్పుడు జరగడం లేదు. అంతేకాదు 2029 ఎన్నికల్లో ఆమె చిన్నకుమారుడు గుండ విశ్వనాథ్‌కు శ్రీకాకుళం ఎంపీ టికెట్ కూడా ఇచ్చే అవకాశం ఉందని సమాచారం.

శ్రీకాకుళం మేయర్ రేసులో వైసీపీ తరపున గుండ లక్ష్మీదేవి నిలబడితే.. కూటమి అభ్యర్థికి గట్టిపోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. శ్రీకాకుళంలో గుండ ఫ్యామిలీకి మంచి పట్టు ఉంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సీట్ల పంపకాల్లో భాగంగా శ్రీకాకుళం మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించారు. టీడీపీ ఓటు బ్యాంక్ పూర్తిగా జనసేనకు బదిలీ అవుతుందా అనేది ఒక ప్రశ్న. అలాగే గుండ లక్ష్మీదేవి వెంట ఆమె అనుచరగణం కూడా పార్టీ మారితే.. టీడీపీ ఓటు బ్యాంకుకు కూడా గండిపడుతుంది.

ఈ రెండూ జనసేన అభ్యర్థికి పడే ఓట్లను ప్రభావితం చేసే అవకాశం ఉంది. అంటే విజయనగరంలో వైసీపీకి టీడీపీ షాకిస్తే.. జగన్ పార్టీ దానికి శ్రీకాకుళం బదులు తీర్చుకోనుందన్న మాట. ఈ రెండు పార్టీల వ్యూహాలు, ప్రతివ్యూహాలతో ఉత్తరాంధ్ర రాజకీయం రసవత్తరంగా మారుతోంది. అయితే ఈ పరిణామాలు శ్రీకాకుళం మేయర్‌గా పోటీ చేయనున్న జనసేనను టెన్షన్ పెట్టే అవకాశం ఉంది.

## సాయివర్షితకు ఏకంగా ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు



**కడప, అక్టోబరు 22, (న్యూస్ పల్స్**

ఒక్క ఉద్యోగం సాధించడానికే కష్టపడుతున్న ఈ రోజుల్లో.. ఆ యువతి వరుసగా ఆరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. తొలి ప్రయత్నం సక్సెస్ కాకపోయినా మళ్లీ కష్టపడి చదివి అనుకున్నది సాధించారు కడప జిల్లా పులివెందులకు చెందిన చిదిగే సాయి వర్షిత అనిలాదేవి, గురుదత్త దంపతుల రెండో కుమార్తె చిదిగే సాయి వర్షిత పులివెందులలో టెన్త్ వరకు చదివారు.. అనంతరం ఇంటర్మీడియట్ హైదరాబాద్ ఎన్టీఆర్ జూనియర్ కాలేజీలో పూర్తి చేశారు. అనంతరం విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య సెంట్రల్ లా యూనిర్శిటీలో చదివారు.. ఆమె న్యాయశాస్త్రంలో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించారు.సాయి వర్షిత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యారు.. 2024లో మొదటిసారి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ పరీక్ష రాశారు. కానీ ప్రిలిమ్స్‌కు ఎంపికైనా మెయిన్స్‌లో సెలక్ట్ కాలేదు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని మళ్లీ కష్టపడి చదివారు. ఆ వెంటనే సాయి వర్షితకు కేంద్ర న్యాయశాఖలో వరుసగా ఉద్యోగాలు వచ్చాయి. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్, జూనియర్ కోఆపరేటివ్ ఆఫీసర్, జూనియర్ అకౌంటెంట్, టెక్నికల్ క్లర్క్ పోస్టులు దక్కాయి. సాయి వర్షిత అక్కడితో ఆగలేదు.. కేంద్రం ప్రభుత్వంలో ఇంకా మంచి ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివారు. సాయి వర్షిత ఎస్ఎస్‌సీ సీజీఎల్ పరీక్షకు ప్రిపేర్ అయ్యారు.. ఈ పోస్టులు మొత్తం 412 ఉంటే.. దేశవ్యాప్తంగా ఏకంగా 28లక్షల15వేల445 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 13.77 లక్షల మంది పరీక్ష రాగాయ.. సాయి వర్షితకు ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌లో రీసెర్చ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించారు. ఆమె ఈ నెల 19న బెంగళూరులో కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే నుంచి నియామక పత్రం అందుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అయ్యేవారు ముందుగా ఓ టార్గెట్ పెట్టుకోవాలంటున్నారు సాయి వర్షిత. అన్ని అంశాలను పరిశీలించి.. సబ్జెక్టువారీగా చదవాలని సూచిస్తున్నారు. ఒక ప్రణాళిక ప్రకారం చదివితే ఉద్యోగం సాధించొచ్చంటున్నారు. ఒకవేళ ఏదైనా వైఫల్యం ఎదురైతే సమీక్షించుకుని ముందుకు సాగాలంటున్నారు.





# ముదిరాజ్‌ల రాజకీయ, సామాజిక ఆత్మగౌరవానికి పెద్దపీట

- పండుగ సాయన్నకు కాంగ్రెస్ ప్రభుత్వమే సముచిత గౌరవం కల్పిస్తోంది
- బీసీ-ఏలోకి మార్పునకు సిద్ధం : మంత్రి వాకిటి
- పాలమూరు యూనివర్సిటీకి, ఉమ్మడి పాలమూరు జిల్లాకు పండుగ సాయన్న పేరు పెట్టాలని సీఎంకు విజ్ఞప్తి

**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 22 :**

మహనీయుల చరిత్రను గౌరవించడం, అణగారిన వర్గాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం, సామాజిక న్యాయాన్ని ఆచరణలో చూపించడం కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పండుగ సాయన్న 174వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ... పండుగ సాయన్న ఆశయాలకు అనుగుణంగా ముదిరాజ్‌ల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు.

పండుగ సాయన్న వంటి మహనీయుల చరిత్రను గుర్తించి, వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం ద్వారా సమాజానికి వారి సేవలను పరిచయం చేస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం పండుగ సాయన్న జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే పండుగ సాయన్న జయంతి వేడుకలను నిర్వహిస్తూ ఆయనకు తగిన గుర్తింపు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

**ముదిరాజ్‌ల హక్కుల విషయంలో వెనకడుగు వేయం**

రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధించాలంటే ప్రతి కులం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వారి జనాభా, సామాజిక, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా న్యాయం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కులగణన చేపట్టిందని తెలిపారు. అన్ని వర్గాలకు న్యాయమైన వాటా, సమాన అవకాశాలు కల్పించాలన్నదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు.

ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే అంశంపై తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, ధైర్యం ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ముదిరాజ్‌లకు న్యాయం చేయాలనే ఆకాంక్షతో పాటు, బీసీ-ఏలో ఇప్పటికే ఉన్న మత్స్యకారులకు ఎలాంటి నష్టం, ఇబ్బంది కలగకుండా పరిష్కారం చూపాల్సిన బాధ్యత కూడా మాపై ఉందన్నారు. ఒక వర్గానికి న్యాయం చేస్తూ మరో వర్గానికి అన్యాయం జరగకుండా, అందరి ప్రయోజనాలను పరిరక్షించే విధంగా తగిన అవకాశాలు కల్పించాలని తెలిపారు.

పండుగ సాయన్న పేరు కేవలం ఒక వ్యక్తి పేరు మాత్రమే కాదని, అది పోరాట స్ఫూర్తికి, ఆత్మగౌరవానికి, సామాజిక చైతన్యానికి ప్రతీక అని మంత్రి అభిప్రాయపడ్డారు. చరిత్రలో సముచిత స్థానం దక్కాల్సిన మహనీయుల పేర్లను విద్యాసంస్థలు, ప్రాంతాలకు పెట్టడం ద్వారా వారి త్యాగాలు, పోరాటాలను భవిష్యత్ తరాలకు అందించవచ్చన్నారు.

ఈ నేపథ్యంలో పాలమూరు యూనివర్సిటీకి పండుగ సాయన్న పేరు పెట్టాలని, ఉమ్మడి పాలమూరు జిల్లాకు కూడా ఆయన పేరు పెట్టాలని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. పండుగ సాయన్నకు తగిన గౌరవం కల్పించడం ద్వారా ముదిరాజ్‌ల సామాజిక ఆత్మగౌరవానికి మరింత గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు.

పండుగ సాయన్న చరిత్రను స్మరించుకోవడం ఒక వేడుకకే పరిమితం కాకూడదని, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. మహనీయులను గుర్తించడం, వెనుకబడిన వర్గాలకు సామాజిక న్యాయం కల్పించడం, వారి హక్కులకు భరోసా ఇవ్వడం కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతగా భావిస్తోందని తెలిపారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతి, బీసీలకు న్యాయమైన వాటా, మహనీయులకు సముచిత గౌరవం అనే అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో ముందుకు సాగుతోందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. పండుగ సాయన్నకు తగిన గుర్తింపు కల్పించడంతో పాటు, ఆయన పేరు పాలమూరు ప్రజల గుండెల్లోనే కాకుండా విద్యాసంస్థలు, ప్రాంతాల ద్వారా కూడా చిరస్థాయిగా నిలిచేలా చర్యలు తీసుకోవాలన్నదే తమ ఆకాంక్షని మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు.



# అలయ్ బలయ్ తెలంగాణ ఆత్మ, జీవన విలువల ప్రతీక

## స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 22 :**

అలయ్ బలయ్ ఒక సాంప్రదాయ సమావేశం కాదని, ఇదొక తెలంగాణ ఆత్మ, జీవన విలువల ప్రతీక అని తెలంగాణ శాసన సభాపతి, వికారాబాద్ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. దసరా పండుగ అయిపోయిన తర్వాత అందరూ మళ్ళీ ఒకసారి కలుసుకోవడానికి, ఆప్యాయతను పంచుకోవడానికి ఏర్పాటు చేసిన గొప్ప వేదిక అలయ్ బలయ్ అని చెప్పారు. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదని, తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని పేర్కొన్నారు.

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో గురువారం రోజు అలయ్ బలయ్ కార్యక్రమానికి హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో ఆయన కుమార్తె విజయలక్ష్మి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దత్తాత్రేయ అజాత శత్రువు అని, ఆయనకు పార్టీలకు అతీతంగా స్నేహాభిలాషులు, మిత్రులు ఉన్నారని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చెప్పారు. దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మీ ఈ బాధ్యతను ఎంతో చక్కగా నిర్వహిస్తున్నారని తెలిపారు.



## ఇంద్రకీలాద్రి క్షేత్రానికి కొనసాగుతున్న భక్తుల రద్దీ



**విజయవాడ, వెలుతురు, అక్టోబర్ 22 :**

దసరా ఉత్సవాలు ముగిసిన తర్వాతకుడా ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. తెలంగాణ తో పాటు ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన భవాని భక్తులు భవానిపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డు ఇతర ప్రాంతాలలో తమ వాహనాలు పార్కింగ్ చేసుకుంటున్నారు. సితార సెంటర్ ప్రాంతంలోనూ వాహనాలు పార్కింగ్ చేసుకుంటూ ఈ సందర్భంలో ప్రజలు భక్తులందరూ ట్రాఫిక్ పోలీసువారికి సహకరించాలని మనవి. భవానిపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డు లో వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ పోలీస్ అధికారులు సిబ్బంది ఎప్పటికప్పుడు ఈ ప్రాంతంలో పర్యవేక్షణ చేస్తూ ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తున్నారు.

ట్రాఫిక్ ఏఎస్ఐ నాయక్ ట్రాఫిక్ సిబ్బంది ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్డు ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ ట్రాఫిక్ ను నియంత్రించారు. భవాని భక్తులందరూ ట్రాఫిక్ పోలీసు వారికి సహకరించాలని విజయవాడ నగర ప్రజలు దుర్గమ్మ వారి ఆలయానికి విచ్చేసిన భవాని భక్తుల జన సాంద్రత నేపథ్యంలో ట్రాఫిక్ వారికి పోలీసు వారికే సహకరించాలని విజ్ఞప్తి చేసారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం సమష్టిగా కృషి చేయాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- నవంబర్ 6 లోపు అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలి



**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 22 :**

హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

నాంపల్లిలోని రెడ్ రోజ్ గార్డెన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. హైదరాబాద్ పరిధిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీకి ఎంతో రాజకీయ ప్రాధాన్యత కలిగినవని తెలిపారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా భవిష్యత్తులో హైదరాబాద్ పరిధిలో జరిగే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని నిరూపించుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,పార్టీ సీనియర్ నాయకుల సలహాలు, సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి సామ రామ్మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు తెలిపారు. అభ్యర్థి విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు. నవంబర్ 6వ తేదీలోపు అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించే ప్రక్రియను పూర్తి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. పండుగలు ముగిసిన నేపథ్యంలో మరుసటి రోజు నుంచే పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో క్షేత్రస్థాయి కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాల్లో బూత్ అధ్యక్షులు, బ్లాక్ అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, న్యాయవాదులు తదితర అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటర్లుగా నమోదు చేయించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. హైదరాబాద్,రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించి, పీసీసీ నాయకులతో కలిసి రోజువారీగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని సూచించారు. హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా తాను, మంత్రి అజారుద్దీన్ తదితర నాయకులు క్షేత్రస్థాయి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని తెలిపారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు వేలాది ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వివిధ శాఖల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వ విజయాలను పట్టభద్రులకు వివరించడంతో పాటు, వారి సమస్యలను తెలుసుకుని పార్టీకి మద్దతు కూడగట్టాలని నాయకులకు సూచించారు.

హైదరాబాద్ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. రాబోయే నాలుగైదు రోజుల పాటు జూబ్లీహిల్స్‌తో పాటు ఇతర నియోజకవర్గాల్లో పార్టీ నాయకులతో కలిసి పర్యటించి, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎంపీ మల్లు రవి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్,శ్రీ గణేష్, ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, హైద రాబాద్ జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, 15 అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, పీసీసీ కోఆర్డినేటర్లు, పార్టీ ఫ్రంటల్ ఆర్గనైజేషన్లు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజుల ఐక్యతతోనే రాజకీయ సాధికారత సాధ్యం

**బలహీన వర్గాల ఐక్యతను దెబ్బతీసే శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**

**శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 22:**



ముదిరాజ్ సమాజం ఐక్యంగా ముందుకు సాగినప్పుడే రాజకీయంగా సాధికారత సాధ్యమవుతుందని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. బలహీన వర్గాల ఐక్యతను దెబ్బతీసే విభజన రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పండుగ సాయన్న 174వ జయంతి ఉత్సవాల్లో గురువారం ఆయన పాల్గొని ప్రసంగించారు.

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముదిరాజ్ సమాజానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాధాన్యత కల్పిస్తున్నారని మంత్రి తెలిపారు. భవిష్యత్తులోనూ ముదిరాజ్ సమాజానికి మరిన్ని కీలక పదవులు, అవకాశాలు కల్పిస్తామని చెప్పారు.

చెన్నూరు నియోజకవర్గంలో ముదిరాజ్ సోదరుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. గత మున్సిపల్ ఎన్నికల్లో 16 వార్డులకు గాను ముగ్గురు ముదిరాజ్ అభ్యర్థులకు టికెట్లు ఇచ్చి గెలిపించుకున్నామని చెప్పారు. చిరకాలంగా కోరుతున్న ముదిరాజ్ భవన్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేశామని, పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. మరో రెండు, మూడు నెలల్లో భవన నిర్మాణం పూర్తవుతుందని, ప్రారంభోత్సవానికి ముదిరాజ్ సోదరులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆహ్వానించారు.

ముదిరాజ్ సమాజానికి జన బలం ఉందని, దానిని ఐక్యతతో రాజకీయ బలంగా మలచుకోవాలని మంత్రి సూచించారు. బలహీన వర్గాల్లో చీలికలు సృష్టించి, వారిని వేర్వేరు వర్గాలుగా విడదీసి బలహీనపరిచేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తుంటాయని అన్నారు. ఇలాంటి కుట్రపూరిత విభజన రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ సమాజమంతా ఐక్యంగా ఒకే లక్ష్యంతో ముందుకు సాగినప్పుడే హక్కులను సాధించుకోవడంతో పాటు ప్రజాస్వామ్యంలో తగిన గౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం పొందగలుగుతారని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.

# ఓరుగల్లుపై అభివృద్ధి జల్లు

**వరంగల్ కోట అభివృద్ధికి ప్రభుత్వ పరిపాలన అనుమతులు**

మొత్తం రూ. 382 కోట్ల విలువైన పనులకు గ్రీన్ సిగ్నల్

వేయి స్తంభాల గుడి, బస్ టెర్మినల్ వంటి పనులకు ఆమోదం

ప్రపంచ బ్యాంకు నిధులతో 'కుడా' ఆధ్వర్యంలో పనుల నిర్వహణ

**వరంగల్, వెలుతురు అక్టోబర్ 22 :**



కాకతీయ వైభవానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ కోట అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ఖిల్లా వరంగల్‌తో పాటు హనుమకొండ నగరంలోని కీలక ప్రాంతాల్లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ. 382 కోట్ల కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులతో ఖిల్లా వరంగల్ పునరుద్ధరణ, సెంట్రల్ ప్లాజా నిర్మాణం, బస్ టెర్మినల్, వేయి స్తంభాల ఆలయం పరిసరాల అభివృద్ధి, మ్యూజికల్ గార్డెన్ వంటి కీలక ప్రాజెక్టులను చేపట్టనున్నారు. ఈ పనులన్నింటినీ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పర్యవేక్షణలో నిర్వహించనుండగా, ప్రాజెక్టుల అమలుకు ప్రపంచ బ్యాంకు నిధులను వినియోగించనున్నారు. వరంగల్ ప్రాంతంలోని చారిత్రక కట్టడాలు పరిరక్షణతో పాటు మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే విస్తృత ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పర్యాటక రంగంలో వరంగల్ నగరానికి మరింత గుర్తింపు లభించడంతో పాటు, నగర రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని అధికారులు భావిస్తున్నారు.

# చేతకాకపోతే కాంట్రాక్ట్ మాకివ్వండి!

- మంత్రి జూపల్లి సవాల్‌ను స్వీకరించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి
- తుండు కట్ట తొలగిస్తే మూడు రిజర్వాయర్లకు నీళ్లు
- కేసీఆర్‌కు పేరొస్తుందనే పాలమూరు ప్రాజెక్టు నిర్లక్ష్యం
- రైతులకు నీళ్లివ్వకుండా మూడేళ్లుగా కుంటిసాకులు చెబుతున్నారని మండిపాటు





**నార్లాపూర్, వెలుతురు అక్టోబర్ 22 :**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి దిగువకు నీటిని ఎలా తరలించాలో చెప్పాలంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు విసిరిన సవాల్‌ను స్వీకరిస్తున్నామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రకటించారు. ప్రభుత్వానికి చేతకాకపోతే జీవో జారీ చేసి నామినేషన్ పద్ధతిలో తమకు కాంట్రాక్ట్ ఇవ్వాలని, దగ్గరుండి అడ్డంకులు తొలగించి ఏదుల, వట్టెం, కరివెన రిజర్వాయర్లను నీటితో నింపి చూపుతామని సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి నార్లాపూర్ రిజర్వాయర్‌ను సందర్శించిన ఆయన కుడికిళ్ల వద్ద అడ్డంగా ఉన్న తుండు కట్టను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మంత్రి జూపల్లి వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో స్పందించారు. నీళ్లు సహజంగానే పారుతాయని, ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి జంపు చేసే గుణం వాటికి ఉండదంటూ ఎద్దేవా చేశారు.

**తుండు కట్ట తొలగిస్తే గ్రావిటీ ద్వారా నీళ్లు**

నార్లాపూర్ వద్ద అడ్డంగా ఉన్న తుండు కట్టను సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకుని తొలగిస్తే గ్రావిటీ ద్వారా దిగువ రిజర్వాయర్లకు నీటిని తరలించవచ్చని నిరంజన్ రెడ్డి తెలిపారు. నార్లాపూర్‌లోని పది పంపులు ఒకేసారి నడిస్తే కాలువ ద్వారా 26 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుందని చెప్పారు. ప్రస్తుతం రెండు పంపులు మాత్రమే నడుస్తున్నందున వాటి సామర్థ్యానికి అనుగుణంగా తుండు కట్టలో పావు భాగం మట్టిని తొలగించినా ఏదుల, వట్టేం, కరివెన రిజర్వాయర్లకు నీరు చేరుతుందని వివరించారు. మూడేళ్లుగా ఈ చిన్న పని కూడా చేయకుండా కుంటిసాకులతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే అడ్డంకులు తొలగించి నీరందించాలని డిమాండ్ చేశారు.

**కేసీఆర్‌కు పేరొస్తుందనే ప్రాజెక్టు నిర్లక్ష్యం**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 27 వేల ఎకరాల భూసేకరణ చేపట్టి రూ.35 వేల కోట్లు ఖర్చు చేసి 70 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యంతో ఏదుల, వట్టేం, కరివెన రిజర్వాయర్లను సిద్ధం చేశారని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్‌కు పేరు వస్తుందన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. జూరాల ద్వారా శ్రీశైలం ప్రాజెక్టులోకి 245 టీఎంసీల నీరు చేరినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్లక్ష్యం కారణంగా 100 టీఎంసీలకు పైగా నీరు ఆంధ్రాకు తరలిపోయిందన్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో 60 టీఎంసీల నీటి లభ్యత ఉందని, అందులో 20 టీఎంసీలను ఎత్తిపోస్తే వానాకాలం పంటలను కాపాడుకోవచ్చని తెలిపారు. తద్వారా భూగర్భ జలాలు పెరిగి ప్రజల నీటి అవసరాలు కూడా తీరుతాయన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు వెటకారపు మాటలు మానుకుని రైతులకు నీళ్లెలా అందించాలనే దానిపై దృష్టి పెట్టాలని నిరంజన్ రెడ్డి హితవు పలికారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com